RNI NO. TELTEL/2006/17406

**విలేకరులు కావలెను**
అన్ని జిల్లాల నుండి
నిఘానేత్రం దినపత్రికలో పని
చేయుటకు విలేకరులు
కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది
నంబర్‌కు సంప్రదించగలరు.
ఫోన్ - 9440090053


# నిఘానేత్రం
తెలుగు దినపత్రిక

NEEGHANETHRAM NEWS

నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ సంపుటి : 21 సంచిక : 44 పబ్లిషర్ - కోయల్‌కర్ రామ్ దయానంద్ ఆదివారం 29 సెప్టెంబర్ 2024 పేజీలు : 12 వెల : రూ. 2/-


# 'సారు యాదికొచ్చిండు'

## కాంగ్రెస్‌తో కష్టమొచ్చింది.. దెబ్బకు కేసీఆర్ గుర్తొచ్చాడు



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి పది నెలలు పూర్తయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 65 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక అధికార బీఆర్ఎస్ 39 సీట్లకు పరిమితమైంది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. పూర్తిగా సైలెంట్ అయ్యారు. ఫామ్‌హౌస్‌లో కాలుజారి పడడంతో తుంటి విరిగింది. ఆపరేషన్ తర్వాత మూడునాలుగు నెలలు బెడ్‌కే పరిమితమయ్యారు. లోక్‌సభ ఎన్నిలవేళ మూడు నెలల క్రితం కేసీఆర్ ప్రచారం కోసం చేతికర్రసాయంతో తెలంగాణ భవన్‌కు వచ్చారు. పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. బస్సు యాత్ర చేపట్టారు. కానీ, కేసీఆర్ ఆశించిన ఫలితం రాలేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌కు క్యూ కడుతున్నారు. ఇప్పటికే 10 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరారు. అనేక మంది నేతలు కూడా హస్తం తీర్థం పుచ్చుకున్నారు. దీంతో బీఆర్ఎస్ అధినేత బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

**కాంగ్రెస్ వైఫల్యం..** ఇదిలా ఉంటే.. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీల అమలుకు ఇబ్బంది పడుతోంది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే పూర్తిగా అమలవుతోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొంత మందికే చేరుతోంది. రూ.500 సిలిండర్ కూడా అర్హులందరికీ అందలేదు. ఇక రూ.2 లక్షల రుణమాఫీ హామీ పూర్తిగా నెరవేరలేదు. ఇప్పటికీ 30 శాతం రైతులకు రుణాలు మాఫీ కలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు, 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీలు ఇంకా అమలు కాలేదు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన తొలి నోటిఫికేషన్ డీఎస్సీ. పరీక్ష నిర్వహించి రెండు నెలలు గడిచినా ఫలితాలు ప్రకటించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం పరీక్ష నిర్వహించిన ఉద్యోగాల ఫలితాలు ప్రకటించి నియామక ఉత్తర్వులు ఇచ్చి.. తామే చేశామని ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో అన్నివర్గాల్లో క్రమంగా కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోంది.

**హైదరాబాద్ వాసుల్లో ఆగ్రహం..** ఇక హైదరాబాద్ వాసుల్లో అయితే ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ముఖ్యంగా హైడ్రా బాధితులు, మూసీ ప్రక్షాళన కారణంగా బలవంతంగా ఇళ్లను ఖాళీ చేస్తున్న బాధితులు కాంగ్రెస్ సర్కార్‌పై మండి పడుతున్నారు.

ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డిపైనే మండిపడుతున్నారు. ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నారు. ఉన్నఫలంగా వెళ్లిపోమంటే ఎక్కడకి వెళ్లాలని మండిపడుతున్నారు. దీని ప్రభావం జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కనిపిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న రైతులు..** ఇదిలా ఉంటే.. గ్రామాల్లో రైతులు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. రుణమాఫీ హామీ నెరవేరకపోగా.. రైతుబంధు ఆగిపోయింది. రైతుభరోసా కింద పంటకు రూ.7,500 ఇస్తామని చెప్పిన రేవంత్ మాట నిలబెట్టుకోలేదు. వానాకాలం పంట పూర్తికావొస్తున్నా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇక వర్షాలు, వరదలు, తెగుళ్లతో పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలని, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె అని తలుచుకుంటున్నారు. వృద్ధులు కూడా పింఛన్ రూ.4 వేలు అవుతుందనంటే కాంగ్రెస్‌కు ఓటేశామని చెబుతున్నారు. రేవంత్‌రెడ్డి గెలిచి ఏడాది కావొస్తున్నా పింఛన్ పెరగలేదని పేర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌నే గెలిపించుకుంటామని మాట్లాడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను రైతులు తలుచుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు కూడా స్పందిస్తున్నారు. రేవంత్‌రెడ్డి కూల్చివేతలతో ఎప్పుడైనా ఇలా తలుచుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చినంక కష్టాలు వస్తున్నాయని.. కేసీఆరే రావాలని కొందరు కామెంట్లు పెడుతున్నారు.

# మహిళే యజమాని!

## కుటుంబ డిజిట్ కార్డుపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం




హైదరాబాద్: కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలు కార్డు వెనుక ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు (ఎఫ్‌డీసీ) సంబంధించి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ఈ నెల 25వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించిన అధికారులు చేసిన అధ్యయనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్డుల రూపకల్పలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కార్డుల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిహరించాలన్నారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం సేకరించాల్సిన పని లేదన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో పైలెట్‌గా రెండు ప్రాంతాల్లో... ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సమచార సేకరణ, వాటిల్లో ఏం ఏం పొందుపర్చాలి, అప్‌డేట్‌కు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసిం హాలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలను సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాలు ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం సూచించారు. (పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు గ్రామాలు, పూర్తిగా పట్టణ/నగర ప్రాంతాలు ఉన్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు/ డివిజన్లను ఎంపిక చేస్తారు.) కుటుంబాల నిర్ధరణ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబరు మూడో తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి (డోర్ టూ డోర్) పరిశీలన చేయించాలని రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టును పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని, పట్టణ/నగర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రేవంత్ ఆదేశించారు.

క్షేత్ర స్థాయి పరిశీలన సమగ్రంగా కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు అజిత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యానారాయణ, మాణిక్ రాజ్, షానవాజ్ ఖాసీం, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







## సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ విద్యావేత్తల బహిరంగ లేఖ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ విద్యావేత్తలు బహిరంగ లేఖ పంపారు. లేఖ రాసిన వారిలో ఎమ్మెల్సీ కోదండరామ్, హరగోపాల్, ఘంటా చక్రపాణి, దొంతి నరసింహరెడ్డి ఉన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నామమాత్రం ఫీజుతో విద్య అందిస్తున్న ఏకైక వర్సిటీ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అని చెప్పారు. దీన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని పేర్కొన్నారు.

## యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తాపడం.. పనుల నిర్వహణకు ఉత్తర్వులు జారీ



యాదాద్రి : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సారథ్యంలో జరిగిన సమావేశాల్లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి చొరవతో దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి ఇచ్చారు. వెంటనే ఆ పనులను ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బంగారు తాపడం పనుల బాధ్యతలను స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులు స్వామి బ్రహ్మోత్సవాల నాటికి ముందే 2025 మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఛైర్‌పర్సన్‌గా, దేవాదాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ ఉపాధ్యక్షుడు జి.కిషన్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బంగారు తాపడం పనులను పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలివ్వనున్నారు. ఈ మేరకు బంగారు తాపడం పనులు, ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సంబంధించి రెండు వేర్వేరు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణకు అనుమతులను మంజూరు చేస్తూ మరో జీవో జారీ చేసింది.

## పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటి?: హరీశ్‌రావు

హైదరాబాద్: తమ ఎమ్మెల్యేల బృందంతో హైడ్రా బాధితుల ఇళ్లను సందర్శిస్తామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో ఆయన సమావేశమై మాట్లాడారు. భారాస లీగల్ సెల్ నుంచి వారికి సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలి కానీ.. వారి గోసలు కాదని చెప్పారు. “హైదరాబాద్ ఖ్యాతిని రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి.. పేదల ఇంటికి మాత్రం బుల్డోజర్లా? అఖిలపక్ష సమావేశం నిర్వహించి మూసీపై ముందుకెళ్లాలి. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటి?” అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

**బుల్డోజర్ల కంటే ముందు మేం వస్తాం: సబితా ఇంద్రారెడ్డి...** భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. తామంతా హైడ్రా బాధితులకు అండగా ఉంటామన్నారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఇల్లు చెరువులో ఉందని విమర్శించారు. బాధితుల వద్దకు బుల్డోజర్లు వస్తే వాటికంటే ముందు తాము వస్తామని చెప్పారు.






## ఈ మార్క్ చూస్తే వణుకుతున్న హైదరాబాదీలు..

హైదరాబాద్: భాగ్యనగరంలో చెరువులు, నాలాలు, పార్కుల సమీపంలో ఉండే ఇళ్ల యజమానులు హైడ్రా పేరు చెబితేనే వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ బుల్డోజర్ వచ్చి.. తమ ఇంటిని కూల్చేస్తుందోనని భయంతో వణికిపోతున్నారు.

ఈ భయానికి తోడు.. నగరవాసుల్లో కొత్త ఆందోళన ఒకటి మొదలైంది. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై తాజాగా అధికారులు ‘RB-X’ అనే గుర్తు వేస్తున్నారు. సర్వే పేరుతో అనేక ఇళ్లపై ఈ గుర్తు వేశారు. ముందుగా సర్వే చేపట్టి.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో వచ్చే ఇళ్లకు ఇలా RB-X అని రాస్తున్నారని.. ఆ తర్వాత పోలీస్ బందోబస్తుతో బుల్డోజర్లతో వచ్చి.. తమ ఇళ్లను కూల్చేస్తారని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అసలు ఈ RB-X అంటే ఏంటో తెలుసుకుందాం.

**హైడ్రా అధికారులా? :** మూసీ నది పరివాహక ప్రాంతంలో రెండుమూడు రోజులుగా కొందరు అధికారులు పర్యటిస్తున్నారు. మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై RB-X అని పెద్ద అక్షరాలతో పెయింట్ వేస్తున్నారు. తమ ఇళ్లను కూల్చేందుకు అధికారులు సర్వే చేసి.. నంబర్ వేస్తున్నారంటూ స్థానికులు భయపడి.. అధికారులపై తిరగబడుతున్నారు. అయితే, మార్కింగ్ వేస్తున్న వారు హైడ్రా అధికారులు కాదు. వారు రెవెన్యూ శాఖకు చెందిన వారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది.

అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై RB-X అని రాశారు. ఆర్బీఎక్స్ అంటే Riverbed Extreme. అంటే పునరావాసం కల్పించాల్సిన ఇల్లు అని అధికారులు తెలిపారు.

## హైడ్రాను బూచిగా చూపిస్తే.. భవిష్యత్ తరాలకు నష్టమే: రంగనాథ్

హైదరాబాద్: ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. “కొన్ని కట్టడాలు కూల్చితే హైడ్రా బాగా పనిచేస్తోందని కితాబు ఇచ్చారు. ఇప్పుడేమో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అక్రమకట్టడాలను మాత్రమే కూల్చివేశాం. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అయ్యాయి. అమీన్‌పూర్‌లో ఒక ఆసుపత్రిపై అధికారులు గతంలో చర్యలు తీసుకున్నా మళ్లీ నిర్మించారు. ఆ ఆసుపత్రిని కూల్చిన సమయంలో అందులో రోగులెవరూ లేరు. వీడియోకూడా రికార్డు చేశాం. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేశాం.. దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదు. ప్రజలు నివసిస్తున్న భవనాలను ఎక్కడా కూల్చలేదు. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయడంలేదు. సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆక్రమణలు కూల్చివేస్తున్నాం. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలు కూల్చివేశాం. పేదలు, మధ్యతరగతి ప్రజలు చెరువులు ఆక్రమించరు. అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే ముఖ్యమంత్రి హైడ్రాను తీసుకొచ్చారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోం. ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు చెరువులు నాలాలను కాపాడుకోలేం.

పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదు. ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయి. విద్యా సంవత్సరం నష్టపోతారనే వాటిపై చర్యలుతీసుకోలేదు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత. హైడ్రాను బూచిగా చూపించి ప్రజలను భయపెడితే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుంది. చెరువులు, ప్రభుత్వ భూములను ఎవరూ కాపాడలేరు. జన్వాడ ఫామ్‌హౌస్ 111 జీవో పరిధిలో ఉంది. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదు” అని రంగనాథ్ వివరించారు.




రానున్న ఏడాదిలో నిర్వహించబోయే 10, 12 బోర్డు పరీక్షలు సీసీటీవీ నిఘాలోనే జరపాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయించింది. ఈ మేరకు అనుబంధ పాఠశాలకు ఆదేశాలు జారీ చేసింది. 2025లో జరగనున్న బోర్డు పరీక్షా కేంద్రాల్లో నిఘా కెమెరాలు తప్పనిసరి చేసినట్లు అందులో పేర్కొంది. ఈవిషయాన్ని తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది. 2025లో సీబీఎస్ఈ నిర్వహించే పరీక్షల్లో భారత్‌తో పాటు 26 దేశాల్లో కలిపి సుమారు 44 లక్షల మంది హాజరవుతారని బోర్డు అంచనా వేసింది. ఈమేరకు పెద్దఎత్తున వసతి కల్పించాలని సుమారు 8,000 పాఠశాలల్ని పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసింది. వాటిలో సీసీటీవీ నిఘాని తప్పనిసరి చేస్తూ ఆయా పాఠశాలలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సీసీటీవీ సౌకర్యం లేని ఏ పాఠశాలను పరీక్షా కేంద్రంగా పరిగణించేది లేదని అందులో స్పష్టంచేసింది. రికార్డ్ ఫుటేజీ సంబంధిత అధికారులు మాత్రమే చూసేందుకు వీలుంటుందని పరీక్షా ఫలితాలు వచ్చిన రెండు నెలల వరకు ఈ ఫుటేజీ భద్రంగా ఉంటుందని పేర్కొంది. ప్రతీ పది గదులకు లేదా 240 మంది విద్యార్థుల బాధ్యత తీసుకొనేందుకు ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమిస్తున్నట్లు తెలిపింది. కొత్తగా తీసుకొచ్చిన సీసీటీవీ విధానం ద్వారా పారదర్శకత, పర్యవేక్షణ సామర్థ్యాలు పెరుగుతాయని సీబీఎస్ఈ భావిస్తోంది. వీటి సాయంతో ఎటుంటి ఆటంకం లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రతీ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఈ క్రమంలోనే ఏఐ సాంకేతికతతో రూపొందించిన పరికరాలు మార్కెట్‌లోకి వచ్చి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా ఏఐతో పనిచేసే శునకం ప్రస్తుతం అందరినీ ఆకర్షిస్తుంది. చెన్నైలోని ఓ పాఠశాలలో ఏర్పాటుచేసిన విజ్ఞాన ప్రదర్శనలో ఈ చిట్టి ఏఐ డాగ్ అందరినీ ఆకట్టుకుంది. చెన్నైలోని బిర్లా ప్లానిటోరియంలో పాఠశాల, కళాశాలల విద్యార్థుల కోసం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొందరు యువకులు ‘లెట్స్ మేక్ ఎడ్యుకేషన్ బెటర్’ అనే చిట్టి రోబో డాగ్‌ని ప్రదర్శించారు. ఇది అచ్చం సాధారణ శునకంలాగే ప్రవర్తించడంతో అక్కడివారందరినీ ఆకర్షించింది. ఇక, ఈ చిట్టి రోబో డాగ్ 25 కేజీల బరువు ఉంటుందని దీని నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. ఇది సాధారణ శునకాల మాదిరిగానే షేక్‌హ్యాండ్ ఇవ్వడం, ఎగరడం, కాళ్లపై కూర్చోవడంతో పాటు పనులు సైతం చేస్తుందట. అంతేకాదు దీన్ని స్మార్ట్‌ఫోన్ సాయంతో నియంత్రించవచ్చు. ఇందులో హెచ్‌డీ కెమెరా అమర్చి ఉండడంతో ఇంటికి భద్రతా పరికరంగా పనిచేస్తుంది. దీని బ్యాటరీ దాదాపు గంటసేపు వస్తుందని దీని తయారీకి నేతృత్వం వహించిన ఆకాశ్ తెలిపారు. ఏఐ సాంకేతికతతో కూడిన వస్తువులు ఎంత వేగంగా ఆవిష్కృతమవుతున్నాయో పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ రోబో డాగ్ తయారుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా తమిళ హీరో రజినీకాంత్ రోబో సినిమా ఆధారంగా దీనికి చిట్టి అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. ఇక, 2010లో వచ్చిన రోబో చిత్రంలో వసీకర్ పాత్రలో రజినీకాంత్ సృష్టించిన రోబో పేరు చిట్టి.

## మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహం



హైదరాబాద్: మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీకెంట్ ఫైల్స్‌పై వెంకటేశ్వర్లు చెప్పిన సమాధానంపై మండిపడ్డారు. తన వద్ద ప్లాన్స్, డిజైన్స్ ఉన్నాయని... కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇస్తారా?అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. గతంలో కాళేశ్వరం ఈఎన్సీగా పని చేసిన వెంకటేశ్వర్లు శనివారం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి ఆయను కమిషన్ ప్రశ్నించింది. ప్రత్యేకంగా మేడిగడ్డ ఆనకట్టకు సీకెంట్ ఫైల్స్ వినియోగించమని ఎవరు సూచించారని కమిషన్ ఛైర్మన్ ప్రశ్నించగా.. సీడీవో సీఈ సూచనల మేరకు ఇలా చేశానని సమాధానమిచ్చారు. దీనిపై కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని ఘాటుగా జస్టిస్ ఘోష్ వ్యాఖ్యానించారు.

అయితే, తన సమాధానాన్ని సరిచూసుకునే అవకాశం ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరగా.. దీనికి అంగీకరించబోనని తేల్చి చెప్పారు. తగిన దస్త్రాలు సమర్పిస్తే సవరించుకునే అవకాశం ఇస్తామని అన్నారు. తనకు ఆంగ్లంపై పూర్తిగా పట్టు లేదని వెంకటేశ్వర్లు తెలపగా.. ఆంగ్లంపై పట్టు లేకుండానే కాళేశ్వరం సీఈగా ఎలా పని చేశారని కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

## ‘హైడ్రా’ భయంతో మహిళ ఆత్మహత్య.. స్పందించిన కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్: కూకట్‌పల్లి యాదవ బస్తీలో గుర్రాంపల్లి బుచ్చమ్మ అనే మహిళ ‘హైడ్రా’ భయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గుర్రంపల్లి శివయ్య, బుచ్చమ్మ దంపతులకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. శివయ్య దంపతులు వారికి పెళ్లిళ్లు చేసి కట్నంగా తలో ఇల్లును రాసి ఇచ్చారు. అయితే జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ బిడ్డలకు ఇచ్చిన ఇళ్లు కూల్చివేస్తారనే మనస్తాపంతో తల్లి బుచ్చమ్మ బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఈ సంఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా ఎవరికి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. బుచ్చమ్మ ఆత్మహత్యపై కూకట్‌పల్లి ఇన్స్‌పెక్టర్‌తో మాట్లాడాను. శివయ్య దంపతుల కూతుర్లుకు రాసిచ్చిన ఇళ్లు కూకట్‌పల్లి చెరువుకు సమీపంలోనే ఉన్నప్పటికీ ఎఫ్‌టీఎల్ పరిధికి దూరంగా ఉన్నాయి. కూల్చివేతల్లో భాగంగా తమ ఇళ్లను కూలుస్తారనే భయంతో వారి కూతుర్లు బుచ్చమ్మను ప్రశ్నించారు. దీంతో మనస్తాపానికి గురైన బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో హైడ్రాకు సంబంధం లేదు. హైడ్రా గురించి మీడియాలో గానీ, సామాజిక మాధ్యమాల్లోగానీ భయాలు పుట్టించవద్దని కోరుతున్నాను. రాష్ట్రంలో జరుగుతున్న కూల్చివేతలను హైడ్రాకు ఆపాదిస్తున్నారు. కూల్చివేతలకు సంబంధించి మూసీ పరిధిలో చేపట్టిన ఏ సర్వేలోనూ



హైడ్రా భాగం కాలేదు. మూసి నదిలో శనివారం భారీగా ఇళ్లను కూల్చివేయబోతున్నట్లు నకిలీ వార్తలు విపరీతంగా ప్రచారం అవుతున్నాయి. కొన్ని సోషల్ మీడియా ఛానళ్లు ప్రత్యేక ఎజెండాతో హైడ్రాపై అవాస్తవ, నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయాన్ని మీడియా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. హైడ్రా కూల్చివేతల గురించి అనవసర భయాలు వద్దు. పేదలు, మధ్యతరగతి ప్రజలు కూల్చివేతల వల్ల ఇబ్బందులు పడవద్దని, దీనికి సంబంధించి ప్రభుత్వం కచ్చితమైన సూచనలు జారీ చేసింది” అని రంగనాథ్ పేర్కొన్నారు.

## హైడ్రా తీరుపై స్వయంగా పాట పాడిన బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 28: చెరువుల్లో అక్రమ నిర్మాణాలపై ఫోకస్ పెట్టిన హైడ్రా జెట్‌స్పీడులో కూల్చివేతలు చేపట్టింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పేదలకు చెందిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. దీంతో హైడ్రాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా హైడ్రా కూల్చివేతలపై కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. హైడ్రా తీరుపై కేంద్ర మంత్రి స్వయంగా పాట పాడి వినిపించారు. “పారాణి ఇంకా ఆరణలేదు. తోరణాల కల వాడనేలేదు” అంటూ పాట పాడి సెటైర్లు విసిరారు. ఇప్పటి వరకు జరిగిన కూల్చివేతలన్నీ హిందువులవే అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ముస్లింలకు సంబంధించిన ఏ ఒక్క బిల్డింగ్ కూల్చలేదన్నారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ కొరివితో తల గోక్కుతోందన్నారు. హైడ్రాకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ హైడ్రా నిర్ణయం వల్ల పేదలు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. రేపు మూసీ వల్ల పేద ప్రజలకు తీరని అన్యాయం జరగనుందన్నారు. మూసి పేరిట లేని ఇబ్బందులు తెస్తున్నారని తెలిపారు. గతంలో ఒకాయన ఇలా అని ఫామ్ హౌస్ లో పడుకున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. జీతాలు ఇవ్వడానికి, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలకు డబ్బులు లేవని.. లోకల్ బాడి ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా డౌన్ అవుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఒకటే గతి పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ మరో శ్రీలంక కాబోతోందంటూ కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధులే అంశంగా ఎన్నికలకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సిద్ధమా అంటూ సవాల్ విసారారు. గతంలో ఇచ్చిన నిధులపై లోకల్ బాడి ఎన్నికలకు రావాలి అంటూ రెండు పార్టీలకు బండి ఛాలెంజ్ విసిరారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని మనవి చేశారు.

నిఘానేత్రం
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 సెప్టెంబర్ 2024

# సంపాదకీయం

## ప్రపంచానికి కొత్త సమస్య ఏమిటీ సిల్వర్ సునామీ?

ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకు అధిక జనాభా పెద్ద సమస్యగా ఉండేది. ఆ సమయంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రభుత్వాలు బలంగా ప్రోత్సహించేవి. అధికంగా పెరుగుతున్న జనాభా వల్ల పేదరికం విస్తరిస్తుందనే కామెంట్లు అప్పట్లో ఎక్కువగా వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచానికి సిల్వర్ సునామీ సమస్య ఎదురవుతుంది. అవును... ప్రపంచ వ్యాప్తంగా జనాభా వృద్ధిరేటు నెమ్మదిస్తుంది. పలు దేశాల్లో యువత పెళ్లిల్లు చెసుకోవడానికి, పిల్లలను కనడానికి పూర్తిగా వెనకాడుతుందని అంటున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. ఈ విధంగా... యువతరం సంఖ్య తగ్గి, వయోధికుల సంఖ్య పెరుగుతున్న ఈ పరిణామానికి "సిల్వర్ సునామీ"గా నామకరణం చేశారు ఆర్థిక శాస్త్రవేత్తలు. ప్రస్తుతం ప్రపంచదేశాలకు ఈ సిల్వర్ సునామీ సమస్య పెద్దగా మారబోతోంది. కారణం... ప్రపంచ వ్యాప్తంగా వయోధికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంటున్నారు. 2022 ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం... ప్రపంచంలో సుమారు 77.1 కోట్ల మంది 65 ఏళ్లు పైబడినవారే ఉన్నారు. అంటే ప్రపంచంలోని మొత్తం జనాభాలో వీరి వాటా సుమారు 10% అన్నమాట! అయితే... ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింతగా పెరగబోతోందని.. ఈ పెరుగుదల 2050 నాటికి 16 శాతంగా 2100 నాటికి 24 శాతంగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే ఇటలీ, జపాన్, ఫిన్లాండ్ వంటి దేశాల్లో 65 ఏళ్లు పైబడివారి సంఖ్య భారీగా ఉంది. ఇందులో భాగంగా... జపాన్ లో వీరి సంఖ్య అత్యధికంగా సుమారు 30శాతం ఉందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఇటలీలో 24 శాతం, ఫిన్లాండ్ లో 23 శాతంగా 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య ఉందని అంటున్నారు. ప్రస్తుతానికి ఆసియా, ఆఫ్రికా దేశాల్లో మాత్రం వీరి సంఖ్య 2% కంటే తక్కువే నమోదవుతోందని చెబుతున్నారు. అయితే ముందు ముందు మాత్రం కచ్చితంగా పెరుగుతుందని అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చె 30 ఏళ్లలోనే ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాల్లో ప్రతీ నలుగురిలో ఒకరు 65 ఏళ్లు పైబడినవారే ఉంటారని చెబుతున్నారు.

**భారత్ లో పరిస్థితి..?:** ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉన్న భారత్ లో.. అత్యధిక యువశక్తి ఉన్నారు. దీంతో... ఇప్పటికిప్పుడు భారత్ కు ఈ సిల్వర్ సునామీ సమస్య లేదనే చెప్పాలి. అయితే... జనాభా పెరుగుదల రేటు తగ్గుదల నేపథ్యంలో 2050 నాటికి ఇప్పటికే జపాన్, ఐరోపాలు ఎదుర్కొంటున్న ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తునారు. భారత్ లో ప్రస్తుతం 60 ఏళు పైబడినవారి సంఖ్య సుమారు 10 కోట్ల వరకూ ఉందని.. ఈ సంఖ్య 2050 నాటికి 24 కోట్లకు చేరుకుంటుందని.. ఈ క్రమంలో 2100కల్లా ఆ సంఖ్య మూడింతలు అవుతుందని అంచనావేస్తున్నారు.

**- కోయల్ కార్ రామ్ దయానంద్**

# పవన్ వీర హిందూత్వ...టీడీపీని కలవరపెడుతోందా ?



పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడు కంటే ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యే ఒక సగటు మనిషిగానే అంతా చూడాల్సి ఉంటుంది. ఆయనకు ఏ విషయం మీద అయినా కమిట్మెంట్ ఉందంటే దానిని ఆయన ఎక్కడా దాచుకోరు. అంతే కాదు ఆయన బలంగా గట్టిగా చెప్పాల్సిన చోట చెబుతారు. పవన్ స్వభావమే అంత. ఆయన దేనికీ ఎవరికీ భయపడరు. ఆయన ఈ దేశాన్ని ఎక్కువగా ప్రేమిస్తారు. దేశంలోని సనాతన ధర్మం పట్ల కూడా ఆయనకు ఉన్న అంకితభావం ఏమిటో తాజాగా ఆయన చెప్పిన మాటలు చేసిన ప్రసంగాలు చూస్తే అర్ధం అవుతుంది. పవన్ కళ్యాణ్ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ అయిన విషయంలో తీవ్రంగా కలత చెందారు అన్నది తెలిసిందే. అందుకే ఆయన ప్రాయశ్చిత్త దీక్షకు పూనుకున్నారు. అంతే కాదు కనకదుర్గమ్మ వారి మెట్లను కడగడం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అంతే కాదు సనాతన ధర్మం పట్ల చులకనగా మాట్లాడరాదు అని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తాను ఉన్న సినీ సీమలో ఎవరు అయినా ఎలాంటి మాట మాట్లాడినా ఆయన సహించలేకపోయారు. ఆఖరుకు అది ప్రకాష్ రాజ్ అయినా కార్తీ అయినా పవన్ స్టాండ్ ఒక్కటే. ఆయన ఆవేశంగానే బదులిచ్చారు. మరోవైపు చూసుకుంటే హిందూ ధర్మానికి ఇబ్బంది కలుగుతూంటే హిందువులు అంతా బయటకు రావాలి కదా వారు వచ్చి తమ సంఘీభావం తెలియచేయాలి కదా పవన్ కోరిన తీరు కానీ ఇచ్చిన పిలుపు కానీ ఎన్న తగినదే. ఒక సగటు రాజకీయ నేత నుంచి ఎవరూ ఇలాంటి పిలుపుని ఆశించలేరు. వారి ఎన్నో కొలతలు లెక్కలు పారామీటర్లు పెట్టుకుని ఆలోచిస్తారు. కానీ ముందే చెప్పుకున్నట్లుగా పవన్ కళ్యాణ్ కమిట్మెంట్ ని ఎవరూ శంకించలేరు. అయితే పవన్ లో ఈ వీర హిందూత్వ వైఖరి ఆయన ఆవేశం టీడీపీ కూటమిలోని బీజేపీకి అయితే మహా సంతోషంగా ఉంటోంది. కానీ అదే కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీకి మాత్రం ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.

ఎందుకంటే టీడీపీ లడ్డూ కల్తీ ఇష్యూ తానుగా బయటపెట్టినా ఒక పరిమితికి లోబడే కామెంట్స్ చేసింది. పైగా టీడీపీ కామెంట్స్ అన్నీ జగన్ చుట్టూనే అల్లుకుని సాగాయి. ఆయననే కార్నర్ చేస్తూ వెళ్లాయి. దాని వల్ల బహువిధాలుగా లాభాలను టీడీపీ ఆశించింది. మధ్యలో పవన్ వీవ హిందూత్వ ఎపిసోడ్ లేకపోయి ఉంటే కనుక టీడీపీ ప్లాన్స్ నూరు శాతం పారేవి. అయితే పవన్ ఆవేశంతో చేసిన కొన్ని కామెంట్స్ వల్లనే ఇపుడు టీడీపీలో చర్చ సాగుతోంది. అదే సమయంలో మాజీ ఎంపీ హర్ష కుమార్ లాంటి వారు అంతా పవన్ మీద విమర్శలు చేస్తూ వచ్చారు. దళితులను ముందుకు తెచ్చి మరీ వారు టీడీపీ కూటమి తీరుని ఎండగట్టారు. అలాగే ఇతర వర్గాల గురించి కూడా వారు మద్దతుగా మాట్లాడుతూ బీజేపీ మూసలోకి టీడీపీ కూటమి వెళ్తోంది అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంకో వైపు చూస్తే పవన్ ప్రవచించిన సనాతన ధర్మం అన్నది కూడా లడ్డూ కల్తీ అయిన ఇష్యూని దాటి ఒక బిగ్ డిబేట్ గా సాగింది. వామపక్షాలు అయితే దీని మీద ఫైర్ అయ్యారు. ఏపీలో అధికారం ఇస్తే మత రాజకీయాలు చేస్తారా అని వామపక్ష నేతలు విరుచుకుపడుతున్నారు. మరో వైపు కొన్ని వర్గాలలో కూడా సందేహాలు రేపేలా ఇటీవల పరిణామాలు ఉన్నాయని అంటున్నారు. అయితే పవన్ కళ్యాణ్ ఆవేశం వెనక అంకితభావం ఉంది. అర్ధం ఉంది. ఆయన రాజకీయ సమీకరణలు లెక్కలు కాకుండా అతీతంగానే మాట్లాడుతారు. దాంతోనే ఇపుడు టీడీపీలో చర్చ సాగుతోంది. పవన్ వీర హిందూత్వ వల్ల ఇబ్బందులు వస్తాయా అని సందేహాలు ఉన్నా కూడా టీడీపీ అయితే ముందుకు సాగిపోవడం తప్ప చేసేది ఏమీ లేదని అంటున్నారు. ఏది ఏమైనా పవన్ మొదటి మూడు నెలలూ సైలెంట్ గానే ఉన్నారు. ఎన్నికల తరువాత ఆయన మరోసారి తన అవేశాన్ని ప్రదర్శించారు. ఇపుడు అధికారంలో కూటమి ఉంది కాబట్టే అది ఏమైనా వేరే సంకేతాలు ఇస్తుందా అన్నదే మల్లగుల్లాలు పడుతున్నారుట.

## అమ్మ నిర్మలమ్మా.. బీజేపీ కోసం బెదిరింపులా?!

బీజేపీ నాయకురాలు, రాజ్యసభ ఎంపీ నిర్మలా సీతారామన్ చిక్కుల్లో పడ్డారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్.. బీజేపీకి నిధులు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. అది కూడా కర్ణాటకలో కావడం గమనార్హం. కర్ణాటకకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలను ఆమె బెదిరించారని, బీజేపీకి ఎన్నికల విరాళాలు ఇవ్వాలని ఒత్తిడి చేశారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ విషయాన్ని సామాజిక ఉద్యమ సంస్థ -జనాధికార సంఘర్ష పరిషత్తు%-%కు చెందిన ఆదర్శ్ అయ్యర్ వెలు గులోకి తీసుకువచ్చారు. ఈ ఏడాది జరిగిన పార్లమెంటు, గతంలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమ యంలో బీజేపీకి ఆర్థికంగా వనరులు సమీకరించేందుకు నిర్మలా సీతారామన్ ప్రయత్నించారని, ఈ క్రమంలో పారిశ్రామిక వేత్తలను ఆమె




బెదిరించారన్నది అయ్యర్ ఆరోపణ. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా ఆయన వెలుగులోకి తీసుకుచ్చారు. అయితే.. ఈ ఆధారాలను బహిర్గతం చేయకుండా పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయాలని కోరారు. కానీ, బెంగళూరులోని తిలక్‌నగర పోలీసు స్టేషన్ సిబ్బంది కేసు నమోదు చేసేందుకు తిరస్కరిం చారు. ఈ విషయంపై బెంగళూరు పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో నేరుగా ఆదర్శ్ అయ్యర్ ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. తక్షణమే నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో నిర్మలమ్మ చేసిన పని వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆమెపై ఎఫ్ ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులు రెడీ అయ్యారు. అయితే.. ఈ వ్యవహారంపై ఇటు బీజేపీ కానీ, అటు సీతారామన్ కానీ.. ఇప్పటి వరకు స్పందించ లేదు. ఎఫ్ ఐఆర్ నమోదు అంశాన్ని కాంగ్రెస్ పార్టీ కీలకంగా తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వ్యవహారం కావడంతో ఇది రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం కనిపిస్తోంది.

## సర్వే సంచలనం: మూసీ వల్ల సంతాన సమస్యలు

పల్లెటూరు అంటేనే చుట్టూ పచ్చని వాతావరణం.. పచ్చని చెట్లతో కళకళలాడుతుంటుంది. స్వచ్ఛమైన గాలి కావాలంటే పల్లెల బాట పట్టాల్సిందే. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల చదువు నిమిత్తం.. లేదంటే ఉపాధి కోసం గ్రామాల నుంచి చాలా మంది ప్రజలు పట్టణాలకు వలస వెళ్తున్నారు. పల్లెల స్వచ్ఛతను కోల్పోతున్నారు. ఎందుకంటే.. పల్లెల ఉన్న వాతావరణం పట్టణాల్లో కనిపించదు. వాయు, ధ్వని కాలుష్యం విపరీతంగా ఉంటుంది. అందులోనూ దేశ రాజధాని అయిన ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ బెదద ఎక్కువగా కనిపిస్తోంది. కాలుష్యాల వల్ల మరో ప్రధాన సమస్య తెరమీదకు వచ్చింది. కాలుష్యం కారణంగా గాలిలోని రసాయనాలు రక్తం ద్వారా పునరుత్పత్తి వ్యవస్థలోకి చొచ్చుకెళ్లి హార్మోన్లను అస్తవ్యస్తం చేస్తాయట. నేరుగా అండాలు, శుక్ర కణాలనూ దెబ్బతీయొచ్చని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అలాగే.. హైదరాబాద్



నగరంలోని మూసీ నదిలో కొన్ని దశాబ్దాలుగా కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో మూసీ పరిధిలోని ప్రాంతాల్లో సంతానలేమి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. మూసీ పరిధిలోని కూరగాయలు, నాన్ వెజ్ తినే మహిళల్లో సంతానలేమి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు సర్వేలు తెలిపాయి. సంతానలేమితోపాటు చర్మ సమస్యలు కూడా పెరుగుతున్నట్లు చెప్పాయి. ఆ బెల్ట్ పరిధిలోని చాలా మంది ప్రజలు చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని సర్వేలు పేర్కొన్నాయి. ఇదే క్రమంలో రేవంత్ సర్కార్ మూసి ప్రక్షాళనకు దిగింది. దాని పరిధిలోని అక్రమ కట్టడాలను తీసేసి.. వారికి మరోచోట డబుల్ బెడ్ రూములు కేటాయించి.. మూసీని పూర్తి ప్రక్షాళన చేసేందుకు సర్కార్ నిర్ణయించింది. ఓ టూరిజం హబ్‌లాగా అక్కడి పరిసరాలను మార్చేలా ప్లాన్ చేయించింది. ఇప్పుడిప్పుడే మూసీ ప్రక్షాళనపై అడుగులు పడుతుండడంతో అక్కడి ప్రజలకు ఈ వ్యాధుల బారి నుంచి బిగ్ రిలీఫ్ దొరకనుంది.

# రేకులకుంట చెరువు మాయం

మహబూబ్‌నగర్ : నారాయణపేట జిల్లా కోస్గి మండలం బొలవానిపల్లిలో వివిధ సర్వే నంబర్లలో 19.35 ఎకరాల్లో రేకులకుంట చెరువుకు 1991లో నీటిపారుదల శాఖ అధికారులు భూసేకరణ చేశారు. ఇందులో 14.28 ఎకరాలను ఆ శాఖ పట్టాదారుల నుంచి సేకరించింది. భూసేకరణలో భాగంగా రైతులకు పరిహారం చెల్లించారు. ఇదే ప్రాంతంలో మరో 5.07 ఎకరాల్లో ప్రభుత్వ స్థలం కూడా ఉంది. మొత్తం కలిపి 19.35 ఎకరాల్లో రేకులకుంట చెరువును వివిధ దశల్లో అభివృద్ధి చేశారు. ఈ చెరువుకు అప్పట్లో భారీ కట్టను కూడా నిర్మించారు. వర్షాలు కురిస్తే సమీపంలోని గుట్టల నుంచి ఈ చెరువులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. దీనికి ప్రత్యేకంగా పాటు కాలువలు ఉన్నాయి. తర్వాత ఈ చెరువును పట్టించుకోపోవడంతో స్థానికులు కొందరు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అసలిక్కడ చెరువు ఉందన్న ఆనవాళ్లు కూడా లేవు. పాటు కాలువల ఆకృతి మారిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కోస్గి నుంచి దౌల్తాబాద్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో





అక్రమార్కుల కళ్లు ఈ భూములపై పడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఈ చెరువు స్థలాన్ని కొనుగోలు చేసేందుకు చూసి వెళ్లారు. ధర కూడా మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చెరువు కట్టను పూర్తిగా కనుమరుగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ కట్టను కొంత భాగం తవ్వారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు మౌనంగానే ఉన్నారు. ఈ చెరువు పరిరక్షణపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అధికారులపై ఒత్తిడి..

ఇటీవల ఈ చెరువును నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో 19.35 ఎకరాల్లో ఉన్న చెరువు కనిపించకపోవడంతో పూర్తి స్థాయిలో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించగా అందులో ఈ చెరువు ఉందని తేలింది. ఈ స్థలాన్ని పట్టాదారుల నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లోనూ ఉంది. ఈ వ్యవహారం రెవెన్యూ శాఖ వద్దకు వెళ్లింది. ఇవన్నీ తెలుసుకున్న పార్టీ నేతలు, దళారులు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇక్కడ చెరువు ఉన్న విషయాన్ని బయటకు రాకుండా చూడాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం సర్వే చేయడానికి కూడా రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చెరువు పూర్తిగా ధ్వంసమైంది. పాటు కాలువలు సరిగ్గా కనిపించడం లేదు. ఈ చెరువు స్థలాన్ని సర్వే చేసి సరిహద్దులు గుర్తించి ఆయకట్టు అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చెరువు పరిరక్షణపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై నీటిపారుదలశాఖ డీఈ ఆనంద్‌కిశోర్‌తో మాట్లాడుతూ రికార్డుల్లో ఇక్కడ చెరువు ఉన్న విషయం వాస్తవమేనన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించామని తమకు సరిహద్దులు చూపాలని రెవెన్యూ శాఖకు లేఖ రాసినట్లు వెల్లడించారు. చెరువు స్థలాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. కోస్గి తహసీల్దారు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రేకులకుంట ఆక్రమణకు గురైందని నీటి పారుదల శాఖ అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని, దీనికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## ఉపాధ్యాయ శిక్షణకు ఆదరణ

ఖమ్మం : పీహెచ్‌డీతో పాటు నెట్ అర్హత, ఎంఫిల్, ఎంఈడీ, ఎంటెక్, బీటెక్ తదితర కోర్సులు చదివిన ఉన్నత విద్యావంతులు కేవలం ఇంటర్ అర్హతతో చదివే ఉపాధ్యాయ శిక్షణ కోర్సుకు దరఖాస్తు చేస్తున్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అర్హత పరీక్షకు పోటీ పడుతున్నారు. జిల్లా విద్యా, శిక్షణ సంస్థ(డైట్) కళాశాలల్లో 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్' ఉపాధ్యాయ శిక్షణకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దశాబ్ద కాలం నుంచి కళాశాలల్లో సీట్లు భర్తీకాని పరిస్థితి నెలకొంది. కానీ ఇప్పుడు ప్రవేశాల కోసం డిమాండ్ ఏర్పడింది. పరిస్థితి చూస్తే చాలా సంవత్సరాల తర్వాత 'డైట్' కళాశాలలకు మహర్దశ పట్టనుంది.జాబ్ క్యాలెండర్ ప్రకటనతో... ప్రధానంగా ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ప్రకటించింది. త్వరలో మరో డీఎస్సీ నిర్వహిస్తామని చెబుతోంది. ఇదివరకే జాబ్ క్యాలెండర్ ప్రకటించింది. ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కేవలం



డీఐఈఎల్ఈడీ కోర్సు చేసినవారు మాత్రమే అర్హులని ప్రకటించటంతో ఓ భరోసా ఏర్పడింది. గత డీఎస్సీ వరకు ఎస్‌జీటీ పోస్టులు 50 శాతం బీఈడీ చేసిన వారికి కూడా కేటాయించారు. ఈసారి పూర్తిగా రద్దు చేయటంతో ఈ కోర్సుకు ఆదరణ పెరిగింది. ఎంఈడీ చేసి ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసేవారు సైతం పోటీ పడుతున్నారు. ఇంటర్ చదివిన విద్యార్థులు డైట్ కళాశాలల్లో ఉపాధ్యాయ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జూన్ 6న నోటిఫికేషన్ విడుదల చేశారు. జులై 10న ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహించారు. ఈనెల 1 నుంచి 7 వరకు కళాశాలల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ఏడాది ఉపాధ్యాయ శిక్షణకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అనేక మంది అర్హత సాధించారు. ఈసారి కళాశాలలో ఉన్న సీట్లు మొత్తం భర్తీ అయ్యే అవకాశం ఉంది. భవిష్యత్తులో డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. సామినేని సత్యనారాయణ, ప్రిన్సిపల్, డైట్ కళాశాల, ఖమ్మం

## ఆదివారం ఇంటింటా గాయత్రి యజ్ఞం కార్యక్రమం

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) :ఆదివారం 29వ తేదీ ఇందూరు యజ్ఞ సమితి నిజామాబాద్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు స్థానిక దుబ్బ ప్రాంతంలో వేర్హౌస్ గోదాం పెట్రోల్ పంపు పక్కన (స్మశాన వాటిక ముందర) శ్రీమతి శ్రీ అమీర్ శెట్టి సాంబమూర్తి



గారి ఇంటి యందు నిర్వహించడం జరుగుతుందని ఇందూరు యజ్ఞ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మూడ నాగభూషణం గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. యజ్ఞం సమితి సభ్యులు భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై గంట పాటు జరిగే ఇంటింటి మహా గాయత్రి యజ్ఞమును విజయవంతం చేసి తీర్థప్రసాదాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కానరాని కవితక్క

### -ఆచూకీ కనిపెట్టాలంటూ పోలీసులకు తెలంగాణ ఉద్యమకారుల పిర్యాదు

నిజామాబాద్, సెప్టెంబర్ 28 (నిఘానేత్రం ప్రతినిధి) నిజామాబాద్ ఉమ్మడిజిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కనిపించడం లేదని జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఆదె ప్రవీణ్, కోనేరు సాయికుమార్, ఈర్ల శేఖర్ తదితరులు శనివారం పోలీసులకు ఫిర్యాదు



చేసి నిజామాబాద్ వన్ టౌన్ ఎస్ హెచ్ వో కు ఫిర్యాదు ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిక్కర్ కేసులో జైలుకు వెళ్లక ముందు నుంచి కవిత నిజామాబాద్ ప్రజలకు కనిపించకుండా పోయారని, బెయిల్ పై బయటికి వచ్చిన తరువాత కూడా ఆమె ప్రజల్లోకి రాలేదన్నారు. ప్రజలు చెల్లించే పన్నుతో వేతనం, తీసుకుంటున్న ఎమ్మెల్సీ ప్రజలకు కనిపించకుండాపోవడంతో అలవెన్సులు తాము పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఆమె ఆచూకీ కొనుగోని ప్రజలకు తెలియజేయాలని పోలీసులను కోరినట్లు వారు తెలిపారు.

## పారిశ్రామికవేత్తల చూపు.. జిల్లా వైపు

నాయుడుపేట : కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తల చూపు మళ్లీ రాష్ట్రంపై పడింది. దీంతో మేనకూరు సెజ్, క్రిస్ సిటీ, శ్రీసిటీ పారిశ్రామిక వాడల్లో రూ.72 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. ఇప్పటికే కొన్ని పరిశ్రమలకు భూములు కేటాయించడంతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైనా వైకాపా హయాంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పారిశ్రామికవాడల్లో వసతులు కల్పించకపోవడంతో పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేశారు. కూటమి ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వడం.. మౌలిక వసతుల కల్పనలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి.

**4 లక్షల మందికి ఉపాధి..**

కోట, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంతంలో క్రిస్ సిటీ నిర్మాణానికి 2016లో తెదేపా, ఎన్డీయే ప్రభుత్వాలు 2500.49 ఎకరాల్లో భూసేకరణ చేపట్టాయి. వైకాపా ప్రభుత్వం భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఇక్కడ 7 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.37,500 కోట్ల పెట్టుబడులతో 4 లక్షల మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ఈ పారిశ్రామికవాడలకు జాతీయ రహదారులు, రైల్వే లైన్లు అనుసంధానం చేయనున్నారు. త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా క్రిస్ సిటీ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**రూ.1,800 కోట్లతో కార్బన్ పరిశ్రమ..**

మేనకూరు పారిశ్రామిక వాడలో రూ.1,800 కోట్లతో బిర్లా కార్బన్ పరిశ్రమ ఏర్పాటుకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. కార్బన్ ఉత్పత్తులతో పాటు అదనంగా పవర్ జనరేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు. ఇదే పారిశ్రామిక వాడలో గ్రీన్‌టెక్ పరిశ్రమ రూ.250 కోట్ల పెట్టుబడులతో అదనపు ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు తీసుకుంది.

**రూ.40 కోట్లతో అత్తివరం వద్ద..**

పరిశ్రమలకు ఉక్కు నిర్మాణాలను అందించే ఇంటరార్క్ సంస్థ అత్తివరం వద్ద రూ.40కోట్ల పెట్టుబడులతో ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పదం చేసుకుంది. ఇందుకు 10 ఎకరాల భూమి కేటాయించనున్నారు. మొదటి దశలో నాలుగు ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తయితే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలన్నింటికీ ఉక్కు నిర్మాణ పరికరాలు అందించే అవకాశముంది.

# అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

### 'దిశ' సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్



నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) : ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఎజెండా అంశాల వారీగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని అన్నారు. మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద రోడ్డు నిర్మాణంతో పాటు ఆయా చోట్ల రహదారుల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. ఈ పెండింగ్ పనుల విషయమై చర్చించేందుకు అక్టోబర్ రెండవ వారంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. సకాలంలో పనులు పూర్తయి ప్రజలకు వసతులు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చొరవ చూపాలని హితవు పలికారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆయా పనులు ఏ దశల్లో కొనసాగుతున్నాయి, వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు తనకు సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి కేంద్రం ద్వారా మంజూరైన నిధుల గురించి ఎం.పీ ప్రశ్నించగా, పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 40 పాఠశాలలకు కేంద్రం ద్వారా రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటిని అదనపు తరగతి గదుల నిర్మాణాలు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామని డీఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. అదేవిధంగా అమృత్ పథకం కింద జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు రూ. 335 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రజారోగ్య శాఖ ఈ.ఈ తిరుపతికుమార్ ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ నిధులతో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపరుస్తున్నామని, భూగర్భ డ్రైనేజీ పెండింగ్ పనుల పూర్తికి కూడా అమృత్ పథకం నిధులను వెచ్చిస్తున్నామని అన్నారు. అటవీ శాఖకు 'కాంపా' పథకం ద్వారా మంజూరైన నిధులను సక్రమంగా వెచ్చిస్తూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎం.పీ అర్వింద్ ఫారెస్ట్ అధికారులకు సూచించారు. పీ.ఎం విశ్వకర్మ పథకం అమలు తీరు గురించి ఎం.పీ ఆరా తీయగా, జిల్లాలో 23583 మంది దరఖాస్తులు చేసుకున్నారని, నల్గొండ తరువాత నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 2592 మందికి శిక్షణ కూడా పూర్తి చేశామని వివరించారు. కాగా, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి సమావేశంలో ఆక్షేపణ తెలిపారు. దీనిపై ఎం.పీ స్పందిస్తూ, ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగకుండా అధికారులు సంబంధిత ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు తప్పనిసరి ముందస్తుగానే తగిన సమాచారం అందించాలని అన్నారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

**ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ కు సన్మానం** కాగా, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ హన్మంత్ రావు పదవీ విరమణ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని దిశా సమావేశం ముగిసిన అనంతరం ఎం.పీ అర్వింద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. సుమారు 38 సంవత్స రాల పాటు హన్మంత్ రావు అందించిన సేవలను కొనియాడారు. సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వర్తించిన సందర్భంగా ఎదురైన అనుభ వాలను హన్మంత్ రావు ఈ వేదికగా పంచుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కరించినట్లయితే పోరాటాలకు సిద్ధం కావాలి

### ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ పిలుపు ..




నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) :కార్మిక సమస్యలు పరిష్కరించినట్లయితే పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మర్చంట్ అసోసియేషన్ శ్రద్ధానందు గంజ్ లో ఏ ఐ టి యు సి జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా ముందుగా భగత్ సింగ్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏ ఐ టి యు సి రాష్ట్ర ఆధ్యక్షులు ఎండి. యూసుఫ్ మాట్లాడుతూ..ప్రశ్నించే తత్వం ఉన్నపుడే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని అన్నారు. మూడ నమ్మకాలు విడనాడాలని కోరారు. కార్మికులు ఒకటైతేనే కార్మిక రాజ్యం సాదించుంకుంటామని అన్నారు.కార్మిక ఉద్యమ చరిత్ర, ప్రపంచీకరణ గురించి అవగాహన కల్పించారు. సంపదను సృష్టించే వారే కార్మిక వర్గం, అన్నం పెట్టేది రైతు, సేవ చేసేది నర్సు, గ్రామ పంచాయతీ కార్మికులు వీధులు శుభ్రం చేస్తూ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడుతారని, హమలీలు వస్తువులు సరఫరా అందిస్తూ, భవన నిర్మాణ కార్మికులు చేస్తూ సేవలు అందిస్తారన్నారు. కార్మిక వర్గం లేకుండా, కార్మికులు పని చేయకుండా ఈ సమాజంలో మేలు జరిగే పరిస్థితి లేదని అన్నారు. ప్రతిదానికీ కార్మిక వర్గం అవసరం ఉందనీ, గతంలో రాజులు పాలించినపుడు కార్మికులు తక్కువగా ఉండేవారని గుర్తు చేశారు. 1768 సంవత్సరంలో ఆవిరి యంత్రం కనుక్కొగా వస్తువులు తయారు చేసే సమయంలో కార్మికులు అవసరం అయ్యారు. అందుకని వ్యవసాయాన్ని నడవనీయకుండా చేసి వ్యవసాయ రైతులను కార్మికులగా వాడుకున్నారని అన్నారు. ఒకప్పుడు కార్మిక వర్గం రాత్రి పగలు అని తేడా లేకుండా కష్టపడి పని చేసే వారని రాత్రి పడుకున్న పిల్లాడు నిద్ర లోంచి లేచే లోపు తండ్రి పనులకు వెళ్లే వారని, మళ్ళీ పిల్లాడు పడుకున్న తరువాత మాత్రమే వచ్చే ఇలాంటి ఇబ్బందులను గుర్తించి, కార్మికుల హక్కులను కాపాడాలని రోజుకు 8 గంటల పని మాత్రమే చేయాలని చేయాలన్నారు. ఈ జిల్లాస్థాయి శిక్షణ తరగతు ఉద్దేశించి ఏఐటియుసి రాష్ట్రమాజీ నాయకులు మోహన్ రెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు ఉమా మహేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు చక్రపాణి అనుబంధసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నేర్చికోవాలనే తపన ఉంటే వయస్సు అడ్డుకాదు..



నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) :నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే వయసు అడ్డు రాదని, ఏడేళ్ల నుంచి 70 ఏళ్ల వరకు ఎవరైనా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవచ్చునని ఆమెచర్ తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ బస్వా లక్ష్మి నర్సయ్య అన్నారు.ఆరోగ్యంగా ఉండడానికి మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగరంలోని బస్వా గార్డెన్ లో తైక్వాండో క్రీడాకారులు గత ఎనిమిది సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నారని, ఇందులో గత ఐదేళ్లుగా నేను శిక్షణ పొందుతూ బ్లాక్ బెల్ట్ సాధించడం జరిగిందని అన్నారు. జాతీయ స్థాయి తైక్వాండో లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించడంతో పాటు జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలిపామని అన్నారు. ఈ సందర్భంగా బస్వా లక్ష్మి నర్సయ్య మాట్లాడు తూ..నేటి సమాజంలో ఆడపిల్లలు శారీరకంగా మానసికంగా ఎదగాలంటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలనీ, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే మానసిక ప్రశాంతతో వాళ్ళు చదువులో అన్ని రంగాల్లో ముందుం టారన్నారు. నేటి సమాజంలో సమాజంలో ఆడపిల్లలపై అరాచకాలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లలకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలని అన్నారు. దీంతో ఎవరిని వారు కాపాడుకోగలు గుతారని అన్నారు. నేను కూడా ఈ వయసులో ప్రతి రోజు తైక్వాండో విద్యను నేర్చుకుంటున్నానని అన్నారు.ఈ తైక్వాండో కేవలం వారి ఆరోగ్యం కోసమే గాక .ఈ సర్టిఫికెట్స్ పిల్లల చదువుకు ఉపయోగపడుతుందని, వీటితో బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు.కోచ్ మనోజ్ కుమార్ అంకిత భావంతో తైక్వాండో లో ఉత్తమ శిక్షణ ఇస్తున్నారని అన్నారు.

ఇది అందరి శారీరక దారుద్యానికి, మానసిక ఆరోగ్యానికి దోహద పడుతుందన్నారు. నేడు సమాజానికి తైక్వాండో క్రీడాకారులు అందరికీ తాను స్ఫూర్తిగా నిలబడడం తను అదృష్టంగా భావిస్తున్నారన్నారు. ప్రతి దినము నేర్చుకుంటూ నేటి సమాజంలో తల్లిదండ్రులు పిల్లలు ప్రతి ఒక్కరికి వ్యాయామం చాలా అవసరం అన్నారు ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతి ఒక్కరు యోగా తైక్వాండో వంటి వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు.

## శునకాలను పెంచుకునేవారు తప్పక రేబిస్ టీకాలను వేయించాలి

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) శునకాలను పెంచుకునేవారు తప్పక రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ రామ్ చందర్ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా రెడ్డి పేట పశు వైద్య శాల ఆవరణలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలను వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచందర్ మాట్లాడుతూ పెంపుడు



కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నదని తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 22 కుక్కలకు రేబిస్ టీకాలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపేట లైవ్ స్టాక్ ఆఫీసర్ మంచికంటి శ్రీనివాసరావు, ఉప్పల్ వాయి జూనియర్ సహాయకులు రమేష్, సిబ్బంది ఆంజనేయులు, బాలమణి పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించడంలో రాష్ట్రంలో మన జిల్లా టాప్

### జిల్లా జడ్జి కుంచాల సునీత




నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) చిన్న చిన్న కేసుల విషయంలో కోర్ట్ల చుట్టూ తిరగడం కంటే రాజీమార్గంలో ఎన్నుకోవాలని జిల్లా న్యాయమూర్తి ఉంచాలా సునీత తెలిపారు శనివారం జిల్లా కోర్టు ఆవరణలో లోకదాల కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచల సునీత మాట్లాడుతూ రాజి పడడామే ఉత్తమ మార్గమని అన్నారు. లోకదాలతే ద్వార కేసుల పరిష్కారం లో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు ఇప్పటికీ దాదాపు 4000 కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి న్యాయమూర్తి పద్మావతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ న్యాయవాదు లు కక్షిదారులు పాల్గొన్నారు.

## కుల వ్యవస్థను నిర్మూలిద్దాం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు దుడ్డు గంగాధర్

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) మహాత్మా జ్యోతిరావు పూలే స్థాపించిన సత్య శోధక్ 152 దినోత్సవం పురస్కరించుకొని అంబేద్కర్ కాలనీలో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి దుడ్డు గంగాధర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మనదేశంలో దుర్మార్గమైన కుల వ్యవస్థ ఏర్పడిందని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 1973 సెప్టెంబర్ 24న



సత్యశోధక్ సమాజం స్థాపించి కుల వ్యవస్థ నిర్మూలన కోసం జీవితమంతా కృషి చేశారని తెలిపారు. కులంగిరి లాంటి పుస్తకాలు రాసి కుల వ్యవస్థను నిర్మూలించే విధంగా ప్రచారం చేశారు బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ అఖిల, భారత రైతు కూలి సంఘం అధ్యక్షులు అబ్బయ్ సంజీవ్ రామ్మోహన్ రావు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్చార్జి మంత్రి జిల్లాను పట్టించుకోవడం లేదు...

### ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి. ఫైర్

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) : దిశా సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ కల్లెక్టరేట్ లో శనివారం నిర్వహించిన సమావేశం లో మాట్లాడుతూ.. ఇన్ఛార్జి మంత్రి జిల్లాను పట్టించుకోవాదం లేదని మండిపడ్డారు. ఈ మేరకు జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి పై ఫైర్ అయ్యారు. జిల్లా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందనీ అన్నారు.



జూపల్లి పేషీని పెట్రోల్ పోసి తగలబెడతానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న అధికారులపై తీరుపై సైతం కూడా మండిపడ్డారు. కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడిన నాయకులకు ఇచ్చే గౌరవం గెలిచిన నాయకులకు ఇవ్వడం లేదని అన్నారు.

# ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు.

ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు. – అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

# ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్‌ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్‌ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు. సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

# కోడెల పంపిణీపై ఆశలు



వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల పంపిణీ కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వందల మంది దరఖాస్తు చేసుకొన్నారు. వీరంతా నిరీక్షణ జాబితాలో ఉండటంతో తమకు ఎప్పుడు ఇస్తారని ఆరా తీస్తున్నారు. రాజన్నను దర్శించుకున్న భక్తులు కోడె మొక్కులు చెల్లిస్తుంటారు. దీంతోపాటు మరి కొందరు నిజ కోడెలను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు సమర్పించిన వాటిని ఆలయ అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. కోడెల సంఖ్య పెరిగిపోయి సంరక్షణకు ఇబ్బందికరంగా మారడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 3న అర్హులైన రైతులకు అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 700 మంది రైతులకు ఒక జత కోడెలు అందజేశారు. రైతుల కోరిక మేరకు కొందరికి ఆవులను ఇచ్చారు. ఇంకా అనేక మంది ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా అధికారులకు దరఖాస్తులు సమర్పించారు.

పర్యవేక్షణ కరవు రాజన్న గోశాల నుంచి జులై 3 నుంచి 10 వరకు దాదాపు 700 మంది రైతులకు కోడెలు, ఆవులను పంపిణీ చేశారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన దాఖలాలు లేవు. పంపిణీ చేసిన కోడెల సంరక్షణ ఎలా ఉందనేది ఎవరికీ తెలియదు. ఏమైనా పక్కదారి పట్టాయా అనే సమాచారం కూడా అధికారుల వద్ద లేదు.

పంపిణీ చేసిన నెల రోజుల తరవాత వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి సంరక్షణపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిశీలించి కోడెలు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

భారీగా దరఖాస్తులు పెండింగ్

ఉచిత కోడెల పంపిణీ సందర్భంగా భారీ సంఖ్యలో రైతులు తరలి వచ్చి తమకు ఇవ్వాలని దరఖాస్తులు సమర్పించారు. దాదాపు 2,500 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రస్తుతం గోశాలలో 500 వరకు కోడెలు, మరో 60 వరకు ఆవులు ఉన్నాయి. శ్రావణ మాసంలో అనుకున్న స్థాయిలో స్వామివారికి నిజ కోడెలను సమర్పించలేదు. దీంతో గోశాలలో వీటి సంఖ్య తగ్గింది.

ప్రస్తుతం గోశాలలో ఉన్న కోడెలు, ఆవుల నుంచి దాదాపు 300 పంపిణీ చేయడానికి అవకాశం ఉంది.

కొన్నింటిని వచ్చే నెలలో పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. క్రమ సంఖ్య ప్రకారం పంపిణీ చేయాలని నిర్ణయించారు. మిగతా వారికి గోశాలకు వచ్చే వాటిని బట్టి దశల వారీగా అర్హులైన రైతులకు ఇవ్వాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

పక్కదారి పడితే చర్యలు

అర్హులైన రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన కోడెలను పర్యవేక్షణ చేయాల్సి ఉంది. పని ఒత్తిడి కారణంగా చేయలేకపోయాం. ఫోన్ ద్వారా తెలుసుకొంటాం. ఇప్పటికైతే కోడెలు పక్కదారి పట్టినట్లు సమాచారం లేదు. వాటిని అమ్మడం, ఇతరులకు ఇవ్వకూడదని పంపిణీ సమయంలో రైతుల నుంచి పంచనామా తీసుకొన్నాం. పక్కదారి పట్టినట్లు నిర్ధారణ అయితే చర్యలు చేపడతాం.

శ్రీనివాస్, ఏఈవో, ఆలయ గోశాల ఇన్‌ఛార్జి

# ముంచుకొస్తున్న గడువు.. పూర్తయ్యేనా పనులు?



కరీంనగర్ : నగరంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల జిల్లా గ్రంథాలయ నూతన భవనం ఇది. రూ. 7 కోట్లతో నిర్మితమవుతోంది. నిధులు సక్రమంగా అందితే ఈ పాటికే ఇది పూర్తవ్వాలి. ప్రస్తుతం శరవేగంగానే పనులు జరుగుతున్నా.. ఎప్పటికప్పుడు బిల్లులు అందితేనే మరో రెండు మూడు నెలల్లో పూర్తయ్యే వీలుంది. ఇదే కాకుండా నగరంలో పలురకాల పనులకు నిధుల గండం ఎదురవుతోంది. మరో 6 నెలల్లో అన్ని పనులు పూర్తవ్వాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటందాలి.

రెండు వారాల కిందట దిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశంలో కరీంనగర్ నగరపాలక సంస్థ పనుల ప్రగతిపై చర్చ జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ ఈ సమావేశానికి హాజరై ఇక్కడి పనుల ప్రగతిని వివరించారు. మూడు నెలల కిందట కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 30.62 కోట్లు విడుదలయ్యాయి. ఆ నిధులకు సంబంధించిన యూసీ (యుటిలైజేషన్ సర్టిఫికెట్)లు సమర్పిస్తే మిగతా నిధులను అందిస్తామని కేంద్రప్రభుత్వం తరపున అధికారులు విన్నవించారు.

రూ. 30.62 కోట్లు కేంద్రం వాటా విడుదలవగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటాగా రూ. 30.62 కోట్లు రావాలి. మొత్తంగా రూ. 61.24 కోట్లు తక్షణమే విడుదలైతే ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు వీటిని వెచ్చించొచ్చు. ఈ మేరకు ఈ నిధులను విడుదల చేయాలని ఇటీవలే కొన్ని రోజుల కిందట నగరపాలిక కమిషనర్ సీడీఎంఏకు లేఖ రాశారు. స్మార్ట్ సిటీ గడువు వచ్చే ఏడాది మార్చి 31తో ముగుస్తుండటంతో మిగులు పనులకు నిధులు అత్యవసరమయ్యాయి.

రూ. 188కోట్లు అవసరం..!

ఆకర్షణీయ నగరం గడువు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో నిబంధనల ప్రకారం ఇంకా సుమారుగా రూ. 188.11కోట్లు కరీంనగర్‌కు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు అవసరమైన ప్రగతి కోసం రూ. 398.13 కోట్లు కేంద్రం నుంచి రూ. 398.13 కోట్లు రాష్ట్రప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఇవి కాకుండా ఇటీవల కేంద్ర సర్కారు రూ. 30.62కోట్లు విడుదల చేసింది. ఈ నిధులకు తోడుగా రాష్ట్రం నుంచి రూ. 30.62 కోట్లు జతచేసి మొత్తంగా రూ. 61.24కోట్లు బల్దియాకు పంపాలి కానీ.. రాష్ట్ర సర్కారు ఈ నిధులను ఇంకా విడుదల చేయలేదు. దీంతో ప్రస్తుతం నడుస్తున్న పనులకు ఈ నిధుల ఆవశ్యకత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. మొత్తం పనులు పూర్తవ్వాలంటే చేసిన పనులకు చేసినట్టుగా యూసీలు సమర్పిస్తే ఇంకా రూ. 188.11కోట్లు వచ్చేస్తాయి.

ఇన్నాళ్లుగా కేటాయింపులు..

25 రకాల పనులు ఇప్పటి వరకు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి రూ. 647.06 కోట్లు వెచ్చించారు.

మరో 20 చోట్ల కీలకమైన అభివృద్ధి జరగాలి. వీటికి రూ. 259.69 కోట్లకుగాను 96.88 కోట్లు ఖర్చయ్యాయి.

రెండు పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. రూ. 27కోట్లతో చేపట్టే వీటికి నిధులు అత్యవసరం.

స్మార్ట్‌సిటీ కింద మొత్తంగా రూ. 934.35కోట్లు రావాలి. ఇప్పటి వరకు రూ. 746.24కోట్లు విడుదలయ్యాయి.

యూసీలు సక్రమంగా పూర్తి చేస్తే కేంద్రం, రాష్ట్ర వాటాగా ఇంకా రూ. 188.11కోట్లు నగరానికి రావాల్సి ఉంది.

# నగరంలోనూ నేర పాఠాలు

హైదరాబాద్: దొంగతనాలు, మోసాల్లో ఆరితేరిన ముఠాలు ఆనవాళ్లు బయటకు తెలియకుండా నయా మార్గం ఎంచుకుంటున్నాయి. మైనర్లు, యువతను ముందుంచి నేరాలు చేయిస్తున్నాయి. ద్విచక్ర వాహనం కొట్టేయటం నుంచి..నకిలీ అధికారుల రూపంలో బురిడీ కొట్టించటం దాకా నేర్పిస్తున్నాయి. వారిని ఆయా బృందాలకు నాయకులుగా నియమిస్తున్నాయి. ఎక్కువ సంపాదించిన వారికి రెండు మూడు రెట్లు జీతం అదనంగా ఇస్తున్నాయి.

ఉదాహరణలివిగో..పాతబస్తీ నేరస్తుడు.. వందకు పైగా కేసుల్లో జైలుకెళ్లొచ్చాడు. సొమ్ము కొట్టేసేందుకు కొత్త మార్గం ఎంచుకున్నాడు. చిల్లరగా తిరిగే యువకులకు బిర్యానీ, బైక్‌లపై తిరిగేందుకు పెట్రోల్ ఖర్చులు ఇస్తూ సెల్‌ఫోన్ల చోరీ నేర్పించాడు. రాత్రిళ్లు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వారు చోరీ చేసిన ఫోన్లను దళారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇటీవల బహదూర్‌పురలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలుడు తన పక్కనే కూర్చున్న వృద్ధుడి జేబులోని నగదు కొట్టేశాడు. చాదర్‌ఘాట్ వద్ద మరో యువకుడు ఓ వ్యక్తి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. సీసీ ఫుటేజీ ద్వారా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమీషన్ వస్తుందనే ఆశతో నేరాలకు పాల్పడ్డామని.. తాముండే ప్రాంతానికి చెందిన కొందరు చోరీలపై శిక్షణ ఇచ్చారంటూ సమాధానమిచ్చారు.

శిక్షణ ఇలా..నగర శివార్లకు చెందిన దొంగలు బైకుల తాళాలు తీసి క్షణాల్లో మాయం చేయగల నేర్పరులు.. తల్లిదండ్రుల పర్యవేక్షణకు, చదువుకు దూరమైన 12–15 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలతో మాట కలుపుతారు. కొద్దిరోజులు నగరమంతా తిప్పుతారు. బైకులపై ఫీట్లు చేయటం అలవాటు చేస్తారు. తాళం వేసిన బైక్‌లను ఎలా చోరీ చేయాలి? ఎలా స్టార్ట్ చేయాలనేదానిపై రాత్రిళ్లు శిక్షణ ఇస్తారు. ఒక్కో వాహనానికి రూ. 2–3 వేలు కమీషన్ ఇస్తారు. అంతర్రాష్ట్ర ముఠాల వారు సెల్‌ఫోన్ల చోరీలకు మైనర్లు, మహిళలను పావులుగా మార్చుకుంటున్నాయి. రద్దీ ప్రాంతాల్లో ఫోన్లు దొంగిలించటంపై శిక్షణ ఇస్తున్నారు. పిల్లలు పట్టుబడినపుడు అక్కడున్న మహిళలు అడ్డుకుని, తమతో అనుచితంగా ప్రవర్తించారని గొడవ చేయాలని సూచిస్తున్నారు. ఫోన్ కొట్టేశాక సమీపంలోని ముఠా సభ్యుడికి అందజేసే వరకూ ఎలా నడచుకోవాలో చెబుతున్నట్టు పట్టుబడిన ఇద్దరు చిన్నారులు వెల్లడించారు.

# పర్యావరణం మరింత బలోపేతం



పూడూరు: పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడం కోసం చేపట్టిన 'వన మహోత్సవం' (గతంలో హరిత హారం) పటిష్ఠ అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గతంలో నాటి పాడైన వాటి స్థానంలో మొక్కలు నాటేందుకు ఇటీవల 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చారు. అంతేకాదు ఈసారి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటడం చేస్తున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వటం, పూలు, పండ్ల జాతులు వృద్ధిచేసి అవసరమున్న వారికి అందజేస్తున్నారు.

ఆరు నెలల ముందునుంచే కార్యాచరణ

జిల్లా వ్యాప్తంగా ఈసారి 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామాల్లో వన మహోత్సవం చేపట్టేందుకు అధికారులు ఆరు నెలల ముందు నుంచే కార్యాచరణ చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు పెంచారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఈసారి గ్రామ పంచాయతీకి ఐదు వేల వరకు మొక్కలు పెంపకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 566 నర్సరీలు జిల్లాలోని పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 566 నర్సరీలు ఏర్పాటుకాగా, పూడూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు పెంచారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటాల్సిన చోట గుంతలు తీయించే పనులు జరుగుతున్నా యి. వెంటనే మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లో అలోవేర, దానిమ్మ, కరివేపాకు, రెయిన్ ట్రీ, నీలగిరి, నిమ్మ, ఉసిరి, టేకు, మద్ది, గులాబీ, మందారం, జామ, మామిడి, సీతాఫలం, చింత, కానుగ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కొందరు దూరపు ప్రాంతాలలో ప్రైవేటు నర్సరీల నుంచి ఖరీదైన మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఈ సందర్భంగా పూడూరు ఏపీఓ రాములుతో మాట్లాడుతూ.. ఇంకా విస్తారంగా నాటాల్సి ఉందన్నారు. పూడూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటివరకు 90 శాతం మేర మొక్కలు నాటామన్నారు. క్షేత్రసహాయకుల ఆధ్వర్యంలో కూలీలు గుంతలు తీస్తున్నారని, రహదారులతో పాటు ఎక్కడ ఖాళీ స్థలాలున్నా వారు మొక్కలు నాటేందుకు ప్రోత్సహిస్తామన్నారు.

# విద్యుత్తు నియంత్రికలు ఢాం

సిరిసిల్ల : మొన్నటి వరకు ఎండా కాలం వల్ల విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుత వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడం వల్ల సాగునీటి కోసం అన్నదాతలు వ్యవసాయ కరెంటు మోటార్లను నిరంతరాయంగా నడుపుతున్నారు. ఫలితంగా విద్యుత్తు నియంత్రికలపై అధికభారం పడుతుండటంతో తరచూ కాలిపోతున్నాయి. దీంతో వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాటి మరమ్మతులు, కొత్త వాటిని అమర్చడంలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్)పై ఆర్థికభారం పడుతోంది. కాలం చెల్లినవి ఓవర్‌లోడ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. జిల్లాలో సెస్ పరిధిలో వివిధ రకాల సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అందించడానికి మొత్తం 10,508 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు 449 పైగా టాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిని పూర్తిగా మరమ్మతు చేయడానికి



ఒక్కో దానికి సుమారు రూ. 30 వేల వరకు ఖర్చు అవుతుంది. నియంత్రికలో కాలిపోయిన భాగాలను బట్టి మరమ్మతు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో కనెక్షన్లను బట్టి లోడ్‌ను అంచనా వేసి నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా, ఓవర్‌లోడ్ కాకుండా అదనపు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్రమ కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరిస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో జూన్ నుంచి ఆగస్టు వరకు సుమారు 60 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. ప్రస్తుతం సాగునీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులు ఆటో స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ఒక్కసారిగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతుంది. అలాగే నాణ్యత లేని కరెంటు మోటార్ల వల్ల కూడా కాలిపోతున్నాయి.

కారణాలు ఇవీ...నాణ్యత లేని మోటార్లను వాడటం వల్ల ఎక్కువ ఆమ్స్ విద్యుత్తును తీసుకుంటున్నాయి. నియంత్రికల్లో ఎల్‌టీ బుష్‌లు కరిగిపోవడం, హెచ్‌టీ లింకులు విరిగిపోవడం, ఆయిల్ తగ్గిపోవడం, ఫ్యూజులు పోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతూ ఏకంగా కాలిపోతున్నాయి.

గాలితో కూడిన వర్షాలకు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి రాసుకోవడం, పిడుగుపాటు ప్రభావం కూడా వీటిపై పడుతోంది. చాలా చోట్ల ఏళ్ల కింద అమర్చినవి అధిక భారాన్ని తట్టుకోలేకపోతున్నాయి.

రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడం తోపాటు ఆటో స్టార్టర్లను వినియోగించుకోకుంటే విద్యుత్తు నియంత్రికల జీవితకాలం పెరుగుతుందని సెస్ అధికారులు చెబుతున్నారు.

మరమ్మతులు నిరంతర ప్రక్రియ

సెస్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వినియోగదారులు సెస్‌కు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలి. విద్యుత్తు మరమ్మతులు రోజూ కొనసాగుతూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వదులు తీగలను సరిచేశాం. వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు ఉంటే సెస్ సిబ్బందిని సంప్రదించాలి. – శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ

# అర్బన్ ఉద్యానానికి అడుగులు

పరిగి: చుట్టూరా గుట్టలు.. ఎటు చూసినా పచ్చని పైర్లు.. అనేక రకాల చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. మయూరాల విన్యాసాలు. .రయ్యిన వెళ్లే వాహనాలు ఇవన్నీ ఎక్కడ అనుకుంటున్నారా.. పరిగికి ఎనిమిది కి.మీ.దూరంలోని ప్రతిపాదిత అర్బన్ పార్కు ప్రదేశం. పార్కు ఏర్పాటుకు కసరత్తు జరగడం, కొత్త ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండున్నరేళ్ల కిందట: పరిగి మండలం జాఫర్‌పల్లి సమీపలో రెండున్నరేళ్ల కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో అర్బన్ పార్కు ఏర్పాటు చేయాలని తలంచారు. ఇటీవల జిల్లా అటవీశాఖ అధికారులు సందర్శించి పరిస్థితులను పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిజర్వు ఫారెస్టు పరిధి మొత్తం 145 ఎకరాల విస్తీర్ణం. 50ఎకరాల్లో ఉద్యానం ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికను పంపారు. ఇందుకోసం రూ.2కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

సౌకర్యాలు ఇలా: ప్రతిపాదిత ప్రాంతంలో యోగా చేసేందుకు షెడ్డు, సెక్యూరిటీ గది, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక బల్లలు, నడకదారి, అడవి అందాలను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. నిధుల సమీకరణకు అన్వేషణ ప్రారంభమైంది. పార్కు ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నామని జిల్లా అటవీ అధికారి



జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఈ మార్గం ప్రధానం: పరిగి నుంచి షాద్‌నగర్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాలన్నా ఈ దారే ప్రధానం. కర్ణాటకకు చెందిన అనేక వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. ప్రతిపాదిత ప్రాంతం నుంచి షాద్‌నగర్ పట్టణానికి 25కి.మీ. దూరం. పార్కు ఏర్పాటుతో పరిగి అభివృద్ధిలో ఇది మైలురాయిగా నిలుస్తుంది.

హోదా పెరిగినా..: పరిగి జనాభా 30వేలు. 6,349మంది వరకు ఉద్యోగులున్నారు.పార్కులు లేకపోవడంతో ఆహ్లాదంగా గడపలేకపోతున్నారు. ఐరన్ పరిశ్రమల ఏర్పాటుతో వాతావరణ కాలుష్యం కూడా పెరిగింది. ఇటువంటి పరిస్థితిలో పార్కు ఏర్పాటు అత్యవసమని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో శంకుస్థాపన–రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అర్బన్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం పక్షం రోజుల్లోనే పనులకు శంకుస్థాపన చేస్తాం. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. నిధుల సమీకరణకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటాం.

# అడ్డగోలుగా రీల్స్ చేస్తే అరదండాలే

హైదరాబాద్: ప్రజలకు ఎంత ఇబ్బంది కలిగినా.. అడ్డగోలుగా రీల్స్ చేసేస్తాం.. ఒక్కరోజులో సెలబ్రిటీ అయిపోతామంటే ఇక నుంచి కుదరదు. రీల్స్ చేసేటప్పుడు హద్దు దాటి ప్రవర్తించినా.. ప్రజలకు ఇబ్బంది కలిగినా కటకటాలు లెక్కపెట్టాల్సిందే. సామాజిక మాధ్యమాల్లో ఫాలోవర్లను పెంచుకోవడానికి.. సెలబ్రిటీలుగా మారడానికి జన సమ్మర్థ ప్రాంతాల్లో అసౌకర్యం కలిగేలా వీడియోలు చిత్రీకరిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలకు దిగుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమ ఖాతాలు తనిఖీ చేసి పాతవాటిపైనా కేసులు పెడుతున్నారు. తాజాగా నడిరోడ్డుపై నోట్లు వెదజల్లుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసిన యువకుడిపై కూకట్‌పల్లి, సనత్‌నగర్, కేపీహెచ్‌బీ ఠాణాల్లో కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

బైక్‌పై స్టంట్లు.. డ్యాన్సులు.. ప్రముఖుల మాదిరి తాము కూడా సెలబ్రిటీలుగా మారిపోవాలని లేదా ఫాలోవర్లను పెంచుకోవాలనే ఆరాటంతో కొందరు యువత తప్పుదోవ పడుతున్నారు. ఇంకొందరు లైకులు, ఫాలోవర్లు పెంచుకోవడానికి అడ్డగోలు రీల్స్ చేస్తున్నారు. తమ ప్రత్యేకత చాటుకోవాలనే భావనతో రద్దీ రోడ్లపై బైకుపై స్టంట్లు వేయడం, డ్యాన్సులు, ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రాంక్‌లు, వాహనాల్లో ప్రయాణిస్తూ కరెన్సీ గాల్లోకి ఎగరేస్తూ వీడియోలు చిత్రీకరిస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు: కె.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ.. సామాజిక మాధ్యమాల్లో రీల్స్/ వీడియోల కోసం ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే చట్టప్రకారం చర్యలుంటాయి. బైకుతో స్టంట్లు చేయడం, నోట్లు వెదజల్లడం, అభ్యంతరంగా ఉండడం తదితర వీడియోలు చిత్రీకరిస్తే బాధ్యులను గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

తల్లిదండ్రులూ గమనించాల్సిందే..

పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి కంటెంట్ చూస్తున్నారో కచ్చితంగా గమనించాలి.పిల్లలకు ఫోన్ ఇచ్చాక దాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో పర్యవేక్షించాలి. సామాజిక మాధ్యమ ఖాతా ప్రొఫైళ్లను తనిఖీ చేస్తుండాలి. 15– 25 ఏళ్ల యువత ఎక్కువగా అభ్యంతరకరంగా వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. వీరిపై ఎక్కువ దృష్టి సారించాలి.కేసులు నమోతైతే ఇబ్బందులుఉంటాయని హెచ్చరించాలి.

# సారూ.. చెరువు కనిపించట్లేదు.. వెతికిపెట్టండి



మహేశ్వరం: తుమ్మల చెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో 8 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కనిపించట్లేదని అందులో పేర్కొన్నారు. కబ్జా చేసి వెంచర్లు వేశారని ఆరోపించారు. దీంతో పంటలు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చెరువు ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు ఆరోపించారు.మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేత

రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది. పోలీసు బందోబస్తు మధ్య ఎకరా భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు.

# భద్రత కరవైన బాల్యం



పెద్దపల్లి : చదువుల తల్లి ఒడిలో హాయిగా సేద తీరాల్సిన బాలలకు భద్రత కరవైంది. చెత్త, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో పాఠశాలల ఆవరణలు విష కీటకాలకు ఆవాసంగా మారాయి. ఏకాగ్రతతో పాఠాలు నేర్వాల్సిన విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది.జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాల భవనాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఆదర్శ పాఠశాలలుగా గుర్తించిన 635 బడుల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఆవరణలో కంకర, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి జనార్దన్‌రావును మాట్లాడుతూ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల సమస్యపై ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేస్తే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తొలగిస్తారన్నారు. విషపురుగుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాల : ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, మచిలిఖేడ్, పెద్దపల్లి.

సమస్య: బడి ముందు నుంచి మురుగు పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

ఎప్పటి నుంచి: ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి.

ఎదురవుతున్న ఇబ్బందులు: పట్టణంలోని చాలా ప్రాంతాల మురుగు పాఠశాల ముందు నుంచే పారుతోంది. పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగుల ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణలో కంకర, ఇతర సామగ్రితో అపరిశుభ్రత నెలకొంది.

పరిష్కారం: చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, తుమ్మ పొదలు తొలగించాలి. మురుగు కాలువను మరో ప్రాంతానికి మళ్లించాలి.

పాఠశాల : ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాల.

సమస్య: ప్రహరీ లేక రక్షణ కరవు.

ఎప్పటి నుంచి: బడి ప్రారంభం నుంచి (25 సంవత్సరాలుగా)

ఎదురవుతున్న ఇబ్బందులు: సమీపంలో తుమ్మ పొదలు దట్టంగా పెరిగి పాములు, తేళ్ల సంచారానికి అవకాశం ఉంది. పాఠశాలకు ఎదురుగానే దహనవాటిక ఉండటంతో అంత్యక్రియల సమయంలో పాఠశాలలోకి పొగ వస్తోంది. విద్యార్థులు భయంతో పాఠశాలకు రావడం లేదు.

పరిష్కారం: ప్రహరీ నిర్మాణంతో పాటు దహనవాటిక తరలించడం.

పాఠశాల : కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

సమస్య: సమీపం వరకు పెరిగిన పిచ్చిమొక్కలు.

ఎప్పటి నుంచి: ఏడాది కాలంగా.

ఎదురవుతున్న ఇబ్బందులు: విష కీటకాలు సంచరిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

పరిష్కారం: పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించి మొరం పోసి చదును చేయాలి.పాఠశాల : సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం.

సమస్య: పక్కనే ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువలో పేరుకుపోయిన చెత్త.

ఎప్పటి నుంచి: రెండు సంవత్సరాలుగా.ఎదురవుతున్న ఇబ్బందులు: ఈ నెల 11న ఆరో తరగతి విద్యార్థి మన్విత్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ శివారులోని పొలాల మధ్య ఉండటంతో విష కీటకాలకు ఆవాసంగా మారింది.పరిష్కారం: పాఠశాలలో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, మురుగు కాలువ వద్ద భద్రత ఏర్పాట్లు చేస్తే విష పురుగుల బెడద సమస్య తొలగనుంది.

# ఉండాలంటే.. మా మాట వినాల్సిందే!



జగిత్యాల పురపాలికలో పాలకవర్గ సభ్యుల ఒత్తిడి, పాలనా వ్యవహారాల్లో అడుగడుగునా అడ్డు తగులుతుండటంతో కమిషనర్లు రావడం.. కొద్ది రోజులకే వెళ్లిపోవడం రివాజుగా మారింది.. ప్రస్తుత కమిషనర్ సమ్మయ్యతోనూ పాలకవర్గం అలానే వ్యవహరిస్తుండటంతో అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది..

పుర కమిషనర్‌గా పనిచేసిన అనిల్ భూ కుంభకోణంలో అరెస్టు కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జులై 3న సమ్మయ్య కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరడంతోనే ఆయన పలు విభాగాల్లో అక్రమాలను నిరోధించడంపై దృష్టి పెట్టారు. పుర పాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలను కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పురపాలికలో కొందరు ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇందులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు చేతివాటం చూపారు. మరోవైపు కొందరు సిబ్బందిని కార్యాలయంలో అంతర్గత బదిలీలు చేయాలని కమిషనర్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనని ఆయన స్పష్టం చేయడంతో పాలకవర్గ సభ్యులు తట్టుకోవడం లేదని సమాచారం. విషయం ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి ఇరువర్గాలు తీసుకెళ్లగా ఎవరైనా నిబంధనల మేరకు పనిచేయాలని వారు సూచించినట్లు సమాచారం. అయినా కమిషనర్‌పై పాలకవర్గ సభ్యులు కొందరు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమాలే కారణమా..?పురపాలక సంఘంలో తరచూ పలు విభాగాల్లో అక్రమాలు వెలుగు చూడటంతో కమిషనర్లు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం లేదా ఇతర ప్రాంతాలకు బదిలీలకు ప్రయత్నించడమో జరుగుతోంది. గతంలో ఓ ఇంటి నిర్మాణ అనుమతి విషయమై పట్టణ ప్రణాళిక విభాగంలో అనిశా దాడి చేయడంతో ఓ టీపీఎస్, పొరుగు సేవల ఉద్యోగి పట్టుబడటం సంచలనం కలిగించింది. గతేడాది రెవెన్యూ విభాగంలో దొంగ రశీదులు సృష్టించినందుకు ఓ సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ సస్పెండ్ కావడంతోపాటు అరెస్టయ్యారు. తాజాగా భూ కుంభకోణంలో కమిషనర్ అనిల్, ఆర్వో ప్రసాద్ సస్పెండ్ కావడంతోపాటు కటకటాల్లోకి వెళ్లారు. మరోవైపు ఇంధన వినియోగంలో అక్రమాలపై సీడీఎంఏ విచారణ కొనసాగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతుకు సంబంధించి కూడా విజిలెన్స్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొందరు అధికారులు సొంతంగా అక్రమాలకు అలవాటు పడగా.. మరికొందరు పాలకవర్గం ఒత్తిడి తట్టుకోలేక నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది.

అయిదేళ్లలో పలువురి బదిలీ..

గడిచిన అయిదేళ్లలో పలువురు కమిషనర్లు విధుల్లోకి రావడం.. దీర్ఘకాల సెలవు పెట్టి బదిలీ చేయించుకోవడం సాధారణంగా మారింది. అక్రమాలకు సహకరిస్తే ఉద్యోగానికి ముప్పు ఉందనే భయంతో ఎం.రవిబాబు 2019 అక్టోబరు 16న సెలవులో వెళ్లారు. డీఈగా ఉన్న లచ్చిరెడ్డికి కమిషనర్‌గా 2020లో బాధ్యతలు ఇవ్వగా ఆయనపై ఆరోపణలు రావడంతో సెలవులో వెళ్లారు. జయంత్‌కుమార్ అనే కమిషనర్ సైతం 2020 జూన్ 18న సెలవులో వెళ్లారు. పలు కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన మారుతిప్రసాద్ 2021 జులై 21న సెలవు తీసుకోక తప్పలేదు. ఇంధన వినియోగంలో తన మార్కు చూపించిన స్వరూపరాణి ప్రజాప్రతినిధులకు సహకరించడంలేదనే విమర్శలతో ముప్పుతిప్పలు పెట్టడంతో 2022 సెప్టెంబరు 4న దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.

# నారసింహుడి భక్తులకు తాగునీటి సమస్యలు

ధర్మపురి: ఏటా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రతిరోజు తాగునీటి సమస్య ఉంటుండగా.. రద్దీ వేళల్లో అధికంగా ఉంటుంది. ప్రతిరోజు స్వామివారి దర్శనానికి 3 నుంచి 5 వేల మంది భక్తులు వస్తుంటారు. 1.50 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతోంది. దివంగత మాజీ మంత్రి జే.రత్నాకర్‌రావు హయాంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని.. భక్తుల భాగస్వామ్యంతో శుద్ధజల నీటి పథకాన్ని ఆలయం పక్కన ఏర్పాటు చేయించారు. అయితే ఇది నిర్వాహణ లోపంతో మూలన పడింది. బోరు ఉన్న సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో ప్రస్తుతం గోపురాల ముందు ఓపెన్ సంపును ఏర్పాటు చేశారు. పురపాలక ట్యాంకర్ల ద్వారా ఇందులో వ్యవసాయ బావులు, గోదావరి నీటిని నింపి ఆలయంలోకి నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ నీటితోనే భక్తులు కాళ్లు, చేతులు కడగడంతో పాటు తాగటానికి ఉపయోగిస్తుండగా.. ఆలయ సిబ్బంది అయితే వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారు. ఇలా అపరిశుభ్రమైనా నీటితో భక్తులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం తలాపునే గోదావరి ఉన్నా.. నరసింహుని భక్తులకు



నదీ జలాలు అందడం లేదు. ఆలయంలో పూర్తిస్థాయిలో శుద్ధజలాలు అందించాలనే ఉద్దేశంతో గోదావరి నుంచి పైపులైను వేసి.. 4 మిలియన్ లీటర్ల ప్యూరిఫై ప్లాంటు కోసం 2018లో గతంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలకే పరిమితమైంది తప్ప పనులకు మాత్రం మోక్షం లభించ లేదు. శాశ్వతంగా ప్రత్యేక శుద్ధజల పథకాన్ని దేవస్థానంలో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమై**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిఖం భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. భూసేకరణ జరిగినా..: జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు.ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం – సుందర్, ఎస్ఈ. జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకో.. తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగుకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువుకు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థు ల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జిన్‌గుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాతిక సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూరులో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# ర్యాంకుల్లో ఎప్పుడు మెరిసేది!

కరీంనగర్ : కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)–2024లో.. ఉమ్మడి జిల్లాతో ముడిపడిన శాతవాహన విశ్వవిద్యాలయం సహా ఇతర విద్యా విభాగాల ఊసే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.. దీంతో విద్యార్థుల భవితను తీర్చిదిద్దే ఉన్నతవిద్యకు మరింత వన్నె తేవాల్సిన అవసరముందన్న విషయం స్పష్టమవుతోంది. ముఖ్యంగా డిగ్రీ ఆ పైస్థాయి చదువరుల విషయంలో మరింత నాణ్యమైన బోధన, సౌకర్యాల కల్పన విషయంలో సహకారమందాలి. విద్య, వికాసం, మెరుగైన ఫలితాలు, వసతుల తీరు.. ఇలా భిన్నమైన కోణాల్లో జరిపిన పరిశీలనల్లో మన దగ్గరి పరిస్థితులు కనీస ప్రమాణాలకు దరిదాపుల్లో లేకపోవడం ఒక గుణపాఠాన్ని నేర్పిస్తోంది.

**ఆసక్తి చూపినా.. ఫలితం శూన్యం**

ఉమ్మడి జిల్లా నుంచి 10 కళాశాలలు ర్యాంకుల కోసం పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 డిగ్రీ కళాశాలలు ఇందులో ఉండగా.. ఉమ్మడి జిల్లా నుంచి గోదావరిఖని, హుజూరాబాద్, కోరుట్ల, జమ్మికుంట, పెద్దపల్లి, అగ్రహారం, గంభీరావుపేట, మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తోపాటు కరీంనగర్, జగిత్యాలలోని మహిళా డిగ్రీ కళాశాలలు, జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ర్యాంకు కోసం పోటీ పడ్డాయి.

మరోవైపు 12 ఇంజినీరింగ్ కళాశాలలకు కేవలం 5 మాత్రమే దరఖాస్తు చేసుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో వైద్య కళాశాలలు ఇప్పుడిప్పుడే వసతులు, బోధన పరంగా ముందుకు వెళ్తుండడంతో వీటి ప్రస్తావనే



లేదు. ప్రైవేటు కళాశాలలు ఉన్నా దరఖాస్తు చేసుకోలేదు. బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలు ఉన్నా.. ఈ ర్యాంకుల దిశగా దృష్టి సారించలేదు.

**కొన్నేళ్లుగా గుర్తింపు లేదు..**

ఎన్ఐఆర్ఎఫ్ 2015 నుంచి ఆయా రాష్ట్రాల్లోని విద్యాసంస్థల ప్రగతిని ర్యాంకుల రూపంలో ఒక నివేదికను అందిస్తోంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కోర్ కమిటీ విద్యాపరంగా వనరులు, పరిశోధనలు, వృత్తిపరమైన అభ్యాసాలు, గ్రాడ్యుయేషన్ ఫలితాలు మొదలగు వాటిని భిన్నమైన కోణాల్లో గమనిస్తూ ఏటా వాటికి ర్యాంకులను ఇస్తుంది. మొత్తంగా 16 రకాల విద్యా సంబంధిత సంస్థల తీరు తెన్నుల్ని పర్యవేక్షిస్తుంది. ఆయా కళాశాలల నుంచి వచ్చిన ప్రతిపాదనలను గమనిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని తెలుసుకుని స్థానాల్ని కేటాయిస్తుంది. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ఒక్క విద్యా సంస్థకు తగిన గుర్తింపు రాలేదు.

**ఇవి అమలైతేనే..**ఉన్నత విద్య పరంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు రావాలి. సాధారణ బోధనే కాకుండా ప్రాక్టికల్ పరంగా పురోగతి పెరగాలి.

విద్యార్థుల్లో సాంకేతికత, కంప్యూటర్ సహా ఇతర నూతన విధానాల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి.

ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సొంత భవనాలు, కనీస వసతుల పరంగా ఇబ్బందులున్నాయి. బోధన సిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలి. భిన్నమైన అంశాల్లో కార్యశాలల నిర్వహణ సహా ప్రాజెక్టుల రూపకల్పనలో వైవిధ్యం జోడించేలా బోధన పరంగా ప్రత్యేకతలు కనిపించాలి. కొత్త కోర్సుల్లో సత్తా చాటే ప్రావీణ్యం విద్యార్థుల్లో పెరగాలి. ప్రయోగాలపై పట్టు సాధించాలి. నిధుల పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం సంపూర్ణంగా అందాలి. ప్రతిభను గుర్తించే విధంగా పలు పోటీలతో ప్రజ్ఞను వెలికితీయాలి.

జిల్లాకే పరిమితమవకుండా రాష్ట్ర, జాతీయస్థాయి విద్యాపరమైన పోటీలలో మన విద్యార్థులు భాగస్వామ్యమై విద్యా వికాసాన్ని మరింత పెంపొందించాలి.

# అంగన్వాడీలకు మంచి రోజులు

ధన్వాడ : త్వరలో 11వేల అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేసిన ప్రకటన మహిళా నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. ఖాళీలు భర్తీ అయితే అంగన్‌వాడీల నిర్వహణ మరింత బలోపేతం అవుతుం దనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం అంగన్‌వాడీలలో చాలావరకు కార్యకర్త లేదా ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో మొత్తం 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కార్యకర్తల ఖాళీలు 32 ఉండగా ఆయాల ఖాళీలు 105 ఉన్నాయి. పై రెండింటి ఖాళీలను కూడితే మొత్తం 137 అవుతున్నాయి. ఉన్న మొత్తంలో వీటిని లెక్కకడితే 20 శాతానికి సమానం అవుతున్నాయి. ఖాళీలు పలు కారణాలతో



ఏర్పడ్డాయి. ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను పెద్ద అంగన్‌వాడీలుగా మార్పులు చేసింది. మినీ అంగన్‌వాడీలో ఒకే ఉద్యోగి ఉంటుండగా ఆమె ఇపుడు కార్యకర్తగా మారింది. ఇక్కడ ఆయాలను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం పెద్ద అంగన్‌వాడీలుగా మారిన కేంద్రాలలో ఆయా పనులను సైతం కార్యకర్తలే నిర్వహిస్తున్నారు. నిత్యం కేంద్రాన్ని క్లీన్ చేయడం, ఇళ్లకు వెళ్లి పిల్లల్ని తీసుకరావడం, వంట పాత్రల్ని శుభ్రపర్చడం, వండటం, బోధించడం లాంటి పనులన్నింటిని కార్యకర్తలు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పని ఒత్తిడి వల్ల ఒక్కొక్కసారి పోషకారహారం తయారీలో జాప్యం జరుగుతుంది. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింత లతో మాట పడాల్సి వస్తోంది. ఒత్తిళ్లతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నట్లు పలువురు కార్యకర్తలు, ఆయాలు వాపోతున్నారు. పలు కేంద్రాల లో ఆయాలు వయోభారంతో పదవీ విరమణ పొందారు. మరి కొందరు వయసు సహకరించక స్వచ్ఛందగా వదులుకున్నారు. కొందరు కార్యకర్తలు రాజీనామాలు చేశారు. వీటన్నింటి కారణాలతో పై ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం రెండున్నరేళ్ల వయసు పిల్లల్ని కేంద్రాలలో చేర్పించాలని నిర్ణయించడం, ప్రీ స్కూళ్లగా కేంద్రాలను మారుస్తుండటం, బోధనలో కొత్త పుంతలు తొక్కుతుండటం లాంటి కారణాలతో ఖాళీల భర్తీకి నిర్ణయించింది.

# మిశ్రమ పంటలు.. సాగు ఆశాజనకం



తాండూరు: జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్ కింద మిశ్రమ పంటలు ఆశాజనకంగా సాగౌతున్నాయి. ఈ ఏడాది పప్పు ధాన్యాలకు ఎక్కువ ధరలు ఉండవచ్చనే ఆశతో రైతులు మిశ్రమ పంటలుగా కంది, పెసర, మినుము, బొబ్బర్లు వంటి వాటిని ఎక్కువగా సాగు చేశారు. ఇలా చేయడం వల్ల ఒకటి నష్ట పోయినా మరో దాని నుంచి మంచి దిగుబడులు సాధించి ఆర్థిక లబ్ధి పొందవచ్చనే ఉద్దేశంతో ఉన్నారు. ఆ మేరకు సాగులో ఉన్న పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

**4.35 లక్షల ఎకరాలకు పైబడి..**

జిల్లా వ్యాప్తంగా 5,78,874 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు చేయాల్సి ఉండగా 4.35లక్షల ఎకరాలకు పైబడి పంటలు సాగయ్యాయి. జిల్లాలోని 20 మండలాల్లో మిశ్రమ పంటల సాగు 30వేల ఎకరాలకు పైనే ఉంది. ఇందులో పత్తిలో మిశ్రమ పంటగా సాగైన కంది పంటనే 16వేల ఎకరాలకు పైబడి ఉంది. రైతులు పత్తిం కంది, పెసరంకంది, మినుముంకంది, జొన్నంకంది, పసుపుం మొక్కజొన్న వంటి తదితర పంటలను మిశ్రమంగా సాగు చేశారు. మిగిలిన పంటలు మరో 14వేల ఎకరాలకు పై బడి ఉన్నాయి. ః ఈసారి 100 శాతం వానాకాలం సాగు లక్ష్యంలో ఇప్పటికే 72.15 శాతానికి చేరుకుంది. జిల్లాలో వరి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ముందుగా నారు పోసుకున్న రైతులు ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలను ఆధారం చేసుకుని రైతులు పనులు చేపట్టారు.

చీడపీడల నివారణకు మందుల కొనుగోలు: రైతులు పంటలను ఆశించిన చీడపీడలను నివారించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈమేరకు వారు ఏచీడపీడల నివారణకు ఎలాంటి మందులు కావాలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో దుకాణాలకు రైతుల తాకిడి పెరిగింది.

**స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవచ్చు**

వానాకాలం సాగులో వెనుకబడిన రైతులు స్వల్పకాలిక పరిధిలోకి వచ్చే కందులను మొలక శాతం ఎక్కువగా ఉండేలా చూసుకుని విత్తుకోవచ్చు. జొన్నను కూడా ఇదే పద్ధతిలో విత్తుకోవాలి. వరి సాగును ఆగస్టు చివరి వరకు చేపట్టవచ్చు. చీడపీడలు, కలుపు మొక్కల నివారణ పనుల చేయవచ్చు.– డాక్టర్ సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు.

**శతశాతానికి మించి పత్తి**

వానాకాలం పంటల సాగులో ప్రధానమైన పత్తి పంటను రైతులు శతశాతానికి మించి సాగు చేశారు. 2,31,338 ఎకరాల్లో సాధారణ సాగు చేయాల్సి ఉంటే 2,41,592 ఎకరాల్లో పంట సాగైంది. ఇది 104.43 శాతంగా ఉంది.

# స్థలాల క్రమబద్ధీకరణ కసరత్తు షురూ



వికారాబాద్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో జిల్లాలోని ఆయా శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి తగిన విధంగా తర్ఫీదునిచ్చి క్రమబద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తారు. క్షేత్రస్థాయిలో ప్లాట్లను తనిఖీ చేయడం, దరఖాస్తుదారుల పరిశీలించటం వంటి ప్రక్రియను పూర్తి చేస్తారు. జిల్లాలో స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ మూడు సంవత్సరాలకోసారి సాగుతోంది. ఈసారి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి.

**గతంలో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో పురపాలిక, గ్రామ పంచాయతీ పరిధిలో 2022 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. నాటి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయంలో వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు సమాచారం అందుతుంది. వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, పట్టణ ప్రణాళిక పంచాయతీ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది.

క్రమబద్ధీకరణ నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో, మున్సిపాలిటీల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రక్రియను ప్రతి వారం సమీక్షిస్తారు. ఈ కేంద్రాలో దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందజేస్తారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు.

**మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు**

ప్రస్తుతం పురపాలిక సంఘాలు నిధులు లేక నీరసిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్లాట్లు మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు చేయనుంది. ఎల్ఆర్ఎస్–2019 పథకం కింద స్వీకరించిన దరఖాస్తులు 4023 కాగా వసూలు చేసిన ఫీజు రూ.56.90 లక్షలుగా ఉంది. **మండలాల వారీగా బృందాల ఏర్పాటు**

– లింగ్యానాయక్, జిల్లా అదనపు పాలనాధికారి, వికారాబాద్.

జిల్లాలో ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశాం. దీని కోసం ప్రత్యేకంగా యాప్‌ను వినియోగిస్తున్నారు. యాప్‌ను వినియోగించే విధానాన్ని తెలుసుకోవడానికి బృందాలకు తగిన శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది.

# బంగ్లా సంక్షోభం.. నేతన్నలకు అవకాశం

సిరిసిల్ల: అంతర్జాతీయ వస్త్రోత్పత్తుల ఎగుమతుల్లో చైనా, బంగ్లాదేశ్, వియత్నాం తర్వాత మన దేశం నాలుగో స్థానంలో ఉంది. మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ సంక్షోభం నెలకొంది. దీని ప్రభావం ఆ దేశంలోని టెక్స్‌టైల్ రంగంపైన చూపనుంది. ఇప్పటికే అక్కడికి వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఇచ్చే అంతర్జాతీయ సంస్థలు మన దేశం వైపు చూస్తున్నాయి. చెన్నై, మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత మరమగ్గాలపై వస్త్రోత్పత్తులకు ప్రసిద్ధి సిరిసిల్ల. ఈనేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోని వస్త్రపరిశ్రమకు అంతర్జాతీయ ఆర్డర్లు పెరిగితే దేశీయంగా డిమాండ్ ఉన్న వస్త్రోత్పత్తులపై మన జిల్లా వస్త్రోత్పత్తిదారులు దృష్టి సారిస్తే లబ్ధిచేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మరమగ్గాలున్నాయి. ఇవి పూర్తిస్థాయిలో పని చేస్తే రోజుకు సుమారు 13.20 లక్షల మీటర్ల పాలిస్టర్, 6.60 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తులు జరుగుతాయి. అరకొరగా వస్తున్న ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు ఉపాధి అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా పరిశ్రమకు మహారాష్ట్ర, గుజరాత్, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్డర్లను పీస్‌రేట్ పద్ధతిలో ఉత్పత్తి చేసి ఇవ్వడం ద్వారా ప్రస్తుతం ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో తయారయ్యే కాటన్ వస్త్రాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ తయారైన వస్త్రాన్ని చెన్నైలోని ఈరోడ్, రాజస్థాన్‌లోని బల్వొత్రాలోని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి అత్యాధునిక అద్దకం యూనిట్లలో రంగుల అద్దకం పూర్తయ్యాక ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతోంది. జిల్లాలో మూడంచెల వ్యవస్థలోని పరిశ్రమలో యజమానుల ఆర్డర్లతో ఆసాములు, కార్మికులు వస్త్రాలను ఉత్పత్తి చేసి ఉపాధి పొందుతారు.

బంగ్లాదేశ్‌లోని రాజకీయ సంక్షోభం అక్కడి టెక్స్‌టైల్ ఉత్పత్తులపైనా



చూపనుంది. టెక్స్‌టైల్ రంగానికి కావాల్సిన ముడి సరకును ఎగుమతి చేయడంతో చైనా తర్వాత బంగ్లాదేశ్ రెండో స్థానంలో ఉంది. ఇక్కడ వస్త్రోత్పత్తులను తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేస్తారు. ప్రభుత్వ రాయితీలు, తక్కువ వేతనాలతో పని చేసే కార్మికులు ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. ఈక్రమంలో ఆ దేశానికి వెళ్లే యూరోపియన్ బ్రాండ్ సంస్థలు మన దేశంలోని తిరుపూరు, ఈరోడ్, ఇచ్చల్‌కరంజీలోని ఉత్పత్తిదారులకు ఇస్తున్నారు. చెన్నై, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని మరమగ్గాల పరిశ్రమలో కాటన్, పాలిస్టర్, నిట్‌వేర్ వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండటంతో ఇక్కడ తయారయ్యే వస్త్రాలు జాతీయ, అంతర్జాతీయంగా గార్మెంట్ పరిశ్రమలకు ఎగుమతి అవుతున్నాయి. సిరిసిల్లలోని గ్రీన్‌నిడిల్ గార్మెంట్ పరిశ్రమకు ఇక్కడి నుంచే వస్త్రం దిగుమతి అవుతుంది. అంతర్జాతీయ సంస్థలు దేశంలోని వస్త్రోత్పత్తి ప్రాంతాల ఉత్పత్తి సామర్థ్యాల వివరాలను సేకరిస్తున్నాయి. కాగా జిల్లా వస్త్రోత్పత్తిదారులు దేశీయ ఉత్పత్తులపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీంతో ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న పరిశ్రమకు జాతీయ స్థాయి వస్త్రోత్పత్తుల్లో పట్టుసాధించే అవకాశాలు ఉన్నాయి.

# వరి పంటకే మొగ్గు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఎప్పటిలాగే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో కూడా రైతులు వరి పంట వైపే మొగ్గు చూపారు. మొత్తం 1,99,021 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా ఇందులో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు చేశారు. రెండో స్థానంలో పత్తి పంట ఉండగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కంది పంటలు వరుసగా రెండు, మూడో స్థానాలకు పరిమితమయ్యాయి. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఏ మాత్రం ఊరటనివ్వడం లేదు. భారీ వర్షాలు లేకపోవడం వల్ల నీటి వనరుల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరడం లేదు. దీంతో జిల్లాలో చాలా వరకు చెరువులు, కుంటల్లో సాగునీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. భూగర్భజల మట్టాలు సైతం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బోరుబావులు, బావుల్లో నీటిధార క్రమంగా తగ్గిపోతోంది. మరికొన్ని ప్రాంతాల్లో సీజనల్ బోర్లు ప్రస్తుతానికి సాగునీరు అందిస్తున్నా వర్షాలు పడకపోతే వెనక్కి తగ్గే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని 516 చెరువుల్లో కొన్ని మినహా అధికశాతం నిండకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఎగువమానేరు, సింగసముద్రం చెరువుతోపాటు వంద ఎకరాలకు



పైగా ఆయకట్టు కలిగిన ఇతర నీటి వనరులు వెలవెలబోతున్నాయి. ఈనేపథ్యంలో వరి పంటను సాగు చేసిన అన్నదాతలు భారీ వర్షాలపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,83,080 ఎకరాలకు గాను ఈ నెల 12 వరకు 1,49,580 ఎకరాల్లో సాగు చేశారు. మరో వారం లోపు వరినాట్లు వేసే ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అన్ని మండలాల్లో వరి సాగుకే రైతులు ప్రాధాన్యతనిచ్చారు.

8 మండలాల్లో...ఈ సంవత్సరంలో ఈ నెల 13 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 450.2 మిల్లీ మీటర్లు కాగా, 511.4 మిల్లీ మీటర్లు కురిసింది. సాధారణం కంటే 14 శాతం ఎక్కువ కురిసింది.

సాధారణ వర్షపాతం నమోదైన మండలాలు

రుద్రంగి, వేములవాడ గ్రామీణం, సిరిసిల్ల, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి

లోటు: గంభీరావుపేట అధికం: చందుర్తి, బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి– చాద భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల మొగిపురుగు తక్కువగా ఉంది. ఎక్కడైనా మొగిపురుగు ఆశిస్తే ఎకరానికి 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను నాట్లు వేసిన 18 నుంచి 25 రోజుల లోపు చల్లాలి. పొలాన్ని ఆరబెడుతూ నీటిని అందిస్తే ఎదుగుదల ఎక్కువగా ఉంటుంది. ఆకులు పసుపు వర్ణం, ఆ తర్వాత గోధుమ రంగులోకి మారి, పెలుసుగా తయారైతే జింక్‌లోపంగా గుర్తించాలి. జింక్ లోపం నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి, వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

# పరిశుభ్రతపై శ్రద్ధేదీ?

కందనూలు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలు దాడి చేస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ఆసుపత్రులకు రోగుల సంఖ్య పెరుగుతోంది. అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో రోజూ 800 నుంచి 950 వరకు ఓపీ నమోదు అవుతోంది. కల్వకుర్తి సివిల్ ఆసుపత్రిలో 350, అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో 280, కొల్లాపూర్ సివిల్ ఆసుపత్రిలో 225 వరకు ఓపీ నమోదు అవుతోంది. మూడు, నాలుగు రోజుల పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు నమోదు కాకపోయినా నొప్పులు, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

రోగుల తాకిడి.. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడానికి జిల్లా వైద్యారోగ్యశాఖ, పట్టణాల్లోని పురపాలక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే నామమాత్రంగా నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పుర, గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారు తప్ప దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలనీల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు తప్ప శివారు



కాలనీల్లో పరిసరాలు శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇళ్ల మధ్య నీరు చేరి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి.

9 డెంగీ కేసులు నమోదు

జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు 9 డెంగీ కేసులు, మలేరియా 06, టైఫాయిడ్ 5 కేసులు నమోదు అయ్యాయి. జులై నెలలో లింగాల మండలం చెన్నారంలో ఓ వ్యక్తికి, ఆగస్టు 10న నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఓ వ్యక్తికి డెంగీ సోకింది. అత్యవసర పరిస్థితిలో కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటుండటంతో డెంగీ, టైఫాయిడ్ కేసులు రికార్డుల్లో నమోదు కావడం లేదు. వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్పిన దాని కంటే క్షేత్ర స్థాయిలో కేసులు ఎక్కువగానే నమోదవుతున్నట్లు తెలుస్తోంది. అవగాహన కల్పిస్తున్నాం – తారాసింగ్, జిల్లా ఉపవైద్యాధికారి, అచ్చంపేట

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పలు రకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాలు, పట్టణాల్లో డ్రై డే నిర్వహిస్తూ పరిసరాలు శుభ్రంగా చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసుపత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

నిఘా నేత్రం
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 సెప్టెంబర్ 2024

# రిజిస్ట్రేషన్ కార్యాలయాలు.. వసూళ్ల నిలయాలు

గూడూరు : సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వసూళ్లకు నిలయాలుగా మారాయి. పత్రాలు సక్రమంగా ఉన్నా చేయి తడిపితే కానీ పని కావడం లేదు. కొందరు డాక్యుమెంట్ రైటర్లే వసూళ్ల రాయుళ్లుగా చలామణి అవుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునే పరిస్థితి కరవైంది. అధికారుల వాటాతో పాటు డాక్యుమెంట్ తయారీ ఖర్చుల కింద పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయి.

జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.782.68 కోట్ల లక్ష్యంగా ఉంది. 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. తిరుపతి రూ.172.77 కోట్లు, గ్రామీణం రూ.97.41 కోట్లు, గూడూరు రూ.52.91 కోట్లు, చంద్రగిరి రూ.46.03 కోట్లు, సూళ్లూరుపేట రూ.31.92 కోట్ల మేర ఏటా లక్ష్యంగా ఉంది. ఇందులో 3–5 శాతం మేర వసూలు చేస్తున్నారు. అధికారుల వాటాగా ఫీజు టు ఫీజు వసతుల పేరిట మరికొంత, కార్యాలయ ఖర్చుల పేరిట లెక్కలేస్తున్నారు.

భయపెట్టి మరీ..జిల్లాలోని కార్యాలయాల్లో ఏటా రూ.50 కోట్ల మేర వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఫీజుతో పాటు పత్రాలు సరిగా లేవని భయపెట్టి నాలుగైదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లపై 2019లో అనిశా దాడులు చేసింది. ఆ సమయంలో రూ.లక్షల్లో నగదు బయట పడింది. రైటర్ల వద్ద నగదు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. అయినా పరిస్థితులు మాత్రం మారలేదు.

సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ డాక్యుమెంట్ రైటరే అంతా తానై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తడ,



దొరవారిసత్రం మండలాల నుంచి ప్రజలు, ఉద్యోగులను తన గుప్పెట్లో పెట్టుకుని చక్కబెట్టేయడం గమనార్హం. ఏకంగా రూ.50 కోట్ల మేర గత పాతికేళ్లలో కూడబెట్టినట్లు స్థానికుల ఆరోపణ.

లొసుగులు సృష్టిస్తూ..

స్థిరాస్తి కార్యకలాపాల్లో అమ్మకాలు, కొనుగోళ్లలో ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో వీరి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. పత్రాలు సక్రమంగా ఉన్నా.. కొర్రీలు పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. ఈ తతంగం అంతా దస్తావేజు లేఖర్ల కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. పట్టణాల్లో మిగులు భూముల క్రయవిక్రయాల్లో దస్త్రాల తయారీలో లొసుగులు సృష్టిస్తున్నారు. ఉదాహరణకు నాయుడుపేటలో నాలుగేళ్ల కిందట ఓ వ్యక్తి జీపీఏ ద్వారా భూమి కొంటే దానికి తమ బంధువుల సంతకాలు లేవని స్వాధీనం చేసుకోగా.. కొనుగోలుదారు రూ.50 లక్షలు చెల్లించి తిరిగి రిజిస్టర్ చేసుకున్నారు.

# పారిశ్రామికవేత్తల చూపు.. జిల్లా వైపు

నాయుడుపేట : కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తల చూపు మళ్లీ రాష్ట్రంపై పడింది. దీంతో మేనకూరు సెజ్, క్రిస్ సిటీ, శ్రీసిటీ పారిశ్రామిక వాడల్లో రూ.72 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. ఇప్పటికే కొన్ని పరిశ్రమలకు భూములు కేటాయించడంతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైనా వైకాపా హయాంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పారిశ్రామికవాడల్లో వసతులు కల్పించకపోవడంతో పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేశారు. కూటమి ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వడం.. మౌలిక వసతుల కల్పనలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి.

4 లక్షల మందికి ఉపాధి..

కోట, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంతంలో క్రిస్ సిటీ నిర్మాణానికి 2016లో తెదేపా, ఎన్డీయే ప్రభుత్వాలు 2500.49 ఎకరాల్లో భూసేకరణ చేపట్టాయి. వైకాపా ప్రభుత్వం భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఇక్కడ 7 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.37,500 కోట్ల పెట్టుబడులతో 4 లక్షల మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ఈ పారిశ్రామికవాడలకు జాతీయ



రహదారులు, రైల్వే లైన్లు అనుసంధానం చేయనున్నారు. త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా క్రిస్ సిటీ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రూ.1,800 కోట్లతో కార్బన్ పరిశ్రమ..

మేనకూరు పారిశ్రామిక వాడలో రూ.1,800 కోట్లతో బిర్లా కార్బన్ పరిశ్రమ ఏర్పాటుకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. కార్బన్ ఉత్పత్తులతో పాటు అదనంగా పవర్ జనరేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు. ఇదే పారిశ్రామిక వాడలో గ్రీన్‌టెక్ పరిశ్రమ రూ.250 కోట్ల పెట్టుబడులతో అదనపు ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు తీసుకుంది.

రూ.40 కోట్లతో అత్తివరం వద్ద..

పరిశ్రమలకు ఉక్కు నిర్మాణాలను అందించే ఇంటరార్క్ సంస్థ అత్తివరం వద్ద రూ.40కోట్ల పెట్టుబడులతో ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇందుకు 10 ఎకరాల భూమి కేటాయించనున్నారు. మొదటి దశలో నాలుగు ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తయితే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలన్నింటికీ ఉక్కు నిర్మాణ పరికరాలు అందించే అవకాశముంది.

# అయోమయంలో ఆగ్రోస్



చిత్తూరు : గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఆగ్రోస్ సంస్థను గాలికొదిలేసింది.. ఏపీ ఆగ్రోస్(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) కార్యకలాపాలు అయోమయంగా మారాయి.. సంస్థ సేవలు అన్నదాతకు దూరమయ్యాయి.. సాగులో కర్షకులు చేదోడువాదోడుగా ఉండాల్సిన ఆగ్రోస్ కనుమరుగైంది. కూటమి ప్రభుత్వం ఆగ్రోస్‌కు పూర్వవైభవం తెచ్చి సేవలు విస్తరిస్తుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటైన ఆగ్రోస్ సంస్థ ఒకప్పుడు రైతుల సంక్షేమానికి విశేష సేవలందించి మంచి ఆదరణ పొందింది. వ్యవసాయ బంజరు, బీడు భూములను చదును చేయడం, పొలాల చుట్టూ కందకాల తవ్వకం, చెరువుల్లోని సారవంతమైన మట్టిని పొలాలకు తరలించడం, పెద్దపెద్ద చెట్లు, గుట్టలు తొలగించడం, సేద్యపు కుంటలు తవ్వకానికి యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. ప్రస్తుతం పెద్ద యంత్రాల నిర్వహణ లేక అవికాస్తా తూతూమంత్రంగా నడుస్తున్నాయి.

కంప్యూటర్ ఆపరేటరే దిక్కు..

ఈ కార్యాలయం మొత్తానికి ఒప్పంద కంప్యూటర్ ఆపరేటరే దిక్కు. కార్యాలయ నిర్వహణ, పర్యవేక్షణను ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. భూములను చదును చేసే పెద్ద యంత్రాల నిర్వహణ, సమకూరే ఆదాయం, ఖర్చులు, అధికారులు, సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. సేవలను విస్తృత పరిచి సాగు యంత్రాలను రైతులకు అందుబాటులో తీసుకువచ్చే ప్రణాళికలే లేవు. కనీసం కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సమాధానం చెప్పే నాథుడే కరవయ్యాడు.

ఇన్‌ఛార్జి అధికారెక్కడా..?

ఆగ్రోస్ ఆర్ఎంగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రాష్ట్ర ఆగ్రోస్ కార్యాలయంలో జీఎం రాజమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నెల రోజులు కావస్తున్నా.. ఈ కార్యాలయం వైపు ఆయన కన్నెత్తి చూడలేదు.

పాడైపోతున్న పరికరాలు..

ట్రాక్టరు, వరి, వేరుసెనగ విత్తన నాట్లు యంత్రాలు, రొటోవేటరు, మడకలు, వేరుసెనగ నూర్పిడి యంత్రం, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రం సాగుకు ఉపయోగపడే పలు రకాల అధునాతన యంత్రాలు ఈ కార్యాలయంలోనే ఐదేళ్లుగా వినియోగించక పాడైపోతున్నాయి.

# ఎట్టకేలకు విభజించారు!



చిత్తూరు : ప్రజలకు విద్యుత్తు సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.. సమస్యలు సత్వర పరిష్కారం కానున్నాయి.. కొత్త జిల్లాల వారీగా ఎస్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.. గత ప్రభుత్వంలో కొత్త జిల్లాలు ఏర్పడినా సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు కాలేదు.. తిరుపతిలోని విద్యుత్తు శాఖ కార్యాలయం నుంచే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కార్యకలాపాలు నిర్వహించేవారు.. అన్ని విద్యుత్తు సంస్థల డిస్కంల పరిధిలో జిల్లాల వారీగా నూతన సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.. ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్కిల్ కార్యాలయం మూడు విభాగాలుగా విడిపోనుంది.. చిత్తూరుతో పాటు అన్నమయ్య జిల్లా రాయచోటిలోనూ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కేంద్రం చిత్తూరు అయినప్పటికీ విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో కొనసాగేది. కొన్నేళ్లుగా చిత్తూరు ప్రజలు విద్యుత్తు సేవలు, సమస్యల పరిష్కారానికి తిరుపతికి వెళ్లాల్సివచ్చేది. ఈ సమస్యకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. ఇన్నాళ్లు ఏ ఆమోదం కావాలన్నా.. కీలకమైన సేవలకు తిరుపతిలోని సర్కిల్ కార్యాలయం నుంచి పొందాల్సి వచ్చేది. ఉద్యోగుల, సర్వీసు వ్యవహారాలూ అక్కడి నుంచే నిర్వహించేవారు. ఇకపై జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఏర్పాటయ్యే నూతన సర్కిల్ కార్యాలయంలోనే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అక్టోబరు రెండో తేదీ నుంచి ఇక్కడ కార్యాకలాపాలు ప్రారంభించే దిశగా కసరత్తు వేగవంతం చేశారు. సర్కిల్ కార్యాలయానికి పర్యవేక్షక ఇంజినీరు, సీనియర్ అకౌంట్స్ అధికారి పోస్టులు రానున్నాయి.

సర్కిల్ పరిధిలో డివిజన్లు..కొత్త సర్కిల్ పరిధిలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు డివిజన్లు ఉంటాయి. ప్రస్తుతం పుత్తూరు డివిజన్ (కొన్ని మండలాలు చిత్తూరు, తిరుపతి జిల్లాలో ఉన్నాయి). చిత్తూరులో అద్దె భవనంలో నూతన సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ) పరిపాలనా వ్యవహారాలు సాగించనున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు మెరుగులు




పుంగనూరు : జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు రానున్నాయి. గత వైకాపా పాలనలో ఈ కేంద్రాల్లో కనీస వసతులు కరవయ్యాయి. చిన్నారులు అసౌకర్యాల మధ్యనే కేంద్రాల్లో కొనసాగారు. పలు కేంద్రాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వసతులు లేక నానా అవస్థలు పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంగన్‌వాడీ కేంద్రాల రూపు మారుతోంది. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడానికి తెదేపా ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత తాగునీరు, మరుగుదొడ్లకు ప్రాధాన్యతనిచ్చింది. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36వేలు, తాగునీటి కల్పనకు రూ.17వేలు మంజూరు చేసింది. రూ.2.20 కోట్లు మంజూరు..జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 380 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1,36,80,000లు, తాగునీటి వసతులకు రూ.84,15,000లు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలో పనులు చేపట్టడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టేలా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, చిత్తూరు రూరల్, గంగాధర నెల్లూరు, ఐరాల, కార్వేటినగరం, కుప్పం, నగరి, పలమనేరు, పులిచర్ల, పుంగనూరు, శాంతిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మంజూరైన మరుగుదొడ్ల సంఖ్య, నిధులు, తాగునీటి పనులు, నిధుల మంజూరు ఇలా ఉన్నాయి.త్వరలో పనులు ప్రారంభిస్తాం సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కల్పన పనులు త్వరలో ప్రారంభమవుతాయి. ప్రభుత్వం నిధుల కేటాయింపుతో పాటు పనుల బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించింది. ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూస్తాం. నాగశైలజ, పీడీ, ఐసీడీఎస్, చిత్తూరు

# రాత్రి తవ్వకం.. పగలు రవాణా

పెనుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించిందే తడవుగా ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు.. ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిన తోడేస్తున్నారు.. నదులు, వాగులు, వంకల్లో తమకు ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో వాహనాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.. టిప్పర్లు, లారీల్లో ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నారు.. రోజు వందల సంఖ్యలో వాహనాల్లో అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు.. ఓవైపు అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోక తమ పని చేసుకుపోతున్నారు.

అంతా అక్రమమే..

ఎన్టీఆర్ జలాశయానికి నీరు అందించే భీమా నది పూతలపట్టు వైపు నుంచి ప్రవహిస్తుంది. ఈ నదిలో బండపల్లె సమీపంలో కొందరు రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ తరలించేందుకు అనుమతి లేదు. అయినప్పటికీ ఒక్కోసారి రాత్రివేళ యంత్రాలతో కుప్పగా చేర్చి పగలు ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో చిత్తూరు, పెనుమూరు, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రూ.2500 నుంచి రూ.3 వేలు వరకు విక్రయిస్తున్నారు. పెనుమూరు మండలం



పూనేపల్లె సమీపంలో నీవానది నుంచి సైతం వాహనాల్లో యథేచ్ఛగా తోడేస్తున్నారు. వాహనాల రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకల్లో సైతం తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు.

భారీ వాహనాల్లో తమిళనాడుకు..

జిల్లా నుంచి తమిళనాడుకు భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారు. అక్కడ మంచి గిరాకీ ఉండటాన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. భారీ లారీల్లో నింపి అధికారుల కళ్లుగప్పి పైభాగంలో ప్లాస్టిక్ పట్టలు కప్పేస్తున్నారు. ఇలా జీడీనెల్లూరు, పాలసముద్రం మండలాల మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల టిప్పర్లు పట్టుబడటం, ఓ భారీ వాహనం బోల్తా పడిన సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు మండలాల స్థాయిలో కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై సభ్యులు. ఆయా కమిటీలకు సమాచారం ఇచ్చి అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చిన్నయ్య, ఆర్డీవో, చిత్తూరు

# టాస్క్‌ఫోర్స్‌కు.. బదిలీల బలహీనతలు

తిరుపతి : శేషాచలం కొండల్లోని ఎర్రచందనం సంరక్షణకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లో జరుగుతున్న బదిలీల వెనుక మతలబేమిటో ఎవరికీ అంతుపట్టడం లేదు. అధికారులను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా వారు కొనసాగుతుండటం గమనార్హం. కొందరు బదిలీపై వెళ్లినా వారి స్థానాల్లో కొత్తవారు రావడం లేదు. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు, నాయకులతో అంటకాగిన అధికారులను బదిలీచేసి ఆయా శాఖలను ప్రక్షాళన చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీని ఆగస్టు మొదటి వారంలో బదిలీ చేసింది. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. టాస్క్‌ఫోర్స్‌లో మూడు డీఎస్పీ పోస్టులుండగా వైకాపా ప్రభుత్వం ఇద్దరినే ఐదేళ్లు కొనసాగించింది. కూటమి ప్రభుత్వం రాగానే మురళీధర్‌ను ప్రొద్దుటూరుకు, చెంచుబాబును నాయుడుపేట డీఎస్పీగా బదిలీ చేయడంతో రెండు పోస్టులూ ఖాళీ అయ్యాయి. ఈ నెల 18న ప్రొద్దుటూరుకు వెళ్లిన మురళీధర్‌నే మళ్లీ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా నియమించడం గమనార్హం. టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను గతనెలలో అనంతపురం పోలీసు శిక్షణ కేంద్రం (అప్పా)కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అప్పటి నుంచి ఎవరినీ ఇక్కడ నియమించకపోవడంతో ఆయనే ఎస్పీగా కొనసాగుతున్నారు. వైకాపా నేతలతో అంటకాగారన్న ఆరోపణలతోనే రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవలే వీఆర్‌కు పంపింది. ఈ స్థానంలోనూ ఎవరినీ నియమించలేదు. టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐ స్థానంలో మరొకరిని కేటాయించ లేదు. ఇలా బదిలీల్లో చోటుచేసుకుంటున్న గందరగోళ పరిస్థితులతో టాస్క్‌ఫోర్స్ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతోంది.

# నిర్వహణ లేక వెలు'గోడు'

వెలుగోడు : వెలుగోడు జలాశయం నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్ల పాలనలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో చిన్న చిన్న మరమ్మతులు సైతం చేపట్టలేని దుస్థితి నెలకొంది. తెలుగుగంగ ప్రాజెక్టులో కీలకమైన ఈ జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 16.95 టీఎంసీలు. నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, వందలాది గ్రామాలకు, చెన్నై నగరానికి తాగునీరు అందించడంలో కీలకమైన ఈ ప్రాజెక్టును పట్టించుకునే వారు కరవయ్యారు. వర్షంనీరు వెళ్లే దారిలేక మట్టి కట్ట పలుచోట్ల కోతకు గురైంది. కిందిభాగంలో గోతులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక జలాశయం బలోపేతానికి అవసరమైన నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.మట్టికట్టపై పడిన వర్షంనీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాల్వలు దెబ్బతిని పూడిపోయాయి. దీంతో వర్షంనీరు పక్కన ప్రవహించి కట్ట కోతకు గురైంది.కట్ట పైభాగంలో ఎటుచూసినా పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. సకాలంలో వీటిని తొలగించకపోతే కట్ట పటిష్ఠత తగ్గే ప్రమాదం ఉంది.గాలేరు వాగువైపు ఉన్న గేట్ల వద్ద లస్కర్ల కోసం కట్ట పైభాగంలో గది నిర్మించారు. తెలుగుగంగ ప్రధాన కాల్వకు ఉన్న గేట్ల వద్ద మరో గది ఉంది. నీటి విడుదలను నియంత్రించడంతో పాటు పహారా కాసే లష్కర్లు ఈ గదుల్లో విశ్రాంతి తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం వీటిలో ఓ గది ఒరిగిపోయింది. ఇది కూలితే ప్రాణాలు పోతాయన్న భయంతో వర్షాలు కురిసినప్పుడు సిబ్బంది బయట తడుస్తూనే విధులు నిర్వర్తిస్తున్నారు. గేట్లకు గ్రీజు పూసేందుకు కూడా కాసుల కష్టం వేధిస్తోంది.

ప్రతిపాదనలు పంపాం వెలుగోడు జలాశయంతో పాటు సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వెలుగోడు జలాశయం కట్ట మరమ్మతులు, నిర్వహణకు నిధుల్లేక రెయిన్ డ్రైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరద గేట్లు, ప్రధాన కాల్వ, కట్ట మరమ్మతులకు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపాం.

నిఘానేత్రం

ఆదివారం 29 సెప్టెంబర్ 2024

# ఆరోగ్యానికి పౌష్టికాహార పెరటి!

పుట్టపర్తి : ధర్మవరం మండలం వసంతపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పర్యవేక్షణలో వస్తున్న దిగుబడులను మధ్యాహ్న భోజనం తయారీకి వినియోగిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడని ఉత్పత్తులు కావటంతో ఆరోగ్యపరంగా మేలు కలుగుతోందని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాలు కలిగిన ఆహారంతో ఆరోగ్యంగా ఉండగలం. రసాయనేతర సేంద్రియ సాగు ఆహార ఉత్పత్తులతో మరింత ప్రయోజనకరం. అందుకే ప్రభుత్వ బడుల్లోని ఆవరణాల్లో కూరగాయల సాగుతో ఆరోగ్యం, ఆదాయం సమకూరేలా ప్రభుత్వం పౌష్టికాహార పెరటి తోట సాగుకు శ్రీకారం చుట్టింది. తద్వారా బహుళ ప్రయోజనాలకు అవకాశం ఉంది. ప్రభుత్వమే వంకాయ, మిరప, టమాటా, బెండకాయ, గోంగూర తదితర కాయగూరల విత్తనాలను సరఫరా చేస్తోంది. జులై చివరి వారంలో ఎంపిక చేసిన 120 బడుల్లో సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలుచోట్ల ఆకుకూరలు, బెండకాయ దిగుబడులతో కూరలు వండుతున్నారు. తద్వారా ఖర్చు తగ్గింది. ఉ



పాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల బృందాలు పెరటి తోటలను సంరక్షిస్తుంటాయి. ఒక్కో రకాన్ని ఒక్కో తరగతి విద్యార్థులకు అప్పగించారు. తద్వారా పిల్లలకు బాధ్యతలతోపాటు పోషకాహారం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకుంటారు.

పుట్టపర్తి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులను బృందాలుగా నియమించి సంరక్షిస్తున్నారు. బెండకాయ, టమాటా, మిరప, వంకాయ, కొత్తిమీర, మెంతి, గోంగూర పండిస్తున్నారు. ఇక్కడ వంటావార్పుకు వినియోగిస్తున్నారు.

కదిరిలోని కస్తూర్బా విద్యాలయంలో టమాటా, వంకాయ, మిరప చెట్లు పూతకు వచ్చాయి. పౌష్టికాహారానికి అవసరమైన వాటిని తామే పండిస్తున్నామన్న ఆనందం విద్యార్థుల్లో కనిపిస్తోంది.

అవకాశం ఉన్న చోట్ల సాగు..– మీనాక్షి, విద్యాశాఖాధికారిణి, శ్రీసత్యసాయి జిల్లా జిల్లాలోని 120 బడుల్లో పెరటితోట సాగు చేస్తున్నారు. అవకాశాలు ఉన్న పాఠశాలల్లో సాగు చేయిస్తాం. అవసరమైన విత్తనాలను అందిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుంది.

# దబ్బచిక్కుడు.. రైతు కంట నీరు

తాడిపత్రి : గత ఏడాది కాసుల వర్షం కురిపించిన దబ్బచిక్కుడు పంట ప్రస్తుతం రైతు కంట నీరు పెట్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇక్కడ పంట సాగవుతుంది. ఆరు గాలం శ్రమించి పంట సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది కిలో రూ.60 నుంచి రూ. 70 వరకు పలికిన ధర ప్రస్తుతం కనీస గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

దిగుబడి ఉన్నా..తాడిపత్రి నియోజవర్గ వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగులో ఉంది. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టి బిందు సేద్యం ఆధారంగా సాగు చేపట్టారు. గత నెల నుంచి పంట చేతికి వస్తోంది. దబ్బచిక్కుడు పంటకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై మార్కెట్‌లో మాత్రమే మంచి డిమాండ్ ఉంటుంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక రైతులు నేరుగా పంటను చెన్నై మార్కెట్‌కు తరలిస్తున్నారు. కిలో రూ.10 మాత్రమే పలుకుతుండడంతో రవాణా ఖర్చులు, మార్కెట్ కమీషన్, కూలీల



ఖర్చులు పోను పైసా చేతికి దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో పంటను పొలంలో వదిలేయలేక పెట్టుబడులు రాకపోయినా మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

చేతి నుంచే కూలీలకు చెల్లిస్తున్నా

రెండెకరాల్లో దబ్బచిక్కుడు పంట సాగు చేశా. రూ.80 వేల వరకు పెట్టుబడి వచ్చింది. నెల రోజుల నుంచి పంట చేతికి వస్తోంది. కిలో ధర రూ.10 వరకే ఉంది. కూలీలకు చేతి నుంచి చెల్లిస్తున్నా .అధికారులు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి.

గౌస్, రైతు, పెద్దపప్పూరు

అధికారులతో చర్చించి న్యాయం చేస్తాం

తమిళనాడు రాష్ట్రంలో మాత్రమే దబ్బచిక్కుడు పంటను ఎక్కువగా వినియోగిస్తారు. స్థానికంగా వినియోగించేవారు లేకపోవడంతో రైతులంతా చెన్నై మార్కెట్‌కు దిగుబడిని తరలిస్తున్నారు. ఒకే మార్కెట్‌కు పంట అధికంగా పోవడంతో ధరలు తగ్గాయి. తమిళనాడు మార్కెట్లలో పరిస్థితులను తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి

# ఉద్యోగుల బదిలీలు అస్తవ్యస్తం



అనంతపురం : క్షేత్ర స్థాయిలో ప్రజాపాలన సాఫీగా సాగడానికి తెదేపా కూటమి ప్రభుత్వం.. సాధారణ బదిలీలకు ఇచ్చిన అవకాశాన్ని కొన్ని శాఖల అధికారులు దుర్వినియోగ పరిచేలా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేయడంపై ప్రజాప్రతినిధులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలతో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం బదిలీలు జరిగినట్లు చెబుతున్నారు. రెవెన్యూ, జడ్పీ, పంచాయతీ, వెలుగు, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, ఇంజినీరింగు.. తదితర శాఖల్లో చేతివాటం ప్రదర్శించారని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి.

గతనెల 19న మొదలై: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి కొన్ని శాఖలకే పరిమితం చేస్తూ సాధారణ బదిలీలు చేపట్టారు. ఆగస్టు 19 నుంచి 31వ తేదీలోపు బదిలీలను పూర్తి చేయాలని జీవో 75ను జారీ చేశారు. అదే నెలలోనే వరదలు, పింఛన్ల పంపిణీ ఉండటంతో ఈనెల 15వ తేదీ దాకా గడువు పొడిగించారు. తర్వాత విజయవాడ వరదల సహాయక చర్యల్లో పాల్గొనడానికి రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్, విద్యుత్తు.. తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు వెళ్లారు. మూడోసారి మళ్లీ ఈనెల 22 వరకు గడువు ఇచ్చారు. ఇలా రెండు దఫాలు గడువు పొడిగించినా కొన్ని శాఖల జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారీలో జాప్యం చేశారు. గడువు ముగియనున్న సందర్భంలో బదిలీలు జరిపారు. గత వైకాపా పాలనలో అంటకాగిన వారికి జిల్లా కేంద్రానికి సమీపంలోని స్థానాలు కేటాయించడంతో కొందరు ప్రజాప్రతినిదులు తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు. మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లా పరిషత్తులో గడువు 22లోపు బదిలీలు చేయలేదు. 23 అర్ధరాత్రి దాకా ఉద్యోగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇన్‌ఛార్జి సీఈఓ అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు నిరసన తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ సదరు అధికారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధిలేక అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని వాట్సప్ గ్రూపులో పోస్టు చేయడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. వైకాపాతో అంటకాగిన వారికి ప్రాధాన్య స్థానాలు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ మార్పుచేర్పులు చేస్తున్నట్లు సమాచారం.

రెవెన్యూ శాఖలో ఐదారోజులు సుదీర్ఘ కసరత్తు చేసినా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయలేదు. ఒకే రోజు 120 మందికి బదిలీ ఉత్తర్వు జారీ చేశారు. ఇందులో ఉప తహసీల్దార్లు 73 మంది, సీనియర్ సహాయకులు 33, జూనియర్ సహాయకులు 11, కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురు చొప్పున ఉన్నారు. వీఆర్‌ఓల జాబితాపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. డీటీ, వీఆర్‌ఓ, ఆర్‌ఐ.. తదితర కేడర్ల విషయంలో కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఆయా కేడర్ల బదిలీల్లో మార్పుచేర్పులపై కసరత్తు సాగుతోంది.

డీఆర్‌డీఏ–వెలుగులో బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయి. డీపీఎంలు నలుగురు, ఏపీఎంలు 32 మంది, సీసీలు 60 మందిని బదిలీ చేశారు. ఉద్యోగుల ఆప్షన్లను పరిగణలోకి తీసుకోలేదు. పనితీరు ఆధారంగా చేయలేదు. నచ్చిన వారికి మంచి స్థానాలు, నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన బదిలీలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఇందులోనూ మళ్లీ మార్పుచేర్పులు సాగుతున్నాయి.జిల్లా నీటి యాజమాన్య సంస్థలో(డ్వామా) బదిలీల ఊసేలేదు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ఇక్కడి యంత్రాంగం ఏమాత్రం దృష్టి సారించలేదు. ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప... ఇప్పటికీ సమాచారం బయటకు పొక్కలేదు. ఇక్కడి పీడీ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కొనసాగుతున్నారు. రెగ్యులర్ పీడీ అక్టోబరు 2 తర్వాత వస్తారని భావిస్తున్నారు.

# సర్కారు స్థలంలో రియల్ దందా



అనంతపురం : కబ్జాదారులు ఏకంగా ప్రభుత్వ భూముల్లోనే వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, నోటీసులను ఖాతరు చేయడం లేదు. అధికారులు సైతం అక్రమార్కుల దౌర్జన్యాన్ని చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. జాతీయ రహదారి సమీపంలోని గుత్తి మండలం బాచుపల్లిలో ప్రభుత్వ ఆస్తుల కబ్జాపర్వం సాగుతూనే ఉంది. ప్లాట్లు వేసి సెంటు రూ.5 లక్షలు చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

5 ఎకరాల్లో పాగా..కరిడికొండ రెవెన్యూ పరిధి బాచుపల్లిలో 188, 179 సర్వే నంబర్లలోని సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక నాయకులు ఆక్రమించారు. వైకాపా హయాంలో గ్రామ ప్రజాప్రతినిధి సుమారు 5 ఎకరాలు కబ్జా చేశారు. గతంలో ఓ వ్యక్తికి అసైన్డ్ చేసిన భూమిని సైతం ఆక్రమించి లేఅవుట్ ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పక్కనే ఉన్న అసైన్డ్ భూముల్లో ప్లాట్లు ఏర్పాటు చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో డిమాండ్ ఎక్కువ ఉంది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి విలువ రూ.20 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు 179 సర్వే నంబరులో 1.6 ఎకరాలు కబ్జా చేసి లేఅవుట్ వేశారు. ఇప్పటికే కొన్ని ప్లాట్లను రూ.10 లక్షలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

నోటీసులతో సరిపెట్టి..

ఆక్రమణలపర్వంపై ఈనెల 17న ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు జారీ చేశారు. ఆక్రమణలకు పాల్పడిన గ్రామ ప్రజాప్రతినిధికి కాకుండా ఆయన వెంట ఉన్న కొందరికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. నిబంధనల మేరకు నోటీసులు అందించిన ఏడు రోజుల్లో తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అధికారులు ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. లేఅవుట్‌ను కనీసం తొలగించే ప్రయత్నం చేయలేదు. అధికారులు పాతిన బోర్డును తొలగించి యథేచ్ఛగా ప్లాట్లు విక్రయిస్తుండటం గమనార్హం.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

– ఓబులేసు, తహసీల్దార్, గుత్తి

ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తేల్చాం. ఇప్పటికే బాధ్యులకు నోటీసులు జారీ చేశాం. హెచ్చరిక బోర్డును తొలగించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగిస్తాం.

# నెట్టికంటయ్యా.. బృహత్తర ప్రణాళిక ఏదయ్యా!



గుంతకల్లు : ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కష్టాలు తప్పడం లేదు.బృహత్తర ప్రణాళిక కార్యరూపం దాల్చకపోవడమే ఇందుకు కారణం. ఆలయానికి రోజూ 2 వేల మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఏటా ఆదాయం రూ. 10 కోట్ల వరకు ఉంటోంది. ఆస్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలున్నాయి. పదేళ్ల కిందటే బృహత్తర ప్రణాళికను రూపొందించారు. దీన్ని అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీ సాయంతో రూపొందించింది. సదరు కంపెనీ రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను అందజేసింది. సదరు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేసింది.ఆమోదించి ఉంటే ఈపాటికి పనులు ప్రారంభమయ్యేవని భక్తులు అంటున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం భక్తులకు శాపంగా మారింది.ప్రణాళికలోని అంశాలివిగో..

ఆలయం ముందున్న దుకాణాలు, గదులను తొలగిస్తే భక్తులకు సౌకర్యంగా విడిది కేంద్రాలను నిర్మించడానికి అవకాశం ఉంటుంది.

భక్తులు స్నానాలు చేయడానికి ప్రత్యేక పుష్కరిణి, అధునాతన సౌకర్యాలతో మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణం.

ఆలయ పరిసరాల్లో విశాలమైన రహదారులు, ఉద్యానాలు, గోశాల, అన్నదాన సత్రం, క్యూలైన్లు, శుద్ధజల కేంద్రం, ప్రాకార నిర్మాణం తదితరాలను ప్రణాళికలో పొందుపరిచారు.

అడుగడుగునా ఇబ్బందులే...

ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులు అరగంటకు మించి ఉండటానికి ఎలాంటి సౌకర్యాలు లేవు. గతంలో ఏర్పాటు చేసిన పార్కులు ఉనికి లేకుండా పోయాయి. ప్రస్తుతం ఆ పార్కుల స్థలంలో చెత్త నిల్వ కేంద్రాలుగా మారాయి. ఆలయంలో 60 వసతి గదులను ఐదేళ్ల కిందటే కాలం చెల్లాయని వినియోగించడం లేదు. వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించలేదు. వర్షం వస్తే ఆలయ పరిసరాల్లో నీరు నిలబడుతోంది. ఉత్సవాలను నిర్వహించేందుకు విశాలమైన స్థలం లేకపోవడం భక్తులను బాధిస్తోంది.

త్వరలో ప్రణాళికకు ఆమోదం...

– మల్లికార్జున, సహాయ కార్యనిర్వహణాధికారి

భక్తులకు సౌకర్యాలు కల్పించానికి ఉద్దేశించిన బృహత్తర ప్రణాళికకు త్వరలో ప్రభుత్వ ఆమోదం లభించనుంది. ప్రస్తుతం ప్రణాళికలను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసింది. కసాపురం ఆలయ బృహత్తర ప్రణాళిక త్వరలో కమిటీ ముందుకు రానుంది.


# రెవెన్యూ శాఖలో బదిలీల కసరత్తు

అనకాపల్లి : రెవెన్యూ శాఖలో బదిలీల కసరత్తు ఊపందుకుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో అర్హులైన వారి జాబితాలను యంత్రాంగం సిద్ధం చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వివరాలు కలెక్టరేట్‌కు చేరాయి. ఇంకా అనకాపల్లి జిల్లా నుంచి రావాల్సి ఉంది.

నెలాఖరు వరకు అవకాశం..

జిల్లా పునర్విభజన తర్వాత ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న తొలి బదిలీలు కావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం వంటి పరిణామాల నేపథ్యంలో పలువురు ఉద్యోగులు గిరిజన ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్సీల నుంచి సిఫార్సు లేఖలతో వస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. అల్లూరి, విశాఖ జిల్లాల పరిధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 మంది వరకు తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు బదిలీలకు అర్హులున్నట్లు తేలింది. తహసీల్దార్ల కేటగిరీలో 15 మంది వరకు ఉన్నారు. సీనియర్, జూనియర్ సహాయకులు, వీఆర్వోల జాబితాలు సిద్ధం అయ్యాయి. నెలాఖరు వరకు బదిలీలకు గడువు ఉంది. అధికశాతం విశాఖ వచ్చేందుకు యత్నాలు...

విశాఖ జిల్లాలోని 22 మంది తహసీల్దార్లలో ఇద్దరు పదవీ విరమణ చేశారు. మరో ముగ్గురు విధుల్లో చేరలేదు. ఐదు వరకు ఖాళీలు ఉ



న్నాయి. జిల్లాలోని తహసీల్దార్లలో అధిక శాతం జూనియర్లు ఉన్నారు. పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఎక్కువ మంది మన్యం ప్రాంతంలో పనిచేస్తున్నారు. వారికి బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎన్నికల విధులు ముగించుకొని వచ్చిన పలువురు తహసీల్దార్లకు ఇటీవల కలెక్టర్ వివిధ మండలాలను కేటాయించారు. వీరిలో కొంత మందికి స్థానం చలనం కలిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన కొంత మందికి జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో 46 మండలాలతో పాటు పలు ప్రత్యేక తహసీల్దార్ పోస్టులు ఉన్నాయి. విశాఖ జిల్లాకు వచ్చేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతూ సిఫార్సు లేఖలు తీసుకొస్తున్నారు.

# లోపం ఎక్కడ.. నిర్లక్ష్యం ఎందుకు..?

అనంతపురం : లోపం ఎక్కడుందో చెప్పండి. ఎందుకు మూడు సంవత్సరాలైనా కొన్ని పనులను టెండర్లకే పరిమితం చేశారు. ఎందుకు అంత నిర్లక్ష్యం.. నిధులు దండిగా ఉన్నా వినియోగంలో ఎందుకింత మొద్దు నిద్ర. ఓ వైపు అభివృద్ధి.. మరో వైపు నగరంలో పచ్చదనం, పరిశుభ్రత, కాలుష్యం నివారణ, దుమ్ము, ధూళి లేకుండా ఉండే విధంగా చేపట్టడానికి జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం / నేషనల్ ఎయిర్ ప్రోగ్రామ్/ కింద వచ్చిన నిధులను ఎందుకు వినియోగిం చుకోలేదు..

2020–2024 వరకు రూ.11.4 కోట్లు మంజూరు అయితే కేవలం రూ.3.5 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని నిధులు అందుబాటులో ఉన్నా ఎందుకు వినియోగించుకోలేక పోయారని కలెక్టర్ నిలదీశారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దని, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనులు చేపట్టాలి. లక్ష్యాలను నిర్దేశిస్తున్నా ఆ మేరకు చేయకుంటే కచ్చితంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి సోమవారం ఏ మేరకు ప్రగతి సాధించారో సమీక్ష నిర్వహిస్తానని, ప్రగతి సాధించకుంటే చర్యలు తప్పవంటూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**35 శాతం మేరకే..**

నగరపాలకకు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి రూ.4.48 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటిదాకా మంజూరైన నిధుల్లో కనీసం 75 శాతం వినియోగించి నిధుల వినియోగ ధ్రువపత్రం పొందాల్సి ఉంటుంది. నగరపాలకలో కేవలం 35 శాతం పనులకు మాత్రమే యూసీలు ఉన్నాయి. ఇంకా పలు పనులు వివిధ దశల్లో ఉండటంతో అవి నిర్ణీత గడువులోగా యూసీలు అందజేస్తే కొత్తగా నిధులు



మంజూరు అయ్యే అవకాశం ఉంటుంది.

**ఒక్క చోట పూర్తి కాలేదు..**

కాలుష్యం నివారించి వాహనాలు ఉంచడం కోసం మల్టీలెవల్ పార్కింగ్ విధానం కోసం మూడేళ్ల క్రితం రూ.50 లక్షలతో టెండర్లు పిలిచారు. మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటిదాకా ఒక్కచోట కూడా పూర్తి కాలేదు. ఏర్పాటు కోసం తెచ్చిన పరికరాలు నగరపాలకలో తుప్పు పడుతున్నాయి. కనీసం స్థలం కూడా ఎంపిక చేయలేదు.

చలనం వస్తుందా?

మొత్తం 21 పనులు మంజూరు కాగా 5 మాత్రమే పూర్తయ్యాయి. అశోక్‌నగర్ కలెక్టరేట్‌కు తిరిగే ప్రాంతం నుంచి హరిహర దేవాలయం, హౌసింగ్ బోర్డు వరకు రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణానికి కంకర వేసి వదిలేయడంతో పనుల పూర్తికి గడువు విధించారు.

రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రుద్రంపేట బైపాస్ వరకు రూ.82 లక్షలు నిధులు మంజూరు అయి టెండర్లు పూర్తి అయినా ఇంకా పనులు చేపట్టలేదు.

ఇప్పటిదాకా ఉన్న పనుల దశలను బట్టి వారం రోజులు నెల, వంద రోజులు గడువు నిర్దేశించడంతో ఇకనైనా అధికారుల్లో చలనం వస్తుందని యోచిస్తున్నారు.

# పడకేసిన పర్యాటకం

కైకలూరు : కొల్లేరు సరస్సు వలస పక్షుల కేంద్రం. ఏటా దేశవిదేశాల నుంచి వచ్చే విహంగాలు కైకలూరు మండలం ఆటపాక, దెందులూరు మండలం మాధవపురంలో నివాస స్థావరాలు ఏర్పాటు చేస్తుంటాయి. ఇక్కడ ఆశించిన మేర వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. విశ్రాంతి గదులు, ఒక్కోసారి తాగునీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పక్షులను దగ్గరగా వీక్షించేందుకు బోట్లు సైతం సరిగా లేవు.

సదుపాయాలు కల్పిస్తేనే.. దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం కాటేజీలు నిర్మించాల్సి ఉంది. వలస పక్షుల సంఖ్య పెంచేందుకూ తగిన వసతులు సమకూర్చాలి. ఇక్కడికొచ్చే చిన్నారులు, వృద్ధుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలి. ఇక పిల్లలకు ప్రత్యేక ఉద్యానాలు, అందులో ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలి. సరస్సులోకి వెళ్లి పక్షులను తిలకించేందుకు అదనపు బోట్లు తెప్పించాలి. ఇక్కడి పుణ్య క్షేత్రాల సందర్శనకు అనువుగా బస్సులు నడపాలి. రోడ్లనూ అభివృద్ధి చేయాలి. పర్యాటకులకు సౌకర్యాలు



కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు పర్యాటకంగా కొల్లేరు పరుగులు పెట్టే అవకాశముంది.

సినిమాల చిత్రీకరణకు అనుకూలం.. సినిమాల చిత్రీకరణకూ కొల్లేరు అనుకూలమే. ఇప్పటికే కొల్లేరు పరిసరాల్లో పలు సినిమాలు చిత్రీకరించారు. యువత లఘు చిత్రాల కోసం ఇక్కడికి వస్తున్నారు. 2014-19 మధ్య కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తెదేపా ప్రభుత్వం చొరవ చూపింది. నాటి మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఫెలికాన్ ఫెస్టివల్ పేరిట ఆటపాక పక్షుల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. సినీ అగ్ర కథానాయకుడు వెంకటేశ్, మరికొందరు నటులు, కళాకారులు పాల్గొని సందడి చేశారు. చిత్ర పరిశ్రమకు ఊతమిచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక రాయితీలతో ప్రోత్సహిస్తే పర్యాటక అభివృద్ధి సాధ్యమవుతుంది. ఎన్డీయే అధికారంలోకి రావడంతో కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఇప్పటికే ఆటపాక పక్షుల కేంద్రానికి చేరుకునే రోడ్డు, పెద్దింట్లమ్మ ఆలయం నుంచి కోనేరు వరకు సిమెంటు రహదారులు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. డ్వామా పీడీ రోడ్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

# ఎరువుల కొరతకు కళ్లెం

భీమవరం : వైకాపా ప్రభుత్వం ఆర్బీకేల పేరుతో రైతులను వంచించింది. అన్నదాతల చెంతకే సేవలంటూ గొప్పలు చెప్పడమే తప్పు అయిదేళ్ల పాలనలో ధాన్యం కొనుగోళ్లు, బకాయిల విడుదలకు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. అవసరానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక రైతన్నలు ప్రైవేటు వ్యాపారుల వద్ద చెప్పిన ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి జిల్లా వ్యాప్తంగా పేరుకుపోయిన ధాన్యం బకాయిల విడుదలకు కృషి చేసింది. జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సాగు ఊపందుకోవడంతో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచింది. నీ జిల్లాలో 2.11 లక్షల ఎకరాల ఖరీఫ్ సాగు చేపట్టాల్సి ఉండగా జులై నెలలో కురిసిన వర్షాలకు నారు మడులు దెబ్బతిని సాగు ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.80 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఖరీఫ్ సాగులో ఎరువుల కోసం రైతులు ఎటువంటి



ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. వరి సాగు మొదలైనప్పటి నుంచి డీఏపీ, యూరియా వినియోగం పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నిల్వలు అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్ ఎరువులన్నీ కలిపి 58,905 మెట్రిక్ టన్నులను అందుబాటులో ఉంచారు.

**ఇంకా పెంచుతాం**

'జిల్లా వ్యాప్తంగా డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులకు కొరత లేదు. వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కావాల్సిన మొత్తం అందుబాటులో ఉంచాం. అవసరమైతే ఇంకా నిల్వలు పెంచుతాం' అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్. వెంకటేశ్వరరావు తెలిపారు.

# భక్తులకు గుండు.. జేబులకు గండి

మంత్రాలయం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కౌతాళం మండలం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లలో నీరు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు తాగునీటి సీసాలను రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఆవరణలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కల్యాణకట్టలో తలనీలాలు చేయించుకునే భక్తులు రూ.45 చెల్లించి టికెట్ తీసుకున్నా, గుండుకు అదనంగా రూ.100 వసూలు చేస్తున్నారు. లేవన్నా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. రెండు కొబ్బరికాయలను రూ.70కు విక్రయిస్తున్నారు. ఆలయ ఆవరణలో భక్తుల నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఆలయ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు స్వామివారి దర్శనానికి గంటల సేపు క్యూలైన్లలో బారులు తీరినా కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఆలయ అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా తయారైంది.

సబ్ కలెక్టర్ ఆదేశించినా..

తలనీలాలు సమర్పించుకునేందుకు, కొబ్బరికాయల కొనుగోలులో అక్రమ వసూళ్ల పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ ఆదేశించారు. ఆలయ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు.

# చెత్త సంపద కేంద్రాలకు మోక్షం



గూడూరు : చెత్త సంపద కేంద్రాలపై జగన్ సర్కార్ అక్కసు వెళ్లగక్కింది. వీటిని మూలన పడేసి నామరూపాల్లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో వీటికి మోక్షం తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. గ్రామాల్లో ఏ మూలన చెత్త ఉండరాదని నిర్ణయించి ప్రణాళిక మేరకు చెత్త సేకరణ వేగవంతం చేసింది. ఇలా దశల వారీగా అన్ని గ్రామాల్లో జీరో వేస్ట్ కార్యక్రమం తీసుకొచ్చింది. ఇందుకు చెత్త సంపద కేంద్రాల్లో వసతులు సమకూర్చి వీటిని తిరిగి ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలందాయి. దీంతో ఎక్కడెక్కడ ఏఏ కేంద్రాల్లో వసతులపై ఆరా తీస్తున్నారు. ఈ కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ ప్రాథమిక విధి కాగా 2014-19 తెదేపా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో వ్యర్థాల ద్వారా సంపద సృష్టించే కార్యక్రమాలు అమలు చేసింది. ఉపాధి హామీ నిధులతో ఘన వ్యర్థాల నిర్వహణ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ)లు తెచ్చింది. వీటికి 14వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి చెత్త బుట్టలు, మూడు చక్రాల రిక్షాలు, విద్యుత్తు, నీటి, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించారు. జగన్ పాలనలో ఇవన్నీ మూలన చేరగా మళ్లీ జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**అసంపూర్తిగా తొట్టెలు, షెడ్ల నిర్మాణాలు**

షెడ్లు నిర్మించిన చాలాచోట్ల వర్మి తొట్టెలు, వాచ్‌మెన్ షెడ్డు, నాడెప్ తొట్టెల నిర్మాణాలు పూర్తి చేయలేదు. ప్రతి 250 కుటుంబాలకు ఒకటి చొప్పున మూడు చక్రాల బండి కొని అందజేశారు. వీటి నిర్వహణ లేక చాలాచోట్ల మూలన చేరాయి. గ్రీన్ అంబాసిడర్లకు జీతభత్యాలు ఇవ్వలేకపోవడంతో వారంతా చాలాచోట్ల మానుకున్న దుస్థితి ఉంది. ఉదాహరణకు పెళ్లకూరులో నిర్మించి షెడ్డు దెబ్బతిని మూలన చేరింది. దీనిని పట్టించుకోకపోవడంతో స్థలం కబ్జా అయ్యే పరిస్థితి ఏర్పడింది.

**వసతుల లేమి**

చాలాచోట్ల ఉపాధి హామీ నిధులతో షెడ్లు ఏర్పాటు చేసినా విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించలేదు. ఇందుకు 14వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉన్నా పట్టించుకోలేదు. ఫెన్సింగ్ గేటు ఏర్పాటుకు అనుమతి ఉంది. ఉదాహరణకు నాయుడుపేట మండలం పుదూరు పంచాయతీ షెడ్డులో మందుబాబుల చిందులు దర్శనమిస్తున్నాయి.

ప్రతి షెడ్డు వద్ద మరుగుదొడ్డి వసతి ఏర్పాటు చేసుకుని గ్రామ పంచాయతీ నిధులు వాడుకునే వీలుంది. ఇక్కడే జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఉంది. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి పెళ్లకూరు మండలం తాళ్వాయపాడు పంచాయతీ జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఇలాంటి కేంద్రాలు జీవం లేకుండా నడుస్తున్నాయి.

# కనుమరుగుకు మట్టేశారు.. చెక్‌డ్యామ్‌పై కన్నేశారు



సోమందేపల్లి : స్థానిక మణికంఠ కాలనీలో చర్చి ఎదుట ఉన్న చెక్‌డ్యామ్ నీటితో కళకళ లాడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి పెద్ద వంకపై నిర్మించిన చెక్‌డ్యామ్ నీటితో ఇళ్ల మధ్య ఆకట్టుకొనేలా ఉంది. భూగర్భ జలాల పెంపుదలకు ఎంతో దోహద పడుతోంది. పాడి పశువుల దాహార్తిని తీరుస్తోంది. ఇలాంటి చెక్‌డ్యామ్ అడుగు భాగంలో పెద్ద రంధ్రం పడటంతో అధికంగా నీరు వృథా అవుతున్నాయి. పట్టించుకొనే ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, నాయకులు కరవయ్యారు. ఇదిలా ఉంటే మరికొందరు ఈ చెక్‌డ్యామ్‌ను, వర్షపు నీటి వంకను పూడ్చేందుకు గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తోలుతున్నారు. మట్టిని చదును చేస్తూ చెక్‌డ్యామ్‌ను కనుమరుగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. కియా అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో స్థిర వ్యాపారం పుంజుకొంటుండటంతో రిజిస్ట్రేషన్ స్థలాలతో పాటు ఇక్కడున్న అసైన్డ్ స్థలాల ధరలు రూ.లక్షల్లో పెరిగిపోతున్నాయి. దీంతో అక్కడ పొలాల రైతులు, ఇంటి స్థలాలున్న వారిలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ చెక్‌డ్యామ్ చుట్టూ ఇళ్ల నిర్మాణాలు జోరందుకొన్నాయి. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే ఇక్కడి చెక్‌డ్యామ్‌ను పూడ్చివేసేందుకు ఇటీవల ట్రాక్టర్లలో మట్టి తోలిస్తున్న విషయం మంత్రి ఎస్.సవిత దృష్టికి వెళ్లడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులకు ఆదేశించడంతో కొందరు తమ ప్రయత్నాలు విరమించుకొన్నట్లు సమాచారం.

స్థానిక మణికంఠ కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా కోసం ఈ చెక్‌డ్యామ్ పక్కనే వంకలో కొన్ని నెలల కిందట గ్రామ పంచాయతీ బోరుబావిని తవ్వించగా పుష్కలంగా నీరు లభ్యమైనా నిధులు లేక విద్యుత్తు మోటారు, పైపులైన్ ఏర్పాటు పనులను చేపట్టలేక పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి, మరమ్మతులు చేపట్టడం ద్వారా చెక్‌డ్యామ్‌ను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# యాగంటి రథం ఏడుందో

కర్నూలు : ఐదేళ్ల అరాచక పాలనలో యాగంటి ఉమామహేశ్వరస్వామి సన్నిధానంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేయాలని భక్తజనం కోరుతోంది. నాలుగు దశాబ్దాలుగా సేవలందించిన స్వామివారి రథం ఎన్నికలకు ముందు మాయమైనప్పటికీ అధికారులు మౌనంగా ఉండిపోయారు. రాతి చక్రాలు.. విభిన్న కళాకృతులు.. సుమారు నాలుగు టన్నుల ఇనుముతో తయారుచేసిన సుమారు 12 అడుగుల ఎత్తు ఉండే రథం ఎలా మాయమైందో మిస్టరీగానే మారింది. ఆలయం గర్భగుడి వెనక సహజసిద్ధంగా ఏర్పడిన కోనేటి నీటితో స్వామిని అభిషేకిస్తారు. అందులో కొందరు భక్తులు కాళ్లు కడుగుతున్నా అడ్డుచెప్పేవారు లేకుండాపోయారు. అందులోనే ప్రసాదాల ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పడేశారు. కోనేరును ఎప్పటికప్పుడు శుభ్రంచేయాల్సి ఉండగా పట్టించుకోవలేదు.

**అభిషేకానికి టెట్రాప్యాకెట్ పాలు**

స్వామిని అభిషేకించేందుకు టెట్రా ప్యాకెట్లలోని పాలు వినియోగిస్తుండటం గమనార్హం. ఏకశిలపై ఉన్న స్వామి, అమ్మవారి ప్రతిరూపాలు దెబ్బతిని విగ్రహం ఆనవాళ్లు మసకబారుతున్నాయి. విగ్రహాలకు వెండితొడుగు వేసి అభిషేకించాలని పురావస్తుశాఖ అధికారులు గతంలోనే సూచించినా పాటించడం లేదు.

**పురావస్తుశాఖ ఆదేశాలు బేఖాతర్**

ఆలయ ప్రాంగణం పురావస్తుశాఖ పరిధిలో ఉంది. ఎలాంటి మరమ్మతులు చేయాలన్నా పురావస్తుశాఖ అధికారుల సలహాలు, సూచనలు, అధికారిక అనుమతులు తీసుకోవాలి. వారి పర్యవేక్షణలోనే అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నా నిబంధనల్ని తుంగలోతొక్కేశారు. ఆలయ అభివృద్ధి పేరిట కొండ ప్రాంతాన్ని ఇష్టారాజ్యంగా తవ్వేశారు. దీనిపై పురావస్తుశాఖ అధికారులు ఆలయ అధికారులకు సంవత్సరం కిందటే నోటీసులు జారీ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల జోక్యం వల్ల నివేదికలేవీ బయటకు రాలేదు.

**పోస్టుల భర్తీపై అనుమానాలు**

సార్వత్రిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు అర్చక సహాయకుల పోస్టులను హడావుడిగా భర్తీ చేశారు. ఉన్న మూడింటినీ ఆలయ సిబ్బంది కుటుంబసభ్యులే దక్కించుకున్నారు. ఆ నియామక ప్రక్రియలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలున్నా గత ప్రభుత్వం ఎలాంటి విచారణ జరపకపోవడం గమనార్హం.



**అనధికారిక వసూళ్ల పర్వం**

ఆలయ గర్భగుడికి పక్కనే అనధికార దుకాణాల ద్వారా రుద్రాక్షలు, కడియాలు, రుద్రాక్ష గొలుసులు, రక్షరేకులు విక్రయిస్తున్నారని విమర్శలురావడంతో మూడు రోజుల నుంచి తాత్కాలికంగా ఆపేశారు. ఆలయం వెనక ఆవునెయ్యితో దీపాలు వెలిగిస్తే మంచిదని ఒక్కొక్కరి నుంచి రూ.50 చొప్పున వసూలు చేసి ఆవు నెయ్యి పేరిట కల్తీ నూనె విక్రయించి మోసగిస్తున్నా చర్యల్లేవు.

**ఉద్యోగుల ఇష్టారాజ్యం**

స్వామి ప్రసాదం తయారీకి ప్రత్యేక ఏర్పాట్లు లేదు.. పర్యవేక్షణ చేసేవారూ లేరు. ప్రసాదంలో నాణ్యతతో పాటు రుచి లోపించిందని భక్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలయ ఉద్యోగులు కొందరు బయోమెట్రిక్ హాజరులేకుండానే ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నా చర్యల్లేవు. ఇక్కడి సీసీ కెమెరాలు కూడా పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో అక్రమాలు వెలుగులోకిరావడం లేదు.

# ఇల్లు ఖాళీ

నంద్యాల : వంద రోజుల ప్రణాళిక అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు లక్ష్యాలు విధించింది. జిల్లాలోని 29 మండలాల్లో వచ్చే 50 రోజుల్లో 14,339 గృహాలు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.. పర్యవేక్షణ చేసే గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల్లేక వెలవెల బోతోంది.. జిల్లా కేంద్ర కార్యాలయంలో శాశ్వత ఉద్యోగి ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సిబ్బంది లేకుండా నిర్ణీత సమయంలోగా వేలాది గృహాలను పూర్తి అవుతాయా అన్నది సందేహంగా మారింది. కనీసం గృహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి కంప్యూటర్ నిపుణులు, ఇంజినీరింగ్ సిబ్బంది లేకపోవడం గమనార్హం.

**50 రోజుల్లో 14,399 ఇళ్లు పూర్తయ్యేనా**

జిల్లాలో పీఎంఏవై అర్బన్, రూరల్ కింద వేలాది గృహాలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరు, నిర్మాణాలను పూర్తిచేసే బాధ్యత రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలోని జిల్లా హౌసింగ్ అధికారి కార్యాలయానిదే. అక్కడ ఉ



ద్యోగులెవరూ లేకపోవడం నిర్మాణాలకు ఆటంకం తలెత్తనుంది. గత ఐదేళ్ల పాలనలో జగనన్న కాలనీల్లో పెద్దఎత్తున ఇళ్లు నిర్మిస్తున్నట్లు గొప్పలు చెప్పుకొన్న జగన్ సర్కారు.. ఇందులో కీలకపాత్ర పోషించే పీడీ కార్యాలయంలో సిబ్బందిని నియమించకుండా నిర్లక్ష్యం చేయడం జిల్లాలో గృహ నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**ఒకే అధికారికి నాలుగు పోస్టులు**

జిల్లా హౌసింగ్ కార్యాలయంలో జిల్లాహౌసింగ్ హెడ్ (పీడీగా పిలుస్తున్నారు) పోస్టు ఖాళీగా ఉంది. జిల్లా కోఆపరేటివ్ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇప్పటికే జిల్లా సహకార నిఘా అధికారిగా, డివిజన్ కో-ఆపరేటివ్ అధికారిగా మూడు పోస్టుల్లో కొనసాగుతున్నారు. పీడీ బాధ్యతలు కూడా అప్పగించడంతో ఒకే అధికారి నాలుగు పోస్టుల్లో కొనసాగుతున్నారు. ఒక డీఈ తప్ప పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. గత ఐదేళ్లలో ఈఈతో పాటు ముగ్గురు డీఈలు, మేనేజరు, ఇతర సిబ్బంది వరుసగా ఉద్యోగ విరమణ చేసినా ఈ స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఇతర ప్రాంతాల నుంచీ ఎవరినీ తీసుకురాలేదు. " ఖాళీలను భర్తీ చేయమని హౌసింగ్ ఎండీకి నివేదిక పంపించాం.. కార్యాలయం నిర్వహణకు ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని" పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

# దిగువకు నీరు.. ఎత్తిపోయని తీరు

కర్నూలు : పశ్చిమ పల్లెల్లో కరవు సమస్య పరిష్కారానికి గురు రాఘవేంద్ర ప్రాజెక్టును నిర్మించినప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతుల కంట కన్నీరు కారుతోంది. కర్నూలు పశ్చిమ ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రూ.177 కోట్లతో గురు రాఘవేంద్ర ప్రాజెక్టును నిర్మించారు. తుంగభద్ర నదిలోని 5.373 టీఎంసీల వరద జలాలను ఎత్తిపోసి 45,790 ఎకరాలకు సాగునీరివ్వాలనే లక్ష్యంతో దీనికి రూపకల్పన చేశారు. కోసిగి, మంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, కోడుమూరు, సి.బెళగల్, కల్లూరు, గూడూరు మండలాల పరిధిలోని ఎల్లెల్సీ ఆయకట్టుకు సాగునీటిని సరఫరా చేసేందుకు ఈ జలాశయాన్ని నిర్మించారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలో 11 ఎత్తిపోతల పథకాలు మూగలదొడ్డి, పూలచింత, చిలకలడొణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, చింతమాన్‌పల్లె, దుద్ది, మాధవరం, బసలదొడ్డి నిర్మించారు. నదిలో వృథాగా పోతున్న వరద జలాన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా తోడి ఆయకట్టుకు పారించాలి. కానీ ఈ ఏడాది నీరు తోడేందుకు వీలు కలగలేదు. ఎత్తిపోతలకు మరమ్మతులు చేయకపోవడంతోపాటు నియంత్రికల చోరీ వల్ల నదిలో నీళ్లు పారుతాయనుకునే రైతులకు కన్నీరే మిగిలింది.

**నీటి నిల్వకు నిధులివ్వని జగన్**

కర్ణాటక రాష్ట్రం హొసపేట్‌లోని తుంగభద్ర జలాశయం జూన్ 24న 101 టీఎంసీలతో నిండిపోగా, మొదటి రోజే 50 వేల క్యూసెక్కులను, పది రోజుల నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువకు నీరు వస్తున్నప్పటికీ ఎత్తిపోతల పథకాల్లో నీటి జాడ లేకపోవడం గమనార్హం. దాదాపు 95 టీఎంసీలు శ్రీశైలం ప్రాజెక్టులో కలిసిపోయాయి. పంపుహౌస్‌లకు మరమ్మతులు, విద్యుత్తు, గ్రీజుకు నిధులు దాదాపు రూ.120 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో ఎత్తిపోతల పథకాలేవీ సక్రమంగా సేవలందించక లేకపోతున్నాయి. సుమారు 22 వేల మంది రైతులు ఏటా ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నారు.

ఏటా పంట నష్టంతిక్కన్న, మాచాపురం

నాకు చిలకలడోణ ఎత్తిపోతల పథకం కింద 5 ఎకరాల పొలం ఉంది. ఐదేళ్లలో పంట చేతికొచ్చే సమయానికి సాగునీరు పారక ఏటా నష్టపోతున్నాం. పంప్‌హౌస్‌లో నీటిని సరిగా ఎత్తిపోయకపోవడంతో ఐదేళ్లలో సుమారు రూ.10 లక్షలపైగా నష్టం వాటిల్లింది.

నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి

జయన్న, నందవరం

నాకు 3 ఎకరాల పొలం ఉంది. మొదట్లో ఒక తడికి నీళ్లు ఇస్తారు. నెల రోజుల తర్వాత ఇవ్వరు. ఐదేళ్లలో మిరప, పత్తి సాగు చేశా. రెండేళ్లలో రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాను. మూడేళ్లలో పత్తి సాగుకు రూ.3.50 లక్షల ఖర్చు చేశా. సరైన సమయానికి నీళ్లందకపోవడంతో దిగుబడి అంతా పెట్టుబడికే సరిపోయింది.

దొంగలు ఎత్తుకుపోయారు

పంప్‌హౌస్‌ల వద్ద మోటార్లు, విద్యుత్తు నియంత్రికలు, ఇతర పరికరాలు ఉన్నా కనీసం కాపలాదారుడ్ని నియమించకపోవడంతో రూ.లక్షలు విలువ చేసే పరికరాలు దొంగలపాలయ్యాయి. దీంతో బసలదొడ్డి, మాధవరం, చిలకలడోణ, పూలచింత, సోగనూరుల ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. " ప్రాజెక్టుల పరిధిలో అన్ని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు" ఈఈ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నిఘానేత్రం
తెలుగు దినపత్రిక



# ఇంధన ఉత్పత్తి ఉరకలెత్తేలా..

సింధియా : విశాఖలోని హెచ్‌పీసీఎల్ (హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) విస్తరణ పనులు దాదాపు పూర్తవడంతో... ఆయా విభాగాల్లో ట్రయల్‌రన్ ప్రక్రియ కొలిక్కొ వస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి, నాణ్యమైన ఇంధన ఉత్పత్తులు సాధించేలా సిద్ధం చేసిన కర్మాగారాన్ని త్వరలో జాతికి అంకితం చేయనున్నారు. భారత దేశ తూర్పు తీరంలోని విశాఖ ఒడ్డున తొలి ఇంధన కర్మాగారం ఏర్పాటైంది. 1950వ దశకంలో మల్కాపురం పూర్వపు గ్రామం వాల్కంపేట చవుడు భూముల్లో 'కాల్‌టెక్స్' కంపెనీకి అంకురార్పణ జరిగింది. భూసేకరణ, పునరావాస గ్రామం ఏర్పాటు వంటి పనుల చకచకా పూర్తవడంతో 1957లోనే ఇంధన ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది భారత ప్రభుత్వం.

తొలి రోజుల్లో ఇలా..: సింధియాకు కూతవేటు దూరంలోనే 'కాల్‌టెక్స్ ఆయిల్ రిఫైనింగ్ ఇండియా లిమిటెడ్' (సీవోఆర్‌ఐఎల్)ను స్థాపించారు. తొలి రోజుల్లో కాల్‌టెక్స్ నుంచి ముడిచమురు శుద్ధి 0.675 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పతి జరుగుతుండేది.

1978లో సంస్థను 'హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్–



హెచ్‌పీసీఎల్'లో విలీనం చేశారు. అప్పటి నుంచి దశల వారీగా విశాఖ్ రిఫైనరీలో క్రూడ్ డిస్టిలేషన్ (సీడీయూ) యూనిట్లను, ఫ్లూయిడైజ్డ్ క్యాటలిటిక్ యూనిట్(ఎఫ్‌సీయూ)ను విస్తరించి... 1985లో 4.5 ఎంఎంటీపీఏ స్థాయికి తీసుకొచ్చారు. 1987లో క్యాప్టివ్ పవర్‌ప్లాంట్ కమిషనింగ్, 1994లో కర్బన ఉద్గారాలు తగ్గించేలా సాంకేతిక పరిజ్ఞానం జోడించడం ప్రారంభించారు.

అయితే 1997 సెప్టెంబరు 14న దేశ రిఫైనరీల చరిత్రలోనే అత్యంత భారీ విస్ఫోటన ఘటనతో గుణపాఠం నేర్చిన హెచ్‌పీసీఎల్ యాజమాన్యం అంతర్జాతీయ భద్రతా ప్రమాణాల అమలుకు శ్రీకారం చుట్టింది. సామర్థ్యం పెంచేలా.. విశాఖ్ రిఫైనరీలో ఉత్పత్తి సామర్థ్యం భారీగా పెంచేందుకు 2015లో భారత ప్రభుత్వం అంచనాలు రూపొందించి... ప్రణాళికలు అమలు చేసింది. అప్పట్లోనే ఏకంగా రూ.25 వేల కోట్ల వరకు నిధులు వెచ్చించి... ఇంధన ఉత్పత్తిని 8.3 నుంచి 15 ఎంఎంటీపీఏ వరకు సాగించేలా 'విశాఖ్ రిఫైనరీ మోడ్రన్ ప్రాజెక్టు లిమిటెడ్–వీఆర్ఎంపీఎల్' పేరిట విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆయా పనులన్నీ పూర్తవడంతో, త్వరలో జాతికి అంకితం చేయనున్నారు.

# ఇక మార్కెట్ యార్డులు కళకళ

అనకాపల్లి : మార్కెట్ యార్డులను గాడిలో పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను దళారుల బారినపడకుండా కాపాడేందుకు ఇవి ఉపయోగపడతాయి. మెరుగైన ధరతో పాటు తూకంలో మోసాలు జరగకుండా మార్కెట్ కమిటీ అధికారులు పర్యవేక్షిస్తారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరంల్లో, అల్లూరి జిల్లాలో పాడేరు, డుంబ్రిగుడ, చింతపల్లిల్లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటికి విలువైన స్థలాలు ఉన్నాయి. చాలా వరకు ఉపయోగంలో లేవు. వైకాపా ప్రభుత్వం అన్ని కమిటీలనూ నియమించినా యార్డుల అభివృద్ధిని పట్టించుకోలేదు.

**రైతు ఉత్పత్తిదారులతో..**

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఎక్కువగా పండే పంటలను ఉత్పత్తి చేసే రైతులంతా కలిసి సంఘాలుగా ఏర్పడుతున్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి. జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ. వీరు పండించే ఉత్పత్తులను కల్లాల్లోనే దళారులకు అమ్ముకుంటున్నారు. వ్యాపారి చెప్పిన ధరకే అమ్మాల్సి వస్తోంది. వీరు తూకంలో ఎక్కువగా మోసాలు చేస్తున్నారు. అందుకే రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా యార్డులో వ్యాపారాలు నిర్వహించాలని మార్కెట్ కమిటీ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ సంఘాలు ఉన్నాయి?, ఆయా సంఘాలు ఏఏ వ్యవసాయ ఉత్పత్తులు సేకరిస్తున్నాయనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

**స్థలాలున్నా సమస్యే**

అనకాపల్లి యార్డును 33 ఎకరాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడ వ్యాపారాల నిర్వహణకు అనువుగా 18 ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. మూడు ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం బెల్లం వ్యాపారమే సాగుతోంది. తుమ్మపాలలో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘంలో 900పైగా సభ్యులు ఉన్నారు. వీరి ద్వారా చిరుధాన్యాల అమ్మకాలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

మాడుగులలో ఎకరా స్థలం సేకరించారు. ఇక్కడ కార్యాలయం, ప్లాట్‌ఫారాల నిర్మాణాలకు మార్కెట్ కమిటీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చోడవరంలో 11 ఎకరాల స్థలం ఉంది. భవనాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో వరి అధికంగా పండుతుంది. అక్కడ ధాన్యం అమ్మకాలు చేపట్టే విధంగా చూస్తున్నారు. ఇక్కడ పశువుల వ్యాపారం ఎక్కువగా సాగుతుంది.

నర్సీపట్నంలో 12 ఎకరాల స్థలం, ఇందులో వాణిజ్య సముదాయం ఉన్నాయి. భారీగా స్థలం ఉన్నా పెద్దగా వ్యాపారం సాగటం లేదు. పాయకరావుపేటలో పశువుల వ్యాపారం సాగుతోంది. దీనికి తోడు అరటి వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించారు.

ఎలమంచిలిలో యార్డు లేని కారణంగా స్థల సేకరణకు ప్రయత్నాలు ప్రారంభించారు. పాడితో పాటు గొర్రెలు, మేకలు అమ్మకాలు ఎక్కువగా చేస్తుంటారు. వీటి అమ్మకాలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. వీటిపై మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రవికిరణ్‌ను వివరణ కోరగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో మాట్లాడి అన్ని మార్కెట్ యార్డులను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

# రంగు చూసి.. మోసపోవద్దు గురూ!



అనంతపురం : అనంతపురం నగరంతోపాటు, ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులపై హోటళ్ల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. కొందరు హోటళ్ల నిర్వాహకులు వినియోగదారులను ఆకర్షించడానికి వంటల్లో మోతాదుకు మించి రంగులు వినియోగిస్తున్నారు. చికెన్, మటన్ బిర్యానీ తయారీలో ఉడికీ ఉడకని, శీతలపెట్టెల్లో నిల్వ చేసిన మాంసాన్ని వండి వారుస్తున్నారు. నాణ్యత లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి వాటికి మోతాదుకు మించి రంగులు వాడుతున్నారు. రాగి ముద్ద, ఉలవచారు వినియోగం ఇటీవల బాగా పుంజుకుంది. కొందరు ఉలవచారు పొట్లాలను విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి చాలా కాలం పాటు నిల్వ చేస్తూ వినియోగదారులకు వడ్డించడం వంటివి తనిఖీల్లో వెలుగు చూశాయి.

**నిబంధనల్ని తుంగలోకి తొక్కి..**

వినియోగదారులు అడిగినప్పుడు పొట్లంలోని ఉలవచారును కాగబెట్టి విక్రయిస్తున్నారు. ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాల అమలు శాఖ అధికారులు ఇటీవల నగరంలోనూ, జాతీయ రహదారిలోని కొన్ని హోటళ్లలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో చికెన్, మటన్ బిర్యానీ వంటల్లో మోతాదుకు మించి రంగులు కలుపుతున్న తీరు వెలుగు చూసింది. నిబంధన మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) ఫుడ్ సేఫ్టీ, అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగిన (ఫుడ్ కలర్స్) రంగులు మాత్రమే వాడాలి. అది కూడా మోతాదుకు మించి వాడకూడదు. ఇదీ నిబంధన. ఇవేమీ పట్టకుండా ఇష్టారాజ్యంగా రంగులు కలిపేస్తున్న తీరు వెలుగు చూసింది.

బిర్యానీ జోన్ హోటల్, సూరి హోటళ్లలో.. చికెన్ దమ్ బిర్యానీకి అధిక మోతాదులో రంగు వినియోగిస్తున్నట్లు తేలింది. బిర్యానీ మందిర్ హోటల్‌లో చికెన్ లాలీపాప్‌లకు అధిక రంగు వాడినట్లు గుర్తించారు.

తదుపరి విచారణకు పంపాం

– కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలరు

హోటళ్ల యజమానులు రంగులు కలుపుతున్న తీరు గుర్తించి కేసులు నమోదు చేశాం. వీటిపై విచారణకు జిల్లా సంయుక్త కలెక్టరుకు పంపించాం. కళ్యాణదుర్గంలో నాసిరకం కందిపప్పు ఆకర్షణీయంగా కనిపించేలా మోతాదుకు మించి రంగు కలిపి విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశాం.. అనంత నగరంలో ఐస్‌క్రీంలపై, డ్రైఫ్రూట్స్ తయారీలో మోతాదుకు మించి రంగు వినియోగిస్తున్న తయారుదారుడిపై కేసు నమోదు చేశాం. ప్రాణహాని కలిగించే సరకులను విక్రయిస్తున్న వ్యాపారులు 5 మందిపై కేసులు పెట్టి విచారణకు జిల్లా కోర్టుకు పంపించాం.

# సొంత గూడున్నా.. బాడుగ భారం తప్పదే!



అనకాపల్లి : తాంబూలం ఇచ్చేశాం తన్నుకు చావండి అన్న చందంగా తయారైంది జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. కళ్ల ముందే సొంత గూడు కనిపిస్తున్నా అందులో నివాసం ఉండలేక అద్దె కొంపల్లోనే తలదాచుకునే దుస్థితి వారిది. తాగునీరు, మరుగునీటి పారుదల, కరెంటు, అంతర్గత రోడ్లు సదుపాయాలు కల్పించకుండా ఎన్నికల ముంగిట సామూహిక గృహప్రవేశాలు చేయించేశారు. అనకాపల్లి జిల్లాలో 22 వేలకు పైగా ఇళ్లు పూర్తయినట్లు గృహనిర్మాణ సంస్థ గణాంకాలు చెబుతున్నా అందులో రెండు వేల ఇళ్లలో కూడా ఎవరూ నివాసం ఉండకపోవడం గమనార్హం. కాగితాల్లో ఇళ్ల నిర్మాణం కనిపిస్తున్నా.. అందులో నివాసం ఉండే భాగ్యం కలగడం లేదని లబ్ధిదారులంటున్నారు.

గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పథకంలో ఊళ్లకు దూరంగా కొండలు, గుట్టలను ఆనుకుని ఇళ్ల స్థలాలను ఇచ్చింది. అనకాపల్లి జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ పథకాల కింద 70,021 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో 34,333 మందికి 681 లేఅవుట్లలో స్థలాలు ఇచ్చారు. ఆయా లేఅవుట్లలో సరైన రోడ్లు నిర్మించలేదు. అనువుగాని చోట ఇళ్లు ఇవ్వడంతో నిర్మాణాలకు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం పడితే కొన్ని కాలనీలు చెరువును తలపించేలా ఉన్నాయి. ఇళ్లు పూర్తయిన చోట మౌలిక సదుపాయాలు లేక నివాసం ఉండడానికి ఆసక్తి చూపడం లేదు. ఇళ్ల నిర్మాణాలు చేయాల్సిన వారు నిర్మాణ సామగ్రిని తరలించడానికి ఆపసోపాలు పడాల్సివస్తోంది. కాలనీల్లో వేసిన బోర్లు మొరాయిస్తున్నాయి.

నక్కపల్లి మండలం జానకయ్యపేట సమీపంలో ఉపమాకకు సంబంధించి ఇచ్చిన కాలనీ బాగా లోతట్టు ప్రాంతం. భారీ వర్షం కురిస్తే ఇళ్లన్నీ వరదనీటిలో చిక్కుకుని స్థానికులు బయటకు రాలేని పరిస్థితి. గతేడాది తుపాను సమయంలో నడుములోతు నీళ్లలో ఈదుతూ వీరంతా నరకం చూశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లచుట్టూ నీరు నిలిచిపోయింది. తాగునీటి సదుపాయం లేక స్థానికులు రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు.

బుచ్చెయ్యపేట మండలం పోలేపల్లి లేఅవుట్‌లో కొంతమంది అక్కడే నివాసం ఉంటున్నారు. రోడ్లు, కాలువులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ అంతటికి కలిపి ఉన్న ఒకే బోరు నుంచి అందరూ నీటిని వాడుకోవాల్సి వస్తోంది.

**కాలనీల కష్టాలివిగో..**

నర్సీపట్నం పురపాలికలోని బయ్యపురెడ్డిపాలెం జగనన్న కాలనీలో 508 మందికి ఇళ్లను కేటాయించారు. ఇళ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలామంది నివాసం ఉండలేక తాళాలు వేసి వదిలేశారు. వాటిచుట్టూ తుప్పలు పెరుగుతున్నాయి. వర్షం వస్తే గోతుల్లో నుంచి వెళ్లాల్సివస్తోంది. అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదు. రక్షిత తాగునీటి ట్యాంకు లేదు.

రోలుగుంట మండలం కొండపాలెం గ్రామానికి 57 గృహాలు మంజూరు చేయగా 40 మంది గృహప్రవేశాలు చేశారు. తాగునీటి సదుపాయం, రహదారులు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదు. రెండేళ్ల నుంచి అవస్థలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

నీటికోసం నాలుగు కి.మీ..

– కొర్రా శేషు, మంగ దంపతులు, ఉపమాక కాలనీ

కాలనీ కట్టి రెండేళ్లు అయినా తాగునీరు లేదు. రోజూ నాలుగు కి.మీ. వెళ్లి తెచ్చుకుంటున్నాం. వర్షం వచ్చిందంటే వెన్నులో వణుకు పుడుతోంది. రోడ్లు, డ్రైన్లు లేవు. మమ్మల్ని పట్టించుకున్న వారే లేరు.

రోడ్లు.. మురుగుకాలువలు లేవు..


–పెద్దాడ లోవరాజు, బలిఘట్టం

బయ్యపురెడ్డిపాలెం కాలనీలో నీళ్లకోసం ఇబ్బంది పడుతున్నాం. క్యాన్‌లు పట్టుకుని బలిఘట్టం వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఇళ్లయితే ఇచ్చారు గానీ రోడ్లు నిర్మించలేదు. కశిమి రోడ్డు నుంచి కాలనీ వరకు కంకర రోడ్డు వేశారు. అదీ పాడైపోయింది. డ్రెయినేజీ సదుపాయం లేదు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం–శ్రీనివాసరావు, పీడీ, గృహనిర్మాణ సంస్థనిర్మాణాలు పూర్తయిన చోట పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో మౌలిక సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష జరిగింది. ఇకపై అసంపూర్తి పనులన్నింటినీ పట్టాలెక్కిస్తాం.

# దేవుని మాన్యానికి ఎసరు?

నాయుడుపేట : మండలంలో ప్రధాన ఆలయాలకు చెందిన మాన్యం భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో తారుమారవడం విమర్శలకు తావిస్తోంది. విన్నమాల గ్రామ రెవెన్యూలో శ్రీకాళహస్తీ జ్ఞానప్రసూనాంబ, వేణుగోపాలస్వామి ఆలయాలకు 28 ఎకరాలు, నాయుడుపేటలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి 37 ఎకరాల మాన్యం భూములున్నాయి. దేవాదాయశాఖ వీటిని ఏటా రైతులకు కౌలుకు ఇస్తోంది. గతంలో కొంత విస్తీర్ణం ఇతరులు ఆక్రమించుకోవడంతో ధర్మకర్తలు మండలి సభ్యులు కోర్టును ఆశ్రయించి తిరిగి స్వాధీనం చేసుకున్న ఘటనలున్నాయి. వైకాపా పాలనలో ఈ భూములకు సకాలంలో కౌలు వేలం నిర్వహించకపోవడంతో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. శ్రీకాళహస్తీశ్వరస్వామి, కాశీవిశ్వేరునికి చెందిన భూములన్నీ రెవెన్యూ పరిధిలో నాయుడుపేటకు దగ్గరలోనే ఉన్నాయి. ఇక్కడ ఎకరం భూమి రూ.50 లక్షల వరకు ధర పలుకుతుండడంతో కొందరు ఆలయ మాన్యాలు తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు వేలం అడ్డుకోవడం, కోర్టును ఆశ్రయించి స్టేలు తేవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మొదటి నుంచి విన్నమాల పరిధిలో ఆలయాల



భూముల వేలం అంతా వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారు స్థానంలో దేవుని పేరు లేకపోవడం, ఇతరుల పేర్లు కనిపించడం, సర్వేనంబరు విస్తీర్ణంలో తేడాలు ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ భూములు సర్వేచేసి రికార్డులు పక్కాగా ఇవ్వాలంటూ దేవాదాయశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన కరవైంది.

# అటు వెళ్లాలంటే.. ఆరు ట్రాకులు దాటాల్సిందే..!

కరాస: ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారంతా నిత్యం వివిధ పనుల నిమిత్తం నగరంలోకి రావాలంటే... ఆరు రైల్వే ట్రాకులు దాటాల్సిందే. ఇంతలో ఎటు నుంచి ఏ రైలు వస్తుందో తెలియని పరిస్థితి. గతంలో జరిగిన రైలు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయాలతో బయటపడ్డారు. కొన్నేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విశాఖ పశ్చిమం పరిధి కంచరపాలెంమెట్టు, ఆర్పీపేట సమీపంలో జీవీఎంసీ 56వ వార్డుకు చెందిన దయానందనగర్ (చాకలిగెడ్డ), ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ, రాజీవ్‌కాలనీలు రైల్వే ట్రాకులకు అటువైపున ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రోజంతా పోర్టు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్దఎత్తున దుమ్ము, ధూళి గాలిలోకి రేగడంతో ప్రజలు ఆ దారిలో ప్రయాణించాలంటే.. హడలెత్తిపోతుంటారు. దీంతో వారంతా ఆర్పీపేట వైపు వచ్చేందుకు కాస్త దగ్గరగా ఉంటుందని.. రైలు పట్టాల మీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. గతంలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో పలు ప్రమాదాలు జరగడంతో... ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ఎమ్మెల్యే గణబాబుకు విన్నవించారు

ప్రతిపాదించినా.. ఫలితం లేదు: గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు అండర్‌పాత్ వే, లేక పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇదే అంశంపై ఎమ్మెల్యే గణబాబు పలుమార్లు రైల్వే డీఆర్ఎం, జీవీఎంసీ ఉన్నతాధికారులతో చర్చించి, క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశారు.




ఆర్పీపేట– దయానందనగర్ మధ్యలో ఉన్న రైలు పట్టాల కింద వరుసగా ఏడు కల్వర్టులతో ఉన్న భారీ గెడ్డలోంచి మురుగు నీరు ప్రవహిస్తుంటుంది. ఆ కల్వర్టుల్లో ఓ మార్గాన్ని ప్రజల రాకపోకలకు వీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఎన్నికలు జరిగి.. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయా ప్రతిపాదనలు మరుగున పడ్డాయి. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్గం ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి..!:** విశాఖపట్నం ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి న్యూ కోచ్ కేర్ కేంద్రం, ఎలక్ట్రికల్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్‌కు నిర్మించిన పట్టాలపై నిత్యం వాషింగ్ పనులకు, ఇతర మరమ్మతులకు అనేక రైళ్లు ప్రయాణిస్తుంటాయి. కొన్నిసార్లు సిగ్నల్ సమస్య ఉంటే... గంటల తరబడి రైళ్లు పట్టాలపైనే నిలిచిపోతుంటాయి. ఆ సమయంలో కొంతమంది ప్రజలు రైళ్ల కింద నుంచి దూరి అటువైపు వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. ఒక్కోసారి రైళ్లు ముందుకు కదలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్నిసార్లు రైళ్ల రాకపోకల్ని గమనించక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యపై గతంలోనే ఎమ్మెల్యే గణబాబు దృష్టి సారించి, మార్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టగా... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నాయకులు రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయని 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హయాంలో.. ప్రజల సమస్య పరిష్కరించేలా, మార్గం ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# మలి వయస్సులో.. మరింత వేదన!

విశాఖపట్నం : బిడ్డలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు ఎంతగానో శ్రమించిన వృద్ధులు జీవిత చరమాంకంలో ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్నారు. కన్నబిడ్డలు వారిని సరిగా పట్టించుకోవడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురు వయోధికుల్లో ఒకరు శారీరక, మానసిక, లైంగిక, ఆర్థికపరమైన వేధింపులకు గురవుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కన్నబిడ్డలు, సమీప బంధువులే వృద్ధులపై అధికంగా దాడులు, దూషణలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన శూన్యం: దేశంలో వృద్ధుల సంక్షేమం, భద్రతలకు సరైన ప్రాధాన్యత లేదనే విమర్శలున్నాయి. కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసం కొన్ని పథకాలు అమలు చేస్తోంది. సరైన అవగాహన లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేని పరిస్థితి. ప్రభుత్వం సామాజిక పింఛన్లు అందిస్తున్నా అర్హులైన చాలా మందికి అందడంలేదనే విమర్శలు



న్నాయి. జిల్లాలో వయోవృద్ధులు దాదాపు 4 లక్షల మంది వరకు ఉన్నారు. చేసేందుకు పని లభించక వారు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. యుక్తవయసులో అన్ని పన్నులు చెల్లించినా.. వృద్ధాప్యంలో ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదని వారంతా వాపోతున్నారు. సాధారణ వృద్ధులను పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంటరితనాన్ని దూరం చేసేందుకు: మలి వయస్సులో పిల్లలు దగ్గర లేకపోవడంతో తల్లిదండ్రులు మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురవుతున్నారు. విశాఖలోని స్నేహ సంధ్య వయోవృద్ధుల సంక్షేమ సంఘం 20 ఏళ్లుగా వృద్ధుల కోసం పనిచేస్తోంది. అందులో 60 నుంచి 90 ఏళ్ల వయసు గల వృద్ధులు 200 మంది వరకు ఉన్నారు. అక్కడ వారి ఒంటరితనాన్ని దూరం చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'వయోవృద్ధులకు ప్రభుత్వం తరఫున సరైన సౌకర్యాలు లేవు. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో వృద్ధులకు అందరూ తోడుగా ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మా అసోసియేషన్‌లో 180 మంది వృద్ధుల పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. వారంతా పిల్లలకు దూరంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వృద్ధులపై దృష్టి సారించాలి' అని ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పి.వేణుగోపాల కృష్ణమూర్తి పేర్కొన్నారు. రాయితీకి దూరం: కొవిడ్ విజృంభణ నేపథ్యంలో వయోవృద్ధులకు ఇచ్చే 50 శాతం రాయితీని 2020 మార్చిలో భారతీయ రైల్వే నిలిపివేసింది. వారి నుంచి పూర్తిస్థాయి ఛార్జీలను వసూలు చేస్తోంది. వాల్తేరు డివిజన్ పరిధిలో రాకపోకలు సాగించే మొత్తం ప్రయాణికుల్లో 10 శాతం మంది వయోవృద్ధులే. రోజుకు అన్ని రైళ్లలో సగటున 861 మంది వృద్ధులు ప్రయాణిస్తున్నారు. వారంతా రాయితీకి దూరమయ్యారు. ఆరోగ్య బీమా ఎక్కువే..ఏడాదికి రూ.5 లక్షల హామీ గల ఆరోగ్య బీమా తీసుకోవాలంటే 30 ఏళ్ల వ్యక్తి కనీసం రూ.10 వేలు చెల్లించాలి. అదే 60 ఏళ్లు దాటిన వ్యక్తికి దాదాపు రూ.30 వేలకు పైగా చెల్లించాలి. ఇటీవల ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా మే నెలలో చేసిన మార్పుల మేరకు మొదటిసారిగా 70 ఏళ్లు దాటిన వ్యక్తి బీమా తీసుకునేందుకు వీలు కల్పించారు. అందులోనూ ప్రీమియం ఖర్చు చాలా ఎక్కువ.




# మెరిసే అందంతో ఇస్మార్ట్ పాప హొయలు

ప్రస్తుతం తెలుగు హీరోయిన్స్ లలో బాగా ట్రెండ్ అవుతున్న వారిలో కావ్య థాపర్ ఒకరు. ఈ బ్యూటీ రీసెంట్ గా 'డబుల్ ఇస్మార్ట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. మూవీ డిజాస్టర్ అయినప్పటికీ కావ్య థాపర్ గ్లామర్ కి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఈ సినిమాకి ముందు కావ్య థాపర్ చేసిన మూవీస్ ఏవీ కూడా గ్లామర్ టచ్ ఉన్నవి కాదు. మొదటిసారి ఘాటైన గ్లామర్ ను పూరి జగన్నాథ్ తెరపై అద్భుతంగా ఆవిష్కరించాడు. పాటలతో ప్రేక్షకులకి కావ్య థాపర్ గ్లామర్ ఫీస్ట్ ఇచ్చింది. దీంతో తెలుగులో మంచి కమర్షియల్ హీరోయిన్ అయ్యే టాలెంట్ ఈ బ్యూటీకి ఉందనే మాట బలంగా వినిపిస్తోంది. గోపీచంద్ కి జోడీగా శ్రీనువైట్ల దర్శకత్వంలో కావ్య థాపర్ నటించిన



'విశ్వం' మూవీ త్వరలో థియేటర్స్ లోకి రానుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, సాంగ్స్ లలో కావ్య థాపర్ గ్లామర్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. ఈ సినిమా కమర్షియల్ గా హిట్ అయితే కచ్చితంగా అమ్మడు తెలుగులో వరుస ఆఫర్స్ అందుకోవడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. అందం, అభినయం ఉన్న కూడా కమర్షియల్ స్టార్ హీరోయిన్ గా ఎదగాలంటే కచ్చితంగా లక్ ఫ్యాక్టర్ కలిసి రావాలని అంటారు. కావ్య థాపర్ కి అదొక్కటే తక్కువైంది. 'ఈ మాయ పేరేమిటో' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కావ్య థాపర్ సంతోష్ శోభన్ 'ఏక్ మినీ కథ'తో సక్సెస్ అందుకుంది. ఈ ఏడాది రవితేజకి జోడీగా 'ఈగల్' మూవీలో కావ్య థాపర్ నటించింది. ఆ సినిమా సక్సెస్ కాలేదు. 'డబుల్ ఇస్మార్ట్' కూడా డిజాస్టర్ అయ్యింది. ఇప్పుడు ఈ బ్యూటీ హోప్స్ అన్ని 'విశ్వం' పైనే ఉన్నాయి. ఇదిలా ఉంటే కావ్య థాపర్ కి ఇన్ స్టాగ్రామ్ లో అదిరే ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు ఇన్ స్టా లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ అప్డేట్స్ తో పాటు గ్లామర్ ఫోటోషూట్ లు కూడా షేర్ చేస్తుంది. రీసెంట్ గా జరిగిన సైమా అవార్డ్స్ 2024లో కావ్య థాపర్ పాల్గొంది. ఇందులో అదిరిపోయే వెస్ట్రన్ స్టైల్ లాంగ్ ఫ్రాక్ తో కావ్య థాపర్ చాలా గ్లామరస్ గా కనిపించింది. అల్ట్రా మోడ్రన్ లుక్ లో తన అందంతో అందరిని కట్టిపడేసింది. ఈ ఫోటోలను కావ్య థాపర్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. అవి కాస్తా ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

# ప్రభాస్.. ఆ ఒక్క ప్రాజెక్టు కోసం ఇలా..

రాజమౌళి, ప్రశాంత్ నీల్ తర్వాత ఇండియాలో ఇప్పుడు ఎక్కువమంది చర్చించుకుంటున్న పేరు సందీప్ రెడ్డి వంగా. హై ఎమోషన్స్ ఉండే వ్యక్తిని హీరోగా రిప్రజెంట్ చేస్తూ 'అర్జున్ రెడ్డి'తో ప్రేమకథని చెప్పి సందీప్ రెడ్డి సూపర్ సక్సెస్ అందుకున్నారు. నెక్స్ట్ 'యానిమల్' తో మోస్ట్ వైలెంట్ ఆటిట్యూడ్ ఉన్న హీరోగా రణబీర్ కపూర్ ని చూపించి దేశ వ్యాప్తంగా తన గురించి చర్చించుకునేలా చేశాడు. 'యానిమల్' మూవీకి పబ్లిక్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అదే సమయంలో క్రిటిక్స్, మేధావుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. విమర్శలు ఎదురైన తన స్టైల్ ఆఫ్ మేకింగ్ లో మార్పులు చేసుకోవడానికి సందీప్ రెడ్డి వంగా సిద్ధంగా లేరు. ఇప్పుడు 'స్పిరిట్' తో నెక్స్ట్ లెవల్ వైలెన్స్ ని తెరపై ఆవిష్కరించడానికి సిద్ధమైపోయాడు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో తెరకెక్కబోతున్న 'స్పిరిట్' మూవీ గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువ చర్చ నడుస్తుందంటే దానికి సందీప్ రెడ్డి మేకింగ్ స్టైల్ కారణం అని చెప్పాలి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' సినిమాలు ఇష్టపడే ప్రేక్షకులు 'స్పిరిట్' మూవీ కోసం చాలా ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నారు. సందీప్ రెడ్డి



లాంటి హై విజనరీ ఉన్న డైరెక్టర్ కి ప్రభాస్ లాంటి భారీ కటౌట్ ఉన్న స్టార్ దొరికితే అద్భుతం చేయడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. అందుకే సినీ అభిమానులు స్పిరిట్ గురించి ఏ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయిన చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు. 'స్పిరిట్' మూవీకి సంబంధించిన ఓ ఇంటెరెస్టింగ్ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక్కసారి 'స్పిరిట్' మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యాక ప్రభాస్ పూర్తిగా ఈ చిత్రం పైనే ఫోకస్ చేయనున్నాడంట. 'స్పిరిట్' తో పాటు మరో ప్రాజెక్ట్ ని ఒకేసారి చేసే అవకాశం లేదనే ప్రచారం నడుస్తోంది. రెండు పడవల ప్రయాణం కాకుండా పూర్తిగా 'స్పిరిట్' సినిమాకి ప్రభాస్ డేట్స్ కేటాయించబోతున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని ఇంటర్నేషనల్ లెవల్ లో మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా ఆవిష్కరించాలనే టార్గెట్ తో ఉన్నాడని బిటౌన్ లో టాక్. దానికోసమే సినిమా బడ్జెట్ కూడా ముందు అనుకున్న దానికంటే భారీగా పెంచారని అంటున్నారు. 'స్పిరిట్' మూవీతో సందీప్ రెడ్డి వంగా, డార్లింగ్ ప్రభాస్ ఇండియాని షేక్ చేయడం గ్యారెంటీ అని ఇండస్ట్రీ వర్గాలలో చర్చ నడుస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ హీరో క్యారెక్టర్ తో పాటు మోస్ట్ వైలెంట్ విలన్ గా కూడా కనిపించబోతున్నాడని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. హీరో, విలన్ క్యారెక్టర్స్ మధ్యలో నడిచే వార్ ని నెవ్వర్ బిఫోర్ అనేలా సందీప్ రెడ్డి వంగా సిద్ధం చేస్తున్నాడని ఆయన సన్నిహిత వర్గాల నుంచి వినిపిస్తోన్న మాట. మరి 'యానిమల్' తోనే దేశం మొత్తం తన వైపు తిరిగి చూసేలా చేసుకున్న సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ తో హాలీవుడ్ దృష్టిని ఆకర్షిస్తాడో లేదో చూడాలి.

# సింగిల్ ఫ్రేమ్ లో ముగ్గురు మొనగాళ్లు



టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున. దాదాపు నాలుగు దశాబ్దాలుగా టాలీవుడ్ లో స్టార్స్ గా వెలుగు వెలుగుతున్న ఈ నలుగురు ఒకే స్టేజ్ పై కనిపించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. వీరిలో కనీసం ఇద్దరు ఒకే స్టేజ్ పై కనిపిస్తే గొప్ప విషయం అన్నట్లుగా ఉంటుంది. అలాంటిది ఒకేసారి ముగ్గురు స్టార్స్ ఒకే వేదిక పై కనిపించి ఫ్యాన్స్ కు కన్నుల విందు చేశారు. తాజాగా దుబాయ్ లో జరిగిన ఐఫా అవార్డు వేడుకలో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. స్టేజ్ పై చిరంజీవి ని బాలకృష్ణ హత్తుకున్న ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వీరిద్దరి మధ్య నాలుగు దశాబ్దాలుగా పోటీ తత్వ వాతావరణం ఉంది. అయినా ఇద్దరూ ఇలా కలిసిన సమయంలో చాలా సరదాగా గడపడం, మనసు విప్పి మాట్లాడుకోవడం చేస్తూ ఉంటారు. చిరంజీవి, బాలయ్య ల మధ్య విభేదాలు అంటూ వచ్చే వార్తలకు ఇలాంటి ఫోటోలు సమాధానం చెబుతూ ఉంటాయి. వీరిద్దరితో పాటు ఇదే ఫోటోలో వెంకటేష్ సైతం ఉండటంతో ఫ్యాన్స్ కి మరింత కన్నుల విందుగా ఉంది. సోషల్ మీడియాతో పాటు అన్ని చోట్ల ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ముగ్గురు అవార్డు వేడుక కోసం దుబాయి కి వెళ్లడం జరిగింది. ప్రతిష్టాత్మక ఐఫా అవార్డు వేడుకలో గతంలో పలువురు స్టార్స్ పాల్గొన్నారు. అయితే ఈసారి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న విధంగా ఈ ముగ్గురు ఫోటోలకు ఫోజ్ లు ఇచ్చారు. ఐఫా అవార్డుల గురించి తెలుగు మీడియా తో పాటు, ప్రేక్షకుల్లో ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఐఫా వేడుకలు దుబాయ్ లో వైభవంగా, తారా తోరణం గా సాగింది. కన్నుల పండుగగా జరిగిన ఈ వేడుక లో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లు పాల్గొనడం వల్ల ఆ వేడుక స్థాయి మరింత పెరిగిందని అభిమానులతో పాటు , ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ముగ్గురు స్టార్ హీరోల్లో కనీసం ఇద్దరు అయినా కలిసి సినిమాల్లో నటిస్తే బాగుండు అనే అభిప్రాయాన్ని చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో వీరు తరచు కలుస్తూ ఉన్నారు. గతంతో పోల్చితే వీరి మధ్య సన్నిహిత సంబంధాలు పెరిగాయి. యంగ్ హీరోల మధ్య ఉన్న స్నేహ సంబంధాలు సీనియర్ ల మధ్య లేవు అనే విమర్శలకు ఇలాంటి ఫోటోలు సమాధానంగా నిలుస్తాయి. ముందు ముందు వీరి కలయికలో మరిన్ని ఫోటోలు.. సినిమాలూ రావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి ఈ ఫోటోలను చూసి సినీ ప్రేమికులు ఫుల్ ఫిదా అవుతున్నారు.

# డిసెంబర్ లో ఇంకెంతమంది వస్తారో




ఈ ఏడాది డిసెంబర్ నెల టాలీవుడ్ ఇండస్ట్రీకి మోస్ట్ ప్రెస్టీజియస్ గా మారేలా కనిపిస్తోంది. దీనికి కారణం టాలీవుడ్ లో ఎక్కువ క్రేజ్ ఉన్న సినిమాలు రిలీజ్ కాబోతూ ఉండటమే. డిసెంబర్ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమాలైన 'పుష్ప2', 'గేమ్ చేంజర్' డిసెంబర్ నెలలోనే ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాయి. డిసెంబర్ 6న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప 2' రిలీజ్ కాబోతోంది. డిసెంబర్ 20న 'గేమ్ చేంజర్' రిలీజ్ ఆల్ మోస్ట్ కన్ఫర్మ్ అయినట్లే. ఈ డేట్స్ మేగ్జిమమ్ మారే ఛాన్స్ అయితే లేదని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ లకి ఈ రెండు సినిమాలు కెరియర్ పరంగా చాలా కీలకమైన ప్రాజెక్ట్స్ అని చెప్పాలి. 'పుష్ప 2' పైన ఇప్పటికే 550 కోట్ల థీయాట్రికల్ బిజినెస్ జరిగిందనే మాట వినిపిస్తోంది. 'గేమ్ చేంజర్' మూవీ బిజినెస్ కూడా క్లోజ్ చేసే పనిలో దిల్ రాజు ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్ట్స్ మధ్యలో మరో ప్రెస్టీజియస్ చిత్రంగా నాగ చైతన్య 'తండేల్' మూవీ డిసెంబర్ లో వచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. నిర్మాతగా బన్నీ వాస్ కెరియర్ లో ఇదే పెద్ద ప్రాజెక్ట్ గా ఉంది. అయితే 'గేమ్ చేంజర్' కి పోటీగా 'తండేల్' రిలీజ్ చేస్తారా అంటే అప్పుడే ఏమీ చెప్పలేమని సినీ విశ్లేషకులు అంటున్నారు. దీంతో పాటు నితిన్ 'రాబిన్ హుడ్' కూడా డిసెంబర్ 20కి రిలీజ్ కన్ఫర్మ్ అయ్యింది. ఒక వేళ ఈ మూవీ వాయిదా పడితే దిల్ రాజు బ్యానర్ లో నితిన్ చేస్తోన్న 'తమ్ముడు' మూవీ రిలీజ్ అవ్వొచ్చని టాక్ వినిపిస్తోంది. దాంతో పాటు సితార ఎంటర్టైన్మెంట్స్ లో సూపర్ హిట్ మూవీ 'మ్యాడ్' కి సీక్వెల్ గా రెడీ అవుతోన్న 'మ్యాడ్ స్క్వేర్' ని రిలీజ్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారంట. 'తమ్ముడు', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాల రిలీజ్ అవకాశాలని పరిశీలిస్తున్నారని టాక్. ఒక వేళ 'గేమ్ చేంజర్' వాయిదా పడితే దిల్ రాజు 'తమ్ముడు' చిత్రాన్ని రేసులోకి తీసుకురావొచ్చని అనుకుంటున్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల నుంచి వినిపిస్తోన్న టాక్ ప్రకారం అయితే డిసెంబర్ రేస్ లో మూడు పాన్ ఇండియా సినిమాలు మరో రెండు మీడియం రేంజ్ మూవీస్ అయితే రిలీజ్ కి కనిపిస్తున్నాయి. వీటిలో ఫైనల్ గా ఎన్ని బాక్సాఫీస్ దగ్గర పోటీ పడతాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పుష్ప 2 రిలీజ్ డేట్ లో అయితే మార్పు ఉండదు. డిసెంబర్ 20న క్రిస్మస్ కి పోటీ పడబోతున్న సినిమాల రిలీజ్ డేట్స్ లలో మాత్రం మార్పులు ఉండొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బుట్ట బొమ్మ మరీ ఇంత సైలెంట్ గానా..?

రెండేళ్ల క్రితం తెలుగులో స్టార్ సినిమా అంటే చాలు ఫస్ట్ పూజా హెగ్డే దగ్గరకు వెళ్లాకే ఆ నెక్స్ట్ వేరే హీరోయిన్ దగ్గరకు వెళ్లే పరిస్థితి కనిపించింది. ఐతే ఆ ఇయర్ చేసిన సినిమాలన్నీ నిరాశపరచడంతో పూజాని లైట్ తీసుకున్నారు మన మేకర్స్. మహేష్ గుంటూరు కారంలో కొంత పార్ట్ షూట్ లో పాల్గొన్నా కొన్ని కారణాల వల్ల ఆ సినిమా నుంచి తప్పుకుంది అమ్మడు. అప్పటి నుంచి పూజా హెగ్డే ఖాతాలో ఒక్క తెలుగు సినిమా పడలేదు. తనకు స్టార్ డం ఇచ్చిన టాలీవుడ్ మీద అమ్మడు ప్రేమ చూపిస్తున్నా ఇక్కడ మాత్రం ఆమెను అసలు ఎవరు పట్టించుకోవట్లేదు. అందుకే తనకు అవకాశం ఇస్తున్న బాలీవుడ్, కోలీవుడ్ సినిమాలనే చేస్తూ వస్తుంది అమ్మడు. ప్రస్తుతం తమిళ్ లో సూర్య హీరోగా చేస్తున్న సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. సూర్య 44వ సినిమాగా వస్తున్న ఈ



సినిమాను కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాలో సూర్య గ్యాంగ్ స్టర్ గా కనిపించనున్నారు. కార్తీ వింటేజ్ లుక్ తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచింది. ఐతే ఈమధ్యనే షూటింగ్ మొదలు పెట్టిన ఈ సినిమాలో తన పోర్షన్ కంప్లీట్ చేసిందట పూజా హెగ్డే. ఇంత సైలెంట్ గా షూటింగ్ అయిపోవడం ఏంటని ఆడియన్స్ ఆశ్చర్యపడుతున్నారు. పూజా హెగ్డే పోర్షన్ అంతా పూర్తి చేసి ఆమెకు చిత్ర యూనిట్ గుడ్ బై చెప్పేశారట. సూర్య 44 తో పాటు హిందీలో ఒక సినిమా చేస్తున్న పూజా హెగ్డే ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. విజయ్ తో బీస్ట్ సినిమా చేసిన పూజా హెగ్డే ఆ తర్వాత మరో ఛాన్స్ అందుకోలేదు. మళ్లీ సూర్య 44 లో అవకాశం దక్కించుకుంది. సూర్య 44 సినిమా ఒక మంచి కమర్షియల్ ఎంటర్టైనర్ గా వస్తుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమా సూర్య ఫ్యాన్స్ తో పాటు కామన్ ఆడియన్స్ కు నచ్చేస్తుందని అంటున్నారు. కోలీవుడ్ లో తీస్తున్న సరే సూర్య 44 సినిమాను తెలుగులో కూడా రిలీజ్ చేసే ప్లాన్ లో ఉన్నారు. కుదిరితే ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ కూడా చేయాలని మేకర్స్ ట్రై చేస్తున్నారు. సో బాలీవుడ్ లో పూజా క్రేజ్ సూర్య 44 సినిమాకు కలిసి వస్తుందని చెప్పొచ్చు.

# అర్జున్ రెడ్డి బ్యూటీకి ఎట్టకేలకు ఓ బిగ్ ఛాన్స్..!

విజయ్ దేవరకొండ హీరోగా సందీప్ వంగ దర్శకత్వంలో వచ్చిన అర్జున్ రెడ్డి ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ సినిమా భారీ వసూళ్లు నమోదు చేయడంతో పాటు హీరో విజయ్ దేవరకొండ కి, హీరోయిన్ షాలిని పాండే కి మంచి గుర్తింపు ను తెచ్చి పెట్టింది. ఇద్దరి మధ్య రొమాన్స్, ముద్దు సన్నివేశాలు ఇలా ప్రతి ఒక్కదాని గురించి జరిగిన చర్చతో షాలిని పాండే గురించి చాలా వార్తలు వచ్చాయి. టాలీవుడ్ లో ఆమె బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో షాలిని పాండే కు అర్జున్ రెడ్డి తర్వాత ఆ స్థాయి విజయం దక్కలేదు. టాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లోనూ అడపా దడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఈ అమ్మడు ఎట్టకేలకు ఓ బిగ్ ఛాన్స్ ను దక్కించుకుంది. తమిళ స్టార్ హీరో ధనుష్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించే అవకాశంను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. టాలీవుడ్ లో దక్కని గుర్తింపును కోలీవుడ్ లో ఈ అమ్మడు వెతుక్కుంటుంది. అందుకే ధనుష్ తో ఛాన్స్ వచ్చిన వెంటనే ఏమాత్రం వెనకాడకుండా ఓకే చెప్పింది. ధనుష్ స్వీయ



దర్శకత్వంలో నటిస్తున్న ఈ సినిమా లో ఇప్పటికే నిత్యా మీనన్ హీరోయిన్ గా నటించబోతుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు మరో హీరోయిన్ గా షాలిని పాండేను ఎంపిక చేయడం జరిగిందట. ధనుష్ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో దూసుకు పోతున్నాడు. ఒక వైపు ఇతర దర్శకులతో కలిసి సినిమాలు చేస్తున్న ధనుష్ మరోవైపు సొంత దర్శకత్వం లోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉన్నాడు. ఇటీవలే రాయన్ సినిమాతో దర్శకుడిగా హిట్ కొట్టిన ధనుష్ తాజాగా 'ఇడ్లీ కడై' అనే చిత్రాన్ని ప్రకటించాడు. చిన్న బడ్జెట్ తో ధనుష్ చేయబోతున్న ఈ ప్రయోగాత్మక సినిమాలో నిత్యా మీనన్ హీరోయిన్ గా నటించబోతుంది. కీలక పాత్రకు గాను షాలిని పాండే ను ఎంపిక చేయడం జరిగిందని తెలుస్తోంది. షాలిని పాండే కి ప్రాముఖ్యత ఉన్న పాత్ర లభిస్తే తప్పకుండా ఆమె ఇండస్ట్రీలో మరిన్ని ఆఫర్లు సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇడ్లీ కడై సినిమాను ధనుష్ దర్శకత్వంలో డాన్ పిక్చర్స్, వండార్బార్ ఫిలిమ్స్ బ్యానర్ లు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ ఈ సినిమా కోసం సంగీతాన్ని అందిస్తున్నాడు. ఇప్పటికే పాటల రికార్డింగ్ పూర్తి అయ్యాయి అనే వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ఈ సినిమాను ధనుష్ ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాడు. మరో వైపు ధనుష్ తన ప్రస్తుత సినిమాను శేఖర్ కమ్ముల దర్శకత్వంలో చేస్తున్నాడు. కుబేరా టైటిల్ తో రూపొందుతున్న ఆ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటించడం విశేషం.

Printed, Published & Owned by KOYALKAR RAM DAYANAND, Editor Koyalkar Swetha, Nigha Netram Telugu Daily. H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad, Telangana State, Printed at Swetha Offset Printers, H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad. e-mail : neeganethram@rediffmail.com. Cel No. 9440090053